www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 27-4-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 28 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం; తిథి: అమావాస్య రా.1.02 తదుపరి పాడ్యమి; నక్షత్రం: అశ్విని రా.12.39 తదుపరి భరణి; వర్జ్యం: రా.9.09-10.33; దుర్ముహూర్తం: సా.4.49-5.40; అమృతఘడియలు: సా.6.21-7.45; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.30 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేటి మ్యాచ్‌లు

ముంబై x లఖ్‌నవూ	మ.3.30 నుంచి	వేదిక: ముంబై
ఢిల్లీ x బెంగళూరు	రా.7.30 నుంచి	వేదిక: ఢిల్లీ

రెండో స్థానంలో ప్రజ్ఞానంద

వార్సా: గ్రాండ్ చెస్ టూర్ పోలెండ్ అంచె..ర్యాపిడ్ రౌండ్‌లో భాగంగా తొలిరోజు మూడు రౌండ్లు ముగిసే సరికే భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద (4) సంయు క్తంగా రెండో స్థానంలో నిలిచాడు. మొత్తం 10 మంది తలపడుతున్న ఈ టోర్నీలో శనివారం తొలి రౌండ్‌లో లగ్రావ్‌పై, రెండో గేమ్‌లో సహచరుడు అరవింద్ చిదంబరంపై గెలిచిన ప్రజ్ఞానంద.. మూడో రౌండ్‌లో డానియల్ చేతిలో ఓడాడు. అరవింద్ చిదంబరం (3) సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నాడు.



న్యూఢిల్లీలో జరుగుతున్న ఆసియా యోగాసన చాంపియన్‌షిప్‌లో ఓ క్రీడాకారిణి అద్భుత విన్యాసం

ఆసియా బాక్సింగ్‌లో 43 పతకాలు ఖాయం

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు జోరు మీదున్నారు. శనివారం మరో నలుగురు సెమీఫైనల్ చేరారు. అండర్-17 బాలురలో అమన్ సివాచ్ (63కి.), దేవాన్ష్ (80కి.), బాలికల్లో సిమర్జీత్ కౌర్ (60కి.), హిమాన్షి (70కి.) క్వార్టర్స్‌లో ప్రత్యర్థులను చిత్తు చేశారు. దీంతో టోర్నీలో భారత్‌కు 43 పతకాలు ఖాయమయ్యాయి. సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు కనీసం కాంస్య పతకం దక్కుతుంది. అండర్-15 విభాగంలో కనీసం 25, అండర్-17 కేటగిరిలో 18 పతకాలు మనకు లభించనున్నాయి.

మనోళ్లు ఏం చేస్తారో?

నేటినుంచి సుదీర్మన్ కప్
తొలిపోరులో డెన్మార్క్‌తో భారత్ ఢీ



గ్జియామెన్ (చైనా): ప్రతిష్ఠాత్మక సుదీర్మన్ కప్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆదివారం ఇక్కడ ప్రారంభం కానుంది. బ్యాడ్మింటన్‌లో.. వరల్డ్ కప్‌తో సమానంగా భావించే ఈ టోర్నీ ఇప్పటి వరకు 18సార్లు జరిగితే.. చైనా (13సార్లు), దక్షిణ కొరియా (4సార్లు), ఇండోనేసియా (ఒకసారి) మాత్రమే విజేతలుగా నిలిచాయి. ఇక..రెండుసార్లు (2011, 2017) క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరడమే ఈ టోర్నీలో భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన. డెన్మార్క్, రెండోసీడ్ ఇండోనేసియా, ఇంగ్లండ్‌లతో కలిసి భారత జట్టు గ్రూప్-డి నుంచి తలపడుతోంది. 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ఒక్కో గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్స్ చేరతాయి. ఫైనల్ మే 4న జరగనుంది. పురుషులు, మహిళల స్టార్ జోడీలు సాత్విక్/చిరాగ్, గాయత్రి/ట్రీసా లేకపోవడం భారత జట్టుకు పెద్ద దెబ్బ. ఈనేపథ్యంలో..ప్రతి పోరులో మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం ధ్రువ్ కపిల/తనీషా శుభారంభం అందించాల్సి ఉంటుంది. సింగిల్స్‌లో భారత ఆశలన్నీ లక్ష్యసేన్, పీవీ సింధుపైనే. అలాగే అనుభవజ్ఞుడైన ప్రణయ్, అనుపమ ఎలా ఆడతారన్నది ఆసక్తికరం. సాత్విక్/చిరాగ్ అనారోగ్యంతో టోర్నీ నుంచి వైదొలగడంతో హరిహరన్/రూబన్ కుమార్ జంట ఏమాత్రం సత్తా చాటుతుందో చూడాలి. మహిళల డబుల్స్‌లో శ్రుతి మిశ్రా/ప్రియా కొంజెన్‌బామ్ బరిలో నిలిచారు. సతీష్ కుమార్/ఆద్య మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండో జోడీగా ఉంది. భారత్ తన తొలి మ్యాచ్‌ను ఆదివారం డెన్మార్క్‌తో ఆడనుంది. ఆ తర్వాత మంగళవారం ఇండోనేసియాతో, గురువారం ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది.

బోణీ కొట్టేదెవరో?



ఉదయం 10 గం. నుంచి

- శ్రీలంకతో భారత్ పోరు నేడు
- మహిళల ముక్కోణపు వన్డే సిరీస్

కొలంబో: ఐదు నెలల్లో మహిళల వన్డే వరల్డ్ కప్ జరగనున్న నేపథ్యంలో బౌలింగ్‌ను మరింతగా మెరుగులు దిద్దుకోవాలని భారత జట్టు భావిస్తోంది. ఈ క్రమంలో ఆతిథ్య శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లతో కలిసి పోటీపడుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌ను సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకొంటోంది. ఆదివారం జరిగే తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. ఈ మ్యాచ్‌లో యువ పేసర్ కశ్వీ గౌతమ్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో ప్రదర్శనతో భారత జట్టులో తొలిసారి చోటు పట్టేసిన కశ్వీకి ఈ మ్యాచ్ ఎంతో కీలకం. ఇక, హర్మన్, స్మృతి మంధాన, రిచా ఘోష్, హర్లీన్ డియోల్‌తో భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. అయితే, టిటాస్ సాధు, రేణుక, పూజ గాయాల బారిన పడడంతో బౌలింగ్ విభాగం కొంత బలహీనంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో అరుంధతి, అమన్‌జోత్‌పైనే పేస్ బౌలింగ్ భారం పడనుంది. ఇక, మ్యాచ్‌కు వేదికైన ప్రేమదాస స్టేడియం వికెట్ స్పిన్ బౌలర్లకు అనుకూలం కావడంతో దీప్తి శర్మ, స్నేహ్ రాణాతోపాటు తెలుగమ్మాయి శ్రీ చరణి ఎక్కువ ఓవర్లు బౌల్ చేసే చాన్సులున్నాయి. మరోవైపు చమరి ఆటపట్టు సారథ్యంలో శ్రీలంక జట్టు సొంతగడ్డపై జరుగుతున్న ఈ టోర్నీలో శుభారంభం చేయాలనే పట్టుదలతో ఉంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
ముంబై	9	5	4	0	10	0.673
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	9	3	5	1	7	0.212
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
రాజస్థాన్	9	2	7	0	4	-0.625
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

వరుణుడిదే విజయం



పంజాబ్ 201/4
ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ అర్ధసెంచరీలు
కోల్‌కతా ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం

మ్యాచ్ రద్దు.. ఇరు జట్లకు చెరో పాయింట్

కోల్‌కతా: తాజా ఐపీఎల్‌లో తొలిసారి ఓ మ్యాచ్ వర్షార్పణమైంది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్‌కు వరుణుడు అడ్డు తగిలాడు. అయితే మొదట పంజాబ్ ఇన్నింగ్స్ సజావుగానే సాగింది. కానీ ఆ తర్వాత భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన కోల్‌కతా కేవలం ఒక ఓవర్ మాత్రమే ఆడగలిగింది. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ఆరంభం కావడంతో ఇరు జట్ల ఆటగాళ్లు పెవిలియన్‌కు చేరారు. వెంటనే పూర్తి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచినా వర్షం మాత్రం తెరిపినివ్వలేదు. గంటన్నర వేచి చూసినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో రాత్రి 11 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (49 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 83), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 69) మెరుపు అర్ధసెంచరీలు సాధించగా.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. వైభవ్ అరోరాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో మ్యాచ్ ఆగే సమయానికి నైట్‌రైడర్స్ ఒక ఓవర్‌లో వికెట్ కోల్పోకుండా ఏడు పరుగులు సాధించింది.

ఓపెనర్లు అదుర్స్: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్‌కు ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య అదిరే ఆరంభాన్నిచ్చారు. కెప్టెన్ నిర్ణయాన్ని వమ్ము చేయకుండా ఇన్నింగ్స్‌ను కదం తొక్కించారు. చక్కటి సమన్వయంతో పాటు ఇద్దరూ పోటాపోటీ బౌండరీలతో చెలరేగారు. అయితే 15 ఓవర్లలోనే 161 స్కోరుతో ఉన్న వేళ పంజాబ్ స్కోరు సులువుగా 220కి చేరుతుందనిపించింది. కానీ డెత్ ఓవర్లలో కోల్‌కతా పేసర్లు కట్టడి చేశారు. దీంతో జట్టు కష్టంగా 200 దాటగలిగింది. అంతకుముందు ప్రియాన్ష్ తొలి బంతినే ఫోర్‌గా మలిచి తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. నాలుగో ఓవర్‌లో ఆర్య 4,4.. ఐదో ఓవర్‌లో ప్రభ్ 4,6తో పవర్‌ప్లేలో జట్టు 56 రన్స్ సాధించింది. అలాగే హర్షిత్ ఓవర్‌లో ఆర్య వరుసగా 4,6,4తో 27 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఇక 11వ ఓవర్‌లో ప్రభ్ రెండు సిక్సర్లు, ఆర్య ఓ సిక్సర్‌తో స్పిన్నర్ నరైన్ 22 పరుగులిచ్చుకున్నాడు. ఓవర్‌కు 10 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళుతున్న ఈ జోడీకి రస్సెల్ చెక్ పెట్టాడు. 12వ ఓవర్‌లో ప్రియాన్ష్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆర్య నిష్క్రమించాక ప్రభ్‌సిమ్రన్ బ్యాట్ ఝుళిపించాడు. 13వ ఓవర్‌లోనే 4,4,6తో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. స్పిన్నర్ వరుణ్ ఓవర్‌లో ప్రభ్ 4,4,6,4 బాదడంతో 19 పరుగులు వచ్చాయి. అయితే సెంచరీ ఖాయమనుకున్న వేళ పేసర్ వైభవ్ విసిరిన లో ఫుల్‌టా‌స్‌కు ప్రభ్ క్యాచ్ అవుటయ్యాడు. అయితే అప్పటికి ఓవర్‌కు 11 పరుగుల రన్‌రేట్‌తో పంజాబ్ దూసుకెళుతోంది. కానీ రస్సెల్, వైభవ్ డెత్ ఓవర్లలో కట్టడి చేశారు. ఈ సమయంలో మ్యాక్స్‌వెల్ (7), జాన్సెన్ (3) వికెట్లను సైతం కోల్పోయిన పంజాబ్ ఆఖరి ఆరు ఓవర్లలో చేసింది 43 పరుగులే. ఇక, శ్రేయాస్ క్రీజులోనే ఉన్నా భారీ షాట్లు ఆడలేకపోయాడు.



ప్రియాన్ష్ ఆర్య (69)
ప్రభ్‌సిమ్రన్ సింగ్ (83)

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) వైభవ్ (బి) రస్సెల్ 69, ప్రభ్‌సిమ్రన్ (సి) పావెల్ (బి) వైభవ్ 83, శ్రేయాస్ (నాటౌట్) 25, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 7, జాన్సెన్ (సి) వెంకటేశ్ (బి) వైభవ్ 3, ఇంగ్లిస్ (నాటౌట్) 11, ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 201/4; వికెట్ల పతనం: 1-120, 2-160, 3-172, 4-184; బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-34-2, సకారియా 3-0-39-0, హర్షిత్ 2-0-27-0, వరుణ్ 4-0-39-1, నరైన్ 4-0-35-0, రస్సెల్ 3-0-27-1.

కోల్‌కతా: గుర్బాజ్ (నాటౌట్) 1, నరైన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం:** ఒక ఓవర్‌లో 7/0; **బౌలింగ్:** మార్కో జాన్సెన్ 1-0-6-0.

అసమానతలు తగ్గించాలి



ఐపీఎల్-దేశవాళీ క్రికెట్‌పై గవాస్కర్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో రాణిస్తే భారత క్రికెట్ జట్టులో చోటు దక్కించుకోవడం సులువనే అభిప్రాయం అంతటా వ్యక్తమవుతుంటుంది. ఒక్క సీజన్‌లో అదరగొడితే చాలు అభిమానులు కూడా అందలం ఎక్కిస్తుంటారు. ఇప్పటికే ఈ లీగ్ ద్వారా ఎంతోమంది జాతీయ జట్టులోకి వచ్చారు. మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లు మాత్రం పెద్దగా ఎవరి దృష్టిలోకి రావడం లేదు. ఐపీఎల్‌తో పోలిస్తే వీరికి చాన్స్‌ల పరంగానే కాకుండా జీతభత్యాల విషయంలోనూ భారీ వ్యత్యాసమే కనిపిస్తుంటుంది. ఇదే విషయాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ గుర్తుచేస్తున్నాడు. 'అనామక క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో రాణిస్తే గౌరవం దక్కించుకుంటాడు. అదే రంజీ ట్రోఫీలో గొప్ప ప్రదర్శన చేసే ఆటగాడు కనీసం హెడ్‌లైన్స్‌లోనూ కనిపించడు. కెరీర్ మొత్తం రంజీల్లో ఆడినా రాని పేరు ఒక్క ఐపీఎల్ సీజన్‌లో రాణిస్తే వస్తుంది. దీనికితోడు దేశవాళీ క్రికెట్‌లో అన్ని టోర్నీల్లో ఆడినా కూడా ఐపీఎల్ అన్‌క్యాప్డ్ ప్లేయర్ కనీస ధర అయిన రూ.30 లక్షలు కూడా రావు. ఈ అసమానతలను తగ్గించే బాధ్యత రాష్ట్రాల క్రికెట్ బోర్డులతో పాటు బీసీసీఐపైనా ఉంది' అని గవాస్కర్ సూచించాడు.

'మాడ్రిడ్'లో జొకోవిచ్‌కు షాక్



అర్నాల్డి

మాడ్రిడ్: కెరీర్‌లో 100వ టైటిల్‌పై గురిపెట్టిన టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌కు మాడ్రిడ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ సెర్బియా యోధుడు అనూహ్యంగా ఆరంభ రౌండ్లోనే కంగుతిన్నాడు. ఇటలీకి చెందిన 44వ ర్యాంకర్ మ్యాటో అర్నాల్డి 5-3, 6-4తో 4వ సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. ఇటీవలి కాలంలో వరుసగా విఫలమవుతున్న 37 ఏళ్ల జొకోవిచ్.. ఆరంభ మ్యాచ్‌లో ఓడడం గత ఐదు ఈవెంట్లలో అతనికిది నాలుగోసారి కావడం గమనార్హం.

బిజినెస్ ప్లస్



చుక్కల్లో పసిడి ధర..
మదుపు చేయటం ఎలా?

పసిడి ధర జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో రికార్డులు సృష్టిస్తోంది. దేశీయ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ఈ మధ్యనే రూ.లక్ష తాకింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 3,500 డాలర్లను అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ బుల్ రన్‌లో బంగారంలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న అవకాశాలు ఏంటో చూద్దాం..

పసిడి పరుగుకు ఇప్పట్లో బ్రేక్ పడే సూచనలు కనిపించడం లేదు. గత ఏడాది కాలంలో పసిడిలో పెట్టుబడులు పెట్టిన మదుపరులకు 40 శాతం వరకు లాభాలు పంచాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోరుతో పసిడి ధర ఇప్పటికే రికార్డు స్థాయికి చేరింది. ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే ఈ ఏడాది చివరికల్లా ఔన్స్ పసిడి ధర 3,700 నుంచి 3,950 డాలర్ల మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని ప్రముఖ అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. ఆర్థిక అనిశ్చితి రాజ్యమేలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడుల రక్షణ కోసం పసిడిని మించిన సురక్షిత పెట్టుబడి మరొకటి లేదు. ఈ నేపథ్యంలో రిటైల్ మదుపరులకు పసిడిలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న మార్గాలు ఏమిటో పరిశీలిద్దాం..

లిస్టెడ్ ఎస్‌జీబీలు

కొత్తగా సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) జారీని ప్రభుత్వం నిలిపి వేసింది. అయితే 2015 నుంచి 67 విడతలుగా జారీ చేసిన 14.7 కోట్ల యూనిట్ల ఎస్‌జీబీలు ఇప్పటికే బీఎస్ఈ, ఎన్ఎస్ఈ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడవుతున్నాయి. కొన్ని ప్లాట్‌ఫామ్స్‌లో ఇవి మూడు నుంచి నాలుగు శాతం డిస్కౌంట్‌కు కూడా లభిస్తున్నాయి. డీమ్యాట్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు ఎస్‌జీబీలు అత్యంత అనువైనవి. ఎనిమిదేళ్ల కాలపరిమితితో జారీ చేసిన ఈ ఎస్‌జీబీల లాక్ ఇన్ పీరియడ్ ఐదేళ్లు. ఐదు, ఆరు, ఏడేళ్ల గడువు ముగిసిన ఎస్‌జీబీలను ఆర్‌బీఐ బైబ్యాక్ కూడా చేస్తుంది. పెట్టుబడుల వివిధీకరణ కోరుకునే మదుపరులు సెకండరీ మార్కెట్లో లభిస్తున్న ఎస్‌జీబీలనూ పరిశీలించవచ్చు.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

నేరుగా బంగారం కొని దాచుకోలేని మదుపరుల ముందు ఉన్న మరో ఆప్షన్ గోల్డ్ ఈటీఎఫ్‌లు. డీమ్యాట్ ఖాతా ఉన్న ఎవరైనా వీటిని కొనుగోలు చేయవచ్చు. ఒక్కో గోల్డ్ ఈటీఎఫ్.. యూనిట్ల రూపంలో అందుబాటులో ఉంటాయి. వీటి ధరలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఇవి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కూడా లిస్టయి ఉంటాయి. కాబట్టి ఎప్పుడు కావాలంటే అప్పుడు ట్రేడింగ్ రోజుల్లో వీటిని కొనుగోలు చేయవచ్చు. కాకపోతే ఇందుకు కొద్దిగా బ్రోకరేజీ చార్జీలు చెల్లించాలి. గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌తో పోలిస్తే వీటి నిర్వహణ ఖర్చుల నిష్పత్తి తక్కువ. అయితే వీటిని అమ్మాలన్నా.. కొనాలన్నా ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

గోల్డ్ ఎంఎఫ్‌లు

పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు అందించే గోల్డ్ ఎంఎఫ్‌లనూ పరిశీలించవచ్చు. ఇవి ఓపెన్ ఎండెడ్ ఎంఎఫ్ పథకాలు. ఈ పథకాల ద్వారా సమీకరించే నిధులను ఎంఎఫ్‌లు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో మదుపు చేస్తాయి. ట్రేడింగ్ డే ముగిసిన వెంటనే ఎంఎఫ్‌లు ఈ గోల్డ్ ఎంఎఫ్‌ల ఎన్‌ఏవీల (నెట్ అసెట్ వాల్యూ)ను ఏ రోజుకు ఆ రోజు ప్రకటిస్తాయి. వీటిలో ఇన్వెస్ట్ చేసేందుకు డీమ్యాట్ ఖాతా అవసరం లేదు. కాకపోతే గోల్డ్ ఈటీఎఫ్‌లతో పోలిస్తే గోల్డ్ ఎంఎఫ్‌ల ఖర్చులు కొద్దిగా ఎక్కువ. మొత్తం ఎన్‌ఏవీలో ఈ ఖర్చులు ఒకటి నుంచి రెండు శాతం వరకు ఉంటాయి.

ఫిజికల్ గోల్డ్

మార్కెట్ నుంచి నేరుగా బంగారం కొనుగోలు చేయటం ఒక పద్ధతి. ఇది అందరికీ తెలిసిందే. అయితే ఇలా కొనేటప్పుడు ఆ పసిడి స్వచ్ఛత స్పష్టంగా తెలుసుకోవాలి. లేకపోతే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంది. ఈ బంగారాన్ని భద్రంగా దాచుకోవటం మరో సమస్య. ఈ రెండు అంశాలపై భరోసా ఉన్న మదుపరులు నేరుగా పసిడి కొనుగోలు చేసి అలానే లేదా నగల రూపంలో భద్రపరుచుకోవచ్చు.

ఎంత మదుపు చేయాలి?

మన మొత్తం పెట్టుబడుల్లో ఎంత వాటాను పసిడిలో మదుపు చేయాలనేది పెద్ద ప్రశ్న. సాధారణ పరిస్థితుల్లో కనీసం 10 శాతం, అసాధారణ పరిస్థితుల్లో 15 నుంచి 20 శాతం వరకు పసిడి సాధనాల్లో మదుపు చేయడం మంచిది. దీనివల్ల పెట్టుబడులకు భద్రతతో పాటు కాలం కలిసి వస్తే మంచి లాభాలూ కళ్ల చూడవచ్చు.

ఫారం గేటు అమ్మకం ధరలు



(సెక్ 100 గుడ్లు)

27వ తేదీ	
హైదరాబాద్	410
వరంగల్	412
చిత్తూరు	470
విజయవాడ	425
గోదావరి	415
విశాఖపట్నం	430

డజను గుడ్లు రూ. 60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	122
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	92
కర్నూలు	120	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	122		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,210 ▲	90,020 ▲	1,10,900 ▼
విజయవాడ	99,200 ▲	93,000 ▼	99,700 ▲
విశాఖపట్నం	98,210 ▼	90,020 ▼	1,11,900 ▲
రాజమండ్రి	98,240 ▼	90,050 ▼	1,00,900 ▲
ప్రొద్దుటూరు	97,400 ▼	89,610 ▼	99,500 ▼
ముంబై	95,631 ▼	87,598 ▼	97,684 ▲

జీవిత బీమా పాలసీదారులకు
రైడర్లతో మరింత రక్షణ

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. హఠాత్పరిణామాలను ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండటమే ఉత్తమ వ్యూహం. ఆపద నుంచి రక్షించే కవచాల్లో బీమా ఒకటి. అది ఉంటే మీకే కాదు.. మీ కుటుంబ భవిష్యత్‌కూ ధీమా. అయితే, ఏ బీమా పథకమైనా కొన్ని సందర్భాల్లో పాలసీదారును ఆకస్మిక అవసరం నుంచి గట్టెక్కించలేకపోవచ్చు. అలాంటప్పుడే రైడర్లు పనికొస్తాయి. పాలసీ కవరేజీని విస్తరించే అదనపు ఫీచర్ల జోడింపే రైడర్. ఇవి పాలసీ పరిధిని విస్తృతపరచడం ద్వారా సంపూర్ణ రక్షణ కల్పిస్తాయి.



టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ పరిగణించాల్సిన పాలసీ. పాలసీదారు పాలసీ గడువు కాలంలో దురదృష్టవశాత్తు మరణిస్తే.. తన కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసాను కల్పిస్తుంది. టర్మ్ పాలసీ ద్వారా ఎంత మేర బీమా కవరేజీ కలిగి ఉండాలన్నది వ్యక్తి లేదా కుటుంబ అవసరంపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, మీ వార్షికాదాయానికి కనీసం 10-15 రెట్ల బీమా కవరేజీ కొనుగోలు చేయడం మేలు. టర్మ్ పాలసీతో పాటు అదనంగా రైడర్లను ఎంపిక చేసుకోవడం ద్వారా మీ భవిష్యత్‌కు సమగ్ర బీమా కవరేజీని పొందవచ్చు. టర్మ్ పాలసీతో పాటు పరిగణించాల్సిన మూడు కీలక రైడర్ల వివరాలు..


యాక్సిడెంటల్ డెత్ అండ్ డిసేబిలిటీ బెనిఫిట్: పాలసీదారు ఒకవేళ యాక్సిడెంట్‌లో మరణిస్తే ఈ రైడర్ కలిగి ఉండటం ద్వారా నామినీకి అదనపు డెత్ బెనిఫిట్ ప్రయోజనాలు లభిస్తాయి. అంతేకాదు, యాక్సిడెంట్ కారణంగా అంగ వైకల్యం ఏర్పడిన సందర్భంలోనూ పాలసీదారుకు ఆర్థిక మద్దతును ఈ రైడర్ కల్పిస్తుంది. ముఖ్యంగా నిర్మాణ రంగం లేదా గనుల్లో పనిచేసే వారు, ఉద్యోగ రీత్యా వాహనంపై సుదీర్ఘ ప్రయాణాలు చేయాల్సిన వారికి ఈ రైడర్ ప్రయోజనకరం.

క్రిటికల్ ఇల్‌నెస్: క్యాన్సర్, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చులకు ఈ రైడర్ కవరేజీ కల్పిస్తుంది. ముఖ్యంగా కుటుంబ పెద్ద లేదా పోషకులు తప్పకుండా కలిగి ఉండాల్సిన రైడర్ ఇది. ఎందుకంటే, ఈ కాలంలో కార్పొరేట్ వైద్యం చాలా ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారింది.

ప్రీమియం రాయితీ: అంగ వైకల్యం లేదా తీవ్ర అనారోగ్యం కారణంగా పాలసీదారు ప్రీమియం చెల్లించలేని స్థితిలోనూ బీమా కవరేజీ కొనసాగేందుకు ఈ రైడర్ తోడ్పడుతుంది. అధిక రిస్క్‌తో కూడిన వృత్తుల వారికిది ప్రయోజనకరం.

జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌కు ఏం కావాలంటే?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్న విషయం తెలిసిందే. అయితే ఈ దరఖాస్తుదారుల్లో వివిధ వర్గాల వారు ఉంటారు. అంటే ప్రొప్రైటర్, పార్ట్‌నర్‌షిప్, కంపెనీ, ట్రస్ట్, సొసైటీ మొదలైనవి. దీనినే 'కానిస్టిట్యూషన్ ఆఫ్ బిజినెస్' అంటారు. మరి వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు సమర్పించాలి? అలాగే సొంత స్థలంలో వ్యాపారం చేసే వారు కొంతమంది కాగా, అద్దె స్థలంలో వ్యాపారం చేసే వారు మరికొందరు ఉంటారు. అలాకాకుండా, వ్యాపారం జరిగే ప్రదేశం కుటుంబ సభ్యుల్లో ఒకరి పేరు మీద ఉంటే.. వ్యాపారం కుటుంబ సభ్యుల్లోనే మరొకరి పేరు మీద ఉండవచ్చు. మరి ఇలాంటి సందర్భాల్లో ఆధారాల కింద ఎలాంటి డాక్యుమెంట్స్ సమర్పించాలనే విషయంలో కొంత గందరగోళం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ వివరాలు మీకోసం..

మొదటిది, సొంత స్థలంలో వ్యాపారం చేస్తుంటే.. అంటే, రిజిస్ట్రేషన్‌లో చూపిన ప్రిన్సిపల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్‌లో చూపిన బిల్డింగ్ సొంతది అయి ఉంటే.. తగు వివరాలతో కూడిన లేటెస్ట్ ప్రాపర్టీ ట్యాక్స్ రసీదు, ఎలక్ట్రిక్ బిల్ అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. లేదంటే వాటర్ బిల్ కూడా ఇవ్వవచ్చు. అది కూడా సాధ్యం కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం లేదా మునిసిపాలిటీ, పంచాయతీ ద్వారా సదరు బిల్డింగ్ యాజమాన్యాన్ని ధ్రువీకరిస్తూ జారీ చేయబడిన ఎలాంటి డాక్యుమెంట్ అయినా అప్‌లోడ్ చేయవచ్చు.

ఒకవేళ ప్రిన్సిపల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్‌లో చూపిన బిల్డింగ్ అద్దెకు తీసుకున్నది అయినట్లయితే, రెంట్ లేదా లీజు డీడ్ అప్‌లోడ్ చేయటంతో పాటుగా భవన యజమానికి సంబంధించిన యాజమాన్యాన్ని ధ్రువీకరించే డాక్యుమెంట్ అంటే ప్రాపర్టీ టాక్స్ రసీదు, ఎలక్ట్రిసిటీ బిల్, ఇవ్వాల్సి ఉంటుంది లేదా ఇంతకు ముందే చెప్పినట్లు యాజమాన్యాన్ని ధ్రువీకరిస్తూ జారీ చేయబడిన ఎలాంటి డాక్యుమెంట్ అయినా అప్‌లోడ్ చేయవచ్చు. అయితే, ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. రెంట్ లేదా లీజు డీడ్ రిజిస్టర్ చేసి ఉంటే పైన తెలిపిన వివరాలు సరిపోతాయి. ఒకవేళ రిజిస్టర్ చేసి ఉండకపోతే స్థల యజమానికి సంబంధించిన ఆధారాన్ని (ఐడెంటిటీ ప్రూఫ్) కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఇకపోతే వ్యాపార స్థలం కుటుంబ సభ్యులకు లేదా బంధువులకు సంబంధించినదై ఉండి.. ఎలాంటి అద్దె లేదా లీజు గానీ లేనిదైతే స్థల యజమాని నుంచి దీనికి సంబంధించి 'సమ్మతి'తో కూడిన పత్రం (కన్సెంట్ లెటర్)తో పాటు స్థల యజమానికి సంబంధించిన ఆధారాన్ని (ఐడెంటిటీ ప్రూఫ్) కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో పాటుగా పైన తెలిపినట్లుగా యాజమాన్యాన్ని ధ్రువీకరించే ఆధారాలు కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఇక, కానిస్టిట్యూషన్ ఆఫ్ బిజినెస్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్ అంటే పార్ట్‌నర్‌షిప్ వ్యాపారానికి సంబంధించి పార్ట్‌నర్‌షిప్ డీడ్ ఇవ్వవలసి ఉండగా..కంపెనీ, సొసైటీ, ట్రస్ట్‌లకు సంబంధించి రుజువులను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే డాక్యుమెంట్స్, ఫొటోలు స్పష్టంగా ఉండేట్లు చూసుకోవటం ముఖ్యం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 27-4-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 28 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: అమావాస్య రా.1.02 తదుపరి పాడ్యమి; నక్షత్రం: అశ్విని రా.12.39 తదుపరి భరణి; వర్జ్యం: రా.9.09-10.33, దుర్ముహూర్తం: సా.4.49-5.40, అమృతఘడియలు: సా.6.21-7.45, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.55, సూర్యాస్తమయం: 6.30 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



'భారత్ సదస్సు-2025'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలు దేశాల ప్రతినిధులు

రాజకీయాల్లోకి..
కొత్త తరం రావాలి

- ప్రజలతో నేరుగా సంబంధాలు నెరపాలి
- పదేళ్ల కిందటి విధానాలు ఇప్పుడు పనికిరావు
- బీజేపీది ప్రతిపక్షాలను తొక్కేసే విధానం
- కాంగ్రెస్ పట్ల పగ, విద్వేషపు దృష్టి కోణం
- విద్వేష రాజకీయాల్ని ప్రేమతో ఎదుర్కొంటాం
- ప్రజల బాధలు వినడమే అత్యంత ముఖ్యం
- భారత్ సదస్సు-2025లో రాహుల్‌గాంధీ
- మా మిషన్‌లో మీరూ చేరండి
- 'తెలంగాణ రైజింగ్' అంబాసిడర్లుగా రాష్ట్ర గొప్పతనాన్ని ప్రపంచానికి చాటండి
- సదస్సులో ప్రతినిధులకు సీఎం రేవంత్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక రాజకీయాలు పూర్తిగా మారిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. పదేళ్ల క్రితం అనుసరించిన రాజకీయ సూత్రాలు, అప్పుడు ప్రభావశీలంగా ఉన్న విధానాలు ఇప్పుడు పనికిరావన్నారు. ప్రస్తుత సమాజంలో ఉత్పన్నమవుతున్న కొత్త తరహా ఆలోచనలకు అనుగుణంగా ఇప్పటి రాజకీయాలు ఉండాలని, రాజకీయాల్లోకి కొత్త తరం రావాలని పిలుపునిచ్చారు. ప్రజలతో నేరుగా సంబంధాలు నెరపాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే ఇప్పుడు మనందరి ముందున్న పెద్ద సవాలు అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన రెండు రోజుల 'భారత్ సదస్సు-2025' ముగింపు రోజైన శనివారం

మిగతా 11వ పేజీలో...

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా
ఖండిస్తాం

- ప్రజాస్వామ్య, కార్మిక ఉద్యమాలకు మద్దతిస్తాం
- భవిష్యత్తు తరాల కోసం శాంతియుత పంథాలో సాగుతాం
- ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వ ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయి
- గళమెత్తే వారిపై నిఘా పెడుతున్నయ్
- మీడియాను తప్పుదోవ పట్టిస్తూ అబద్ధాల ప్రచారం
- భారత్ సదస్సు-2025 తీర్మానం

11

కాళేశ్వరం ఈఎన్సీ.. కళ్లు చెదిరే ఆస్తి


భూక్యా హరిరామ్

- హరిరామ్ ఇల్లు సహా 14 చోట్ల ఏసీబీ సోదాలు
- మర్కూక్‌లో 28 ఎకరాల వ్యవసాయ భూమి
- బొమ్మల రామారంలో 6 ఎకరాల మామిడి తోట
- హైదరాబాద్‌లో విల్లాలు, ప్లాట్లు, ఇళ్లు, స్థలాలు
- ఏపీ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం
- భూక్యా హరిరామ్ అరెస్టు, జ్యుడీషియల్ రిమాండ్
- కాళేశ్వరం నిర్మాణంలో ఈఎన్సీది కీలక పాత్ర
- ఆయన ఆధ్వర్యంలో రూ.48,665 కోట్ల పనులు

హైదరాబాద్, కొత్తగూడెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్) భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శనివారం అరెస్టు అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. మరోపక్క, కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్డీఎస్ఏ) నివేదిక ఇటీవల వెలువడింది. ఈ నేపథ్యంలో హరిరామ్ ఇల్లు, జలసౌధ కార్యాలయం, హరిరామ్

మిగతా 3వ పేజీలో...



సరిహద్దు.. ఉద్రిక్తం!

- పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘన
- హెచ్చరికలు లేకుండానే కాల్పులు
- దీటుగా బదులిస్తున్న మన సైన్యం
- బంకర్లలో తలదాచుకునేందుకు సరిహద్దు గ్రామాల ప్రజల ఏర్పాట్లు
- పహల్గాం ఉగ్రదాడి కేసు విచారణ చేపట్టిన ఎన్ఐఏ

తటస్థ విచారణకు మేం సిద్ధం

- దుస్సాహసం జరిగితే.. పాక్ దళాలు సర్వసన్నద్ధం
- సింధుపై భారత్ ఏకపక్ష వైఖరి సరికాదు.. చర్చలకు రెడీ
- ఉగ్రవాదాన్ని సహించం
- పాక్ ప్రధాని షెహబాజ్

మా నీళ్లు రాకపోతే.. వారి రక్తం ప్రవహిస్తుంది!


బిలావల్ భుట్టో ప్రేలాపనలు

9

నేడే బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో సర్వం సిద్ధం
- అన్ని జిల్లాల నుంచి జన సమీకరణకు ప్రణాళికలు
- 154 ఎకరాల్లో సభా ప్రాంగణం
- మాట్లాడేది కేసీఆర్ ఒక్కరే.. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు?

12



పోప్ ఫ్రాన్సిస్‌కు కన్నీటి వీడ్కోలు

» ముగిసిన అంత్యక్రియలు..హాజరైన రాష్ట్రపతి ముర్ము

వాటికన్ సిటీ, ఏప్రిల్ 26: సోమవారం కన్నుమూసిన పోప్ ఫ్రాన్సిస్ (88) అంత్యక్రియలు రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో శనివారం ముగిశాయి. దాదాపు వంద సంవత్సరాల తర్వాత మొదటిసారిగా ఓ పోప్ అంత్యక్రియలను వాటికన్ సిటీ అవల నిర్వహించారు. పోప్‌కు ఇష్టమైన రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో ఆయన పార్థివ దేహాన్ని ఖననం చేసినట్లు వాటికన్ వర్గాలు వెల్లడించాయి. కాగా, అంత్యక్రియల కార్యక్రమాన్ని ప్రైవేటుగా నిర్వహించారు. కేవలం ఉన్నత స్థాయి కార్డినల్స్, పోప్ సన్నిహితులు మాత్రమే దీనికి హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము సహా 50 దేశాల అధినేతలు, ప్రముఖుల ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, మెక్రాన్, యూకే యువరాజు విలియమ్, ఆ దేశ ప్రధాని కెయిర్ స్టార్మర్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, స్పెయిన్ రాజ కుటుంబసభ్యులు, పలువురు ప్రముఖులు పోప్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే దాదాపుగా 2.50 లక్షల మంది సామాన్య ప్రజలు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా, రాష్ట్రపతి ముర్ము వెంట కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జార్జ్ కురియన్, గోవా డిప్యూటీ స్పీకర్ జాషువా డిసోజా ఉన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు కేసుల సమాచారం ఇవ్వాల్సిందే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లేకుంటే ఎన్నికను రద్దు చేయవచ్చని తెలిపింది. కేసుల వివరాలు వెల్లడించకుంటే అది తప్పుడు అఫిడవిట్ కిందకు వస్తుందని, దాన్ని ఆధారంగా ఎన్నికను కొట్టివేయవచ్చని పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ గ్రామ ప్రధాన్ ఎన్నిక రద్దుకు సంబంధించిన ఓ కేసులో ఈ మేరకు స్పష్టం చేసింది. మండీ జిల్లా పంగన గ్రామ ప్రధాన్‌గా పనిచేసిన బసంత్‌లాల్ క్రిమినల్ కేసు వివరాలను దాచి పెట్టారంటూ ప్రత్యర్థి ఆయనపై గతంలో కేసు పెట్టారు. విచారణ జరిపిన కింది కోర్టులు, హైకోర్టు ఆ ఎన్నికను రద్దు చేయడంతో పాటు, ఆరేళ్ల పాటు పోటీ చేయకూడదంటూ బసంత్‌పై అనర్హత వేటు వేశాయి. దీంతో, ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై క్రిమినల్ కేసును కోర్టు ఎప్పుడో కొట్టేసిందని, ప్రస్తుతం తనపై ఎలాంటి కేసులు లేవని, అయినా ఆరేళ్లపాటు అనర్హత వేటు వేశారని ఆయన వాదించారు. ఇది తీవ్రమైన శిక్ష అని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. అనర్హత వేటు ఆదేశాలు 8వారాల పాటు అమలు చేయకుండా నిలిపివేసింది.

తమిళనాడులో బాణసంచా పేలి ఏడుగురి మృతి

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బాణసంచా కర్మాగారంలో, ఆలయ రథోత్సవం సందర్భంగా జరిగిన బాణసంచా పేలుడు ఘటనల్లో ఏడుగురు దుర్మరణం చెందారు. తమిళనాడులోని విరుదునగర్, సేలం జిల్లాల్లో ఈ ప్రమాదాలు సంభవించాయి. మృతుల్లో ఇద్దరు బాలురు, నలుగురు మహిళలు ఉన్నారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం విరుదునగర్ జిల్లా శివకాశిలోని ఓ బాణసంచా కర్మాగారంలో కార్మికులు రసాయనాల మిశ్రమాన్ని సిద్ధం చేస్తుండగా హఠాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు మరణించగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి సేలం జిల్లా కంచనాయకన్‌పట్టి గ్రామంలో ద్రౌపది అమ్మవారి ఆలయ రథోత్సవం సందర్భంగా మరో ఘటన జరిగింది. కొంతమంది బాణసంచా కాల్చగా, ఆ నిప్పు రవ్వలు ఓ మోటార్ బైక్‌పై ఉంచిన బాణసంచా బస్తాకు అంటుకున్నాయి. ఆ బస్తాలో ఉన్న శక్తిమంతమైన టపాసులు పేలడంతో 11 ఏళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు, ఓ మహిళ సహా నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

ఫిట్‌జీలో నిధుల దారి మళ్లింపు: ఈడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ప్రముఖ కోచింగ్ సంస్థ 'ఫిట్‌జీ'.. ఒక క్రమ పద్ధతిలో రూ.200 కోట్లపై చిలుకు నిధులను దారి మళ్లించిందని ఈడీ ఆరోపించింది. '2025-26 నుంచి 2028-29 వరకూ నాలుగు విద్యా సంవత్సరాలకు కోచింగ్ అందిస్తామని దేశవ్యాప్తంగా 14,411 మంది విద్యార్థుల నుంచి సుమారు రూ.250.2 కోట్ల ఫీజులు వసూలు చేసింది. కానీ, వారికి శిక్షణ అందించలేదు' అని తమ దర్యాప్తులో తేలిందని ఈడీ తెలిపింది. ఢిల్లీ, ముంబై సహా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఫిట్‌జీ 32 కోచింగ్ కేంద్రాలను ఇటీవల అర్ధంతరంగా మూసేసింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదులతో ఫిట్‌జీపై ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసింది.

విద్యార్థుల బహిష్కరణపై వెనక్కి!

అమెరికాలోని విదేశీ విద్యార్థుల సెవిస్ రికార్డుల పునరుద్ధరణ ప్రారంభం

» వందలాది మందికి తాత్కాలిక ఊరట

» కొత్త పాలసీ తీసుకురానున్న ఐసీఈ



ముంబై, ఏప్రిల్ 26: అమెరికాలోని భారత్‌తో పాటు విదేశీ విద్యార్థులకు కొంత ఉపశమనం కలిగించే వార్త. ట్రంప్ ప్రభుత్వం అకస్మాత్తుగా, చట్టవిరుద్ధంగా చేపట్టిన వందలాది మంది విదేశీ విద్యార్థుల సెవిస్(స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) రికార్డుల రద్దు నిర్ణయంపై వెనక్కి తగ్గింది. దేశవ్యాప్తంగా సెవిస్ రికార్డుల పునరుద్ధరణ గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. కోర్టుల ఆదేశాల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. రికార్డుల రద్దును సవాల్ చేస్తూ దావా వేసిన విద్యార్థులతో పాటు అమెరికావ్యాప్తంగా ఉన్న ఇతర విదేశీ విద్యార్థుల సెవిస్ రికార్డుల పునరుద్ధరణ జరుగుతోందని ఇమిగ్రేషన్ న్యాయవాదులు వెల్లడించారు. ఏప్రిల్ 4 తర్వాత యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో 23 మంది విద్యార్థుల సెవిస్ రికార్డులు రద్దు కాగా, వారిలో శనివారం 12 మంది స్టేటస్ తిరిగి యాక్టివ్ అయిందని 'కాలిఫోర్నియన్' పత్రిక పేర్కొంది.

కోర్టుల తాత్కాలిక నిషేధ ఉత్తర్వులు

సెవిస్ ఒక వెబ్ ఆధారిత సమాచార వ్యవస్థ. విదేశీ విద్యార్థులు అమెరికాలో విద్యనభ్యసిస్తున్న సమయంలో వారిని ట్రాక్ చేసేందుకు, పర్యవేక్షించేందుకు అమెరికా ఏజెన్సీలు దీన్ని ఉపయోగిస్తాయి. అయితే అకస్మాత్తు సెవిస్ రద్దు ప్రక్రియ ఈ ఏడాది మార్చి మధ్యలో ప్రారంభమైంది. స్వీయ బహిష్కరణ ప్రమాదం ఎదుర్కొన్న చాలా మంది విద్యార్థులు.. ట్రంప్ ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా పలు జిల్లా కోర్టుల్లో దావాలు వేశారు. జార్జియా, న్యూ హ్యాంప్‌షైర్, మిన్నెసోట, వాషింగ్టన్, విస్కాన్సిన్ వంటి కోర్టులు ప్రభుత్వ చర్యలపై తాత్కాలిక నిషేధ ఉత్వర్వులు ఇచ్చాయి. 1,500 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసాల రద్దుపై ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని న్యూయార్క్ టైమ్స్ నివేదించింది.


త్వరలోనే కొత్త పాలసీ

సెవిస్ రికార్డుల రద్దుపై ట్రంప్ సర్కార్ త్వరలోనే కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలుస్తోంది. సెవిస్ రికార్డుల టెర్మినేషన్ ఫ్రేమ్‌వర్క్‌కు సంబంధించి ఇమిగ్రేషన్ కస్టమ్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ఒక పాలసీ రూపొందించే పనిలో ఉంది. 'ఆ పాలసీ అమల్లోకి వచ్చే వరకు సెవిస్ రికార్డులు యాక్టివ్‌లోనే ఉంటాయి. వాటిని పునరుద్ధరిసున్నాం. కేవలం జాతీయ నేర సమాచార కేంద్రం (ఎన్‌సీఐసీ) ఆధారంగా ఐసీఈ సెవిస్ రికార్డులను మార్చదు..' అనే సమాచారం పలు విద్యాసంస్థలకు అందిందని ఇమిగ్రేషన్ న్యాయవాదులు తెలిపారు. అమెరికాలో నేర సంబంధించి సమాచారం ఎన్‌సీఐసీ వద్ద ఉంటుంది. దీన్ని ఎఫ్‌బీఐకి చెందిన క్రిమినల్ జస్టిస్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ డివిజన్ (సీజేఐఎస్) నిర్వహిస్తుంది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న అన్ని చట్ట అమలు సంస్థలకు ప్రాప్యతను అందించడంతో పాటు వేగంగా సమాచార మార్పిడికి వీలు కల్పిస్తుంది.

ఇమిగ్రేషన్ ఆపరేషన్ అడ్డుకున్నందుకు జడ్జి అరెస్టు

ఇమిగ్రేషన్ అరెస్టు ఆపరేషన్‌ను అడ్డుకున్నందుకు, అరెస్టు నుంచి ఒక వ్యక్తి తప్పించుకొనేందుకు సహకరించారన్న ఆరోపణలపై అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రం మిల్వాకీ కౌంటీ సర్క్యూట్ జడ్జి హన్నా దుగాన్‌ను ఎఫ్‌బీఐ శుక్రవారం అదుపులోకి తీసుకుంది. జడ్జిపై ఒక క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. జడ్జి అరెస్టుపై ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ స్పందించారు. దుగాన్ అరెస్టుకు సంబంధించిన ఫొటోను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ 'చట్టం కంటే ఎవరూ ఎక్కువ కాదు' అని పేర్కొన్నారు. కాగా, ఫెడరల్ అధికారులు ఇటీవల సాక్ష్యాధారాల తారుమారు, వెనిజులన్ స్ట్రీట్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయన్న అభియోగాలపై న్యూ మెక్సికో మాజీ జడ్జి జోయెల్ కానోను అరెస్టు చేశారు.

లోకం తీరు



హజ్ వీసా ఉంటేనే మక్కాలోకి అనుమతి

రియాద్, ఏప్రిల్ 26: ఈ ఏడాది హజ్ యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో మక్కా నగరంలోకి విదేశీయుల ప్రవేశంపై సౌదీ అరేబియా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఈనెల 23 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల మేరకు హజ్ పర్మిట్ లేకుండా ఏ ఒక్క విదేశీయుడినీ మక్కా నగరంలోకి అనుమతించబోమని సౌదీ అధికారులు తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమించి వచ్చే విదేశీయులు భారీ జరిమానా, జైలుశిక్ష, దేశ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 29 నుంచి నిబంధనలు మరింత కట్టుదిట్టం కానున్నాయని, హజ్ వీసా ఉన్నవారిని మాత్రమే మక్కా నగరంలోకి అనుమతిస్తామని తెలిపారు. హజ్‌యాత్రలో అనధికారిక రద్దీని నివారించేందుకు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సహా 14 దేశాల పౌరులకు వీసా నిబంధనల్లో మార్పులు చేస్తున్నామని ఈ ఏడాది ప్రారంభంలోనే సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. ఆయా దేశాల పౌరులకు ఇకపై సింగిల్ ఎంట్రీ వీసాలను మాత్రమే మంజూరు చేస్తామని స్పష్టం చేసింది.

జూన్‌లో మానస సరోవర యాత్ర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: హిందువులు, బౌద్ధులు, జైనులు పవిత్రంగా భావించే కైలాస మానస సరోవర యాత్రను జూన్ నెలలో నిర్వహించాలని భారత్, చైనా నిర్ణయించాయి. అయిదేళ్ల విరామం అనంతరం ఈ యాత్ర మళ్లీ జరగనుంది. తొలుత కరోనా కారణంగా 2020లో ఈ యాత్రను రద్దు చేయగా, అనంతరం తూర్పు లద్దాఖ్‌లో చైనాతో నెలకొన్న సరిహద్దు వివాదం కారణంగా నిలిపివేశారు. రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించేందుకు ఈ యాత్ర నిర్వహణపై దృష్టి పెట్టారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఈ యాత్ర జరుగుతుందని శనివారం విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్, సిక్కింలోని నాథులా పాస్–ఈ రెండు మార్గాల్లో యాత్ర సాగుతుందని పేర్కొంది. ఈ యాత్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. దరఖాస్తులను kmy.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపించాల్సి ఉంటుంది. కంప్యూటర్ ద్వారా యాత్రికుల ఎంపిక జరుగుతుంది.

అభివృద్ధి భారత్!

» పదేళ్లలో 17 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు

» పట్టణ, గ్రామాల మధ్య తగ్గుతున్న అంతరం..వరల్డ్ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనలో భారత్ దూసుకెళ్తోంది. దశాబ్దకాలంగా దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయింది. గత పదేళ్లలో 17.10 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2011-12లో దేశ జనాభాలో 16.2 శాతం ప్రజలు దుర్భర పేదరికం (రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయం)లో మగ్గగా, 2022-23 నాటికి ఆ సంఖ్య 2.3 శాతానికి తగ్గినట్టు ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. దుర్భర పేదరికంతో బాధపడుతున్నవారు పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 18.4 శాతం నుంచి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరం 7.7 నుంచి 1.7 శాతానికి తగ్గింది. పేదలు క్రమేణా దిగువ-మధ్య-ఆదాయ కేటగిరీలోకి మారుతున్నారు. అలాగే దిగువ-మధ్య-ఆదాయ కేటగిరిలో ఉన్నవారు మధ్య తరగతి ఆదాయ కేటగిరిలోకి వెళ్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 69 శాతం నుంచి 32.5 శాతానికి, పట్టణాల్లో 43.5 శాతం నుంచి 17.2 శాతానికి తగ్గింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం 25 నుంచి 15 శాతానికి తగ్గింది. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో భారత్ పురోగతి సాధిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. 2021-22 నుంచి యువత (శ్రామిక-వయసు జనాభా) కంటే వేగంగా ఉపాధి పెరుగుతోందని వెల్లడించింది. ముఖ్యంగా మహిళలు, గ్రామీణుల్లో స్వయం ఉపాధి పెరుగుతోందని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పట్టణ నిరుద్యోగం 6.6 శాతానికి తగ్గిందని, 2017-18 నుంచి ఇదే అతి తక్కువ అని వెల్లడించింది. ఉపాధి కోసం గ్రామీణ పురుషులు పెద్ద సంఖ్యలో పట్టణాల బాట పడుతున్నారని తెలిపింది. వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల ఉపాధి మెరుగుపడినట్టు పేర్కొంది. దేశంలో మహిళల ఉపాధి రేటు 31 శాతానికి చేరినట్టు వెల్లడించింది.



ఇరాన్ పోర్టులో భారీ పేలుడు

» ఎనిమిది మంది మృతి, ఏడు వందల మందికి గాయాలు

టెహ్రాన్, ఏప్రిల్ 26: ఇరాన్ బందర్ అబ్బాస్ నగరంలోని షహీద్ రజేయి పోర్టులో జరిగిన శక్తిమంతమైన పేలుడు, అగ్ని ప్రమాద ఘటనలో ఎనిమిది మంది చనిపోయారు. ఏడు వందల మంది గాయపడ్డారు. మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. నల్లటి మబ్బులు కమ్మేశాయి. పేలుడు శబ్దం కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోంది. అణు కార్యక్రమంపై ఇరాన్-అమెరికా మధ్య ఒమన్‌లో మూడో విడత పరోక్ష చర్చలు జరుగుతున్న సమయంలో రజేయి పోర్టులో పేలుడు జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

సివిల్స్ టాపర్‌కు 1,043 మార్కులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో టాప్ ర్యాంక్ సాధించిన శక్తి దూబే.. ఆ పరీక్షలో మొత్తం 2,025 మార్కులకుగాను 1,043 మార్కులు సాధించారు. రాతపరీక్షలో 1750 మార్కులకుగాను 843, ఇంటర్వ్యూలో 250 మార్కులకుగాను 200 మార్కులు పొందారు. మొత్తంగా 51.5 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచారు. ఈ మేరకు ఆయా అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శనివారం వెల్లడించింది. రెండో ర్యాంకు సాధించిన హర్షితా గోయల్ 1,038 మార్కులు (51.28 శాతం) పొందినట్లు పేర్కొంది.

కర్రెగుట్టల్లో కాల్పులు నిలిపివేయాలి

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి: కూనంనేని

» అమాయక ఆదివాసీలే బలి

» ప్రొఫెసర్ హరగోపాల్

» దండకారణ్యంలో ఆదివాసీలపై యుద్ధం అప్రజాస్వామికం

» వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో శాంతి ర్యాలీ



శాంతి ప్రదర్శన నిర్వహిస్తున్న రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నేతలు

హైదరాబాద్, వడ్డెపల్లి, ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌పై రాష్ట్రంలోని కమ్యూనిస్టులు, పౌరహక్కుల నేతలు, విద్యావేత్తల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాల్పులను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు పదే పదే ప్రతిపాదిస్తున్నా.. కర్రెగుట్టల్లో కూంబింగ్ నిర్వహించడం సమంజసం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. తక్షణమే కూంబింగ్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కర్రెగుట్టల్లో పారామిలటరీ దళాలు జరుపుతున్న కాల్పులను వెంటనే నిలిపివేయాలని, మధ్య భారతంలో ఆదివాసీల హననాన్ని ఆపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత, ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. హనుమకొండలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న పోరాటంలో అమాయక ఆదివాసీలే బలవుతున్నారని అన్నారు. శాంతి అంటే శ్మశాన శాంతి కాదని, సజీవ శాంతిని సమాజం కోరుకుంటోందని అన్నారు. యుద్ధం, హింస లేకుండా సమస్యను పరిష్కరించుకోవాలని, పౌరుల ప్రాణాలకు విలువ లేకుండా చేయడం అనాగరికమని హరగోపాల్ స్పష్టం చేశారు. కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఆదివాసీలతో భారత ప్రభుత్వం అంతర్‌యుద్ధం చేస్తోందని భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ పేర్కొన్నారు. దేశపౌరులపై యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదని, దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన సైనికులు దండకారణ్యంలో ఆదివాసీలపై యుద్ధం చేయడం అప్రజాస్వామికమని ప్రముఖ విద్యావేత్త రవిమారుత్, సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి పాత బస్టాండ్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించారు. మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపకపోవడం వెనుక కార్పొరేట్ శక్తులు, బహుళజాతి కంపెనీలు ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, తెలంగాణ జనసమితి, బీఎస్పీ, తెలంగాణ పీపుల్ జేఏసీ, టీపీటీఎఫ్, జిల్లా విద్యావంతుల వేదిక, ఎస్ఎఫ్ఐ, ముస్లిం జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

సైద్ధాంతిక భావజాలాన్ని పెంపొందించాలి

» తరగతి గదిని సమాజంతో అనుసంధానించాలి

» ఎస్ఎఫ్ఐ మహాసభల్లో నాగేశ్వర్



ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) కేవలం విద్యా సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా సమాజంలో సైద్ధాంతిక భావజాలాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. ఖమ్మం నగరంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభల సందర్భంగా శనివారం ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభలో నాగేశ్వర్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఏ సిద్ధాంతమైనా ఆచరణ నుంచి రావాలన్నారు. ఆచరణ కోసం అధ్యయనం చేయాలని సూచించారు. తరగతి గదిని సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. దేశంలో పది శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం రూ.1.45 లక్షల కోట్ల రాయితీలు అందిస్తోందన్నారు. అందువల్లనే విద్య, వైద్యం, సామాజిక రంగాలకు నిధుల కొరత ఏర్పడుతోందన్నారు. పహల్‌గామ్ ఉగ్రదాడిని బీజేపీ సోషల్ మీడియా ముస్లిం దాడులుగా చిత్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. హార్స్ రైడర్ సయ్యద్ హుస్సేన్ పర్యాటకులను కాపాడిన విషయాన్ని సమాజం గుర్తుంచుకోవాలన్నారు. ఈ సభలో మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం పేరుతో 300 ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర జరుగుతోందన్నారు. సభలో సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు, ఆహ్వాన సంఘం చైర్మన్ మువ్వా శ్రీనివాసరావు ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో పూర్వ నాయకులు ఖమ్మంలో విరాళాలు సేకరించారు.

కాళేశ్వరం ఈఎన్సీ.. కళ్లు చెదిరే ఆస్తి

(మొదటి పేజీ తరువాయి)

బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు సహా 14 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు శనివారం ఉదయం నుంచి తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులు కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. ఏసీబీ ప్రకటన ప్రకారం.. హరిరామ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం ఉంది. అంతేకాక, హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో విల్లాలు, మాదాపూర్, శ్రీనగర్‌కాలనీ, నార్సింగ్‌లో ఫ్లాట్లు ఉన్నాయి. పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు కూడా ఉన్నాయి. బొమ్మలరామారంలో ఆరు ఎకరాలలో ఫామ్‌హౌస్, మామిడి తోట, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇక, బీఎండబ్ల్యూ సహా రెండు కార్లు, ఉన్నాయి. ఇవే కాక, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను కూడా గుర్తించారు. ఆయా ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో భారీగా ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు హరిరామ్‌ను అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు తెలిపింది. సోదాలు కొనసాగుతున్నాయని, హరిరామ్ ఆస్తుల చిట్టా మరింత పెరిగే అవకాశముందని ఏసీబీ పేర్కొంది. కాగా, హైదరాబాద్, షేక్‌పేటలోని ఆదిత్య టవర్స్‌లో హరిరామ్ నివసిస్తున్న ఇంట్లో సోదాలు చేసిన అధికారులు.. అక్కడి కంప్యూటర్లు, లాప్‌టాప్‌లను పరిశీలించారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హరిరామ్ భార్య అనిత ఇరిగేషన్ విభాగంలో డిప్యూటీ ఈఎన్సీగా పనిచేస్తున్నారు. దీంతో ఏసీబీ అధికారులు ఆమెను కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామం.. హరిరామ్ స్వగ్రామం. ఎదురగడ్డలోని హరిరామ్ నివాసంతోపాటు ఆయన బంధువుల ఇంట్లో ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలోని బృందం సోదాలు చేసింది. నిజానికి, ఏసీబీ దాడులు జరుగుతాయనే సమాచారం చాలా రోజుల నుంచే ఉండడంతో హరిరామ్ ఇప్పటికే జాగ్రత్తలు తీసుకున్నారని, చాలా ఆస్తులు బినామీల పేర్లతో పెట్టారని సమాచారం.




ఎదురుగడ్డలోని హరిరామ్ బంధువుల ఇంటిలో సోదాలు చేస్తోన్న ఏసీబీ అధికారులు

హరిరామ్ @ 48,665 కోట్ల పనులు

గజ్వేల్ ఈఎన్సీ, కాళేశ్వరం ప్రాజెక్టు కార్పొరేషన్ ఎండీగా బి.హరిరామ్.. కాళేశ్వరం ప్రాజెక్టు రీ ఇంజనీరింగ్ నుంచి నిర్మాణం వరకు కీలక పాత్ర పోషించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.1.47 లక్షల కోట్లు కాగా, అందులో రూ.48,665 కోట్ల అంచనా కలిగిన పనులు హరిరామ్ పర్యవేక్షణలోనే జరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టును ఏడు లింక్‌లు, 28 ప్యాకేజీలుగా విభజించి చేపట్టారు. ఇందులో లింకులు-4, 5, 6 పరిధిలోని ప్యాకేజీలు 10 నుంచి 19 కిందికి వచ్చే పనులను హరిరామ్ చేయించారు. మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, సింగూరు జలాశయానికి నీళ్లను ఎత్తిపోసేందుకు సంబంధించిన నిర్మాణ పనులు ఇందులో ఉన్నాయి. లింకులు 4, 5, 6 కింద వచ్చే పనుల అంచనా వ్యయం రూ.41,568.39 కోట్లు కాగా అది రూ.48,665.54 కోట్లకు పెరిగింది. ఈ లింకల పరిధిలో రాని ఇతర పనులను కూడా హరిరామ్ పర్యవేక్షించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కింద హరిరామ్ ఆధ్వర్యంలో జరిగిన పనులు కలుపుకుంటే మొత్తం రూ.50వేల కోట్లకు పైగా విలువైన పనులు జరిగినట్టేనని నీటిపారుదలశాఖ వర్గాలు అంటున్నాయి.

సగంవ్యయం హరిరామ్ పర్యవేక్షణలోనే

రూ.82,252.75 కోట్ల అంచనా వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కాగా, ప్రస్తుతానికి అది రూ.1.47 లక్షల కోట్లకు చేరింది. ఇప్పటివరకు రూ.96,291.57 కోట్లు విలువైన పనులు జరిగాయి. ఇందులో రూ.40వేల కోట్లకు పైగా వ్యయం హరిరామ్ ఆధ్వర్యంలోనే జరిగినట్లు సమాచారం. హరిరామ్ గతంలో ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు సీఈగా పనిచేశారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఆ ప్రాజెక్టులో 2016 మార్చి నాటికి రూ.11,642.85 కోట్లు విలువైన పనులు జరిగాయి. ఆ తర్వాత నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రీ-ఇంజనీరింగ్ పేరుతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించింది. ప్రాణహిత-చెవెళ్ల కింద తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించాల్సి ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్దకి మార్పు చేశారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌కి కేంద్ర జల వనరుల సంఘం(సీడబ్ల్యూసీ) నుంచి అనుమతుల కోసం ప్రాజెక్టు ప్రొపోనెంట్ హోదాలో హరిరామ్ దరఖాస్తు చేశారు. ఇక, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్(కేఐపీసీఎల్) ఎండీగా ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం రుణ సమీకరణలో కీలకంగా వ్యవహరించారు. కేఐపీసీఎల్‌కి బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.87,449 కోట్ల రుణాలు మంజూరు కాగా, రూ.64,283 కోట్ల రుణాలు విడుదలయ్యాయి.



యూటీఎఫ్ వ్యవస్థాపకుడు రావెళ్ల ఇకలేరు

- విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ఖమ్మానికి మృతదేహం.. ఆదివారం అక్కడే అంత్యక్రియలు



ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యవస్థాపకుడు రావెళ్ల రాఘవయ్య (91) కన్నుమూశారు. అనారోగ్యంతో విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం రాత్రి ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. రావెళ్ల మరణం యూటీఎఫ్ సంఘానికి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీవ్ర లోటు అని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తంచేసింది.. రాఘవయ్య సతీమణి సరస్వతి పదేళ్ల క్రితమే మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినపల్లిలో రాఘవయ్య జన్మించారు. ఖమ్మంలో స్థిరపడ్డారు. 1951లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి.. వివిధ చోట్ల పనిచేసి 1986లో ఉద్యోగ విరమణ చేశారు. 1974లో యూటీఎఫ్‌ను స్థాపించారు. 1975లో వ్యవస్థాపక కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖంగా పాల్గొన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలోనూ పాల్గొన్నారు. శ్రీనివాసనగర్‌లోని గ్రంథాలయాన్ని నిర్మించారు. యూటీఎఫ్ భవన నిర్మాణానికి కృషి చేశారు. ఆదివారం ఉదయం ఖమ్మంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

ఐదుగురు కమిషనర్ల నియామక ఫైలు గవర్నర్‌కు

రాష్ట్రంలో సమాచార హక్కు(ఆర్టీఐ) చట్టం కమిషనర్ల నియామకానికి రంగం సిద్ధమైంది. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు ఎంపిక చేసిన వారి జాబితా రాజ్‌భవన్‌కు చేరింది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదం లభించగానే నియామకాలు చేపట్టనున్నారు. ఆర్టీఐ ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అయనతోపాటు మరో ఐదుగురిని కమిషనర్లుగా నియవింంచే ఫైలు శనివారం గవర్నర్ వద్దకు చేరింది. ప్రతిపాదిత కమిషనర్లలో.. ఒక జర్నలిస్టు, ఇద్దరు మాజీ జర్నలిస్టులు, పూర్వ నల్గొండ జిల్లా నుంచి బీసీ న్యాయవాది, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒకరు ఉన్నట్టు సమాచారం.

పాకిస్థాన్‌కు వణుకు పుట్టేలా బదులిస్తాం

- కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ట పహల్‌గామ్ ఘటన అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా పాకిస్తాన్ వెన్నులో వణుకుపుట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకోబోతోందని వెల్లడించారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో బండి సంజయ్‌తో పాటు జీఎస్టీ చీఫ్ కమిషనర్లు సందీప్ ప్రకాశ్, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. రోజ్ గార్ మేళా ద్వారా 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న మాటను మోదీ నిలబెట్టుకున్నారని తెలిపారు. 14 మేళాలను నిర్వహించి 9.25లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. శనివారం 15వ రోజ్ గార్ మేళా ద్వారా దేశవ్యాప్తంగా 51 వేలకుపైగా ఉద్యోగాలను ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేశామని ఆరోపించారు. ఈసందర్భంగా 700 మందికి నియామక పత్రాలను అందించారు.



ఉద్యోగ నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులతో కేంద్ర మంత్రి బండి సంజయ్

దోపిడీ కోసమే కాళేశ్వరం: అర్వింద్

రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకోవడానికే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని బీజేపీ ఎంపీ అర్వింద్ విమర్శించారు. అవినీతి సొమ్ముతోనే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పెట్టుకున్నారని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు చేస్తేనే ప్రాజెక్టులో ఎంత దోపిడీ జరిగిందో వెల్లడవుతుందని అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అర్వింద్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌కు ఆయన కుమారుడు, కూతురు నుంచే ప్రమాదం ఉందని అన్నారు.

డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే 20 ఏళ్ల జైలు: డీజీపీ

హైదరాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులో పట్టుబడిన నేరస్థులకు పది నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని డీజేపీ జితేందర్ అన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుకున్న సిబ్బందికి శనివారం రివార్డులు అందచేశారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన నేరస్థులకు శిక్షలు పడేలా పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేసి సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందుంచాలని సిబ్బందికి సూచించారు.

5న జాతీయ రహదారులకు ప్రారంభోత్సవం

- రూ.961 కోట్లతో కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన
- గడ్కరీ చేతుల మీదుగా కార్యక్రమాలు: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సుమారు రూ.6,280 కోట్లతో నిర్మించిన 285 కి.మీ. మేర జాతీయ రహదారులను మే 5న ప్రారంభిస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రోడ్డు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి ప్రాజెక్టులను జాతికి అంకితం ఇస్తామని శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణ రోడ్లు, భవనాల విభాగంతో కలిసి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆయా పనులను చేపట్టిందని తెలిపారు. వీటితో పాటు రూ.961 కోట్లతో 51కి.మీ. మేర చేపట్టనున్న రెండు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు గడ్కరీ శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

ఇవీ ప్రాజెక్టులు..

నిర్మల్-ఖానాపూర్ మధ్య 17.19 కి.మీ.,మంచిర్యాల-రేపల్లెవాడ మధ్య 42 కి.మీ., రేపల్లెవాడ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు 52.6 కి.మీ., 44వ జాతీయ రహదారిపై నాగ్‌పూర్-హైదరాబాద్ సెక్షన్‌లో 28కి.మీ. మేర పనులను ప్రారంభించనున్నట్టు కిషన్‌రెడ్డి వివరించారు. అలాగే, నాగ్‌పూర్-హైదరాబాద్ సెక్షన్‌లో పలు ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు, ఫుట్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపనలు చేస్తామని తెలిపారు. హైదరాబాద్-బెంగళూరు సెక్షన్‌లో ఆరాంఘర్-శంషాబాద్ మధ్యలో 10కి.మీ., హైదరాబాద్‌లోని అంబర్‌పేట వద్ద 1.47 కి.మీ. ఫ్లైఓవర్, బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద 1.65 కి.మీ. ఫ్లైఓవర్, 44వ జాతీయ రహదారిపై నాగ్‌పూర్-హైదరాబాద్ సెక్షన్‌లో మెదక్ జిల్లా రెడ్డిపల్లి జంక్షన్ వద్ద కి.మీ. మేర ఆరులేన్ల అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు.. మెదక్ జిల్లా జాప్తిశివనూర్ వద్ద కి.మీ.మేర అండర్ పాస్, సర్వీస్ రోడ్డు.. మెదక్ జిల్లా గోల్డెన్ దాబా వై జంక్షన్ వద్ద కి.మీ. మేర సర్వీస్ రోడ్డు, ఆరులేన్ల అండర్ పాస్.. కామారెడ్డి జిల్లా టేక్రియాల్, పొందుర్తి ఎక్స్ రోడ్డు వద్ద 3.55 కి.మీ. మేర అండర్ పాస్, ఇతర అభివృద్ధి పనులు.. కామారెడ్డి జిల్లా పద్మాజివాడ జంక్షన్ వద్ద 1.17 కి.మీ. అండర్ పాస్, స్లిప్ రోడ్డు.. 163 జాతీయ రహదారిపై హైదరాబాద్-వరంగల్ సెక్షన్‌లో ఆలేరు-జీడికల్ ఎక్స్ రోడ్డు వద్ద 1.68కి.మీ. మేర నాలుగు లేన్ల అండర్ పాస్ పనులను ప్రారంభించనున్నట్టు కిషన్‌రెడ్డి వివరించారు. 65వ జాతీయ రహదారిపై హైదరాబాద్-విజయవాడ సెక్షన్‌లో ధర్మోజిగూడ వద్ద ఆరు లేన్ల అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు నిర్మాణం.. 44వ జాతీయ రహదారిపై హైదరాబాద్-బెంగళూరు సెక్షన్‌లో బాలానగర్ వద్ద 1.26 కి.మీ. మేర ఆరు లేన్ల అండర్ పాస్, 163వ జాతీయ రహదారిపై హైదరాబాద్-యాదగిరి సెక్షన్‌లో అంకుశాపూర్ వద్ద 2.77 కి.మీ. మేర ఆరులేన్ల అండర్ పాస్, ఘట్‌కేసర్ జంక్షన్ వద్ద ఆరులేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణం, 44వ జాతీయ రహదారిపై నాగ్‌పూర్-హైదరాబాద్ సెక్షన్‌లో 3.45 కి.మీ. మేర కోమటిపల్లి, వల్లూరు జంక్షన్ల అభివృద్ధి, ఆరులేన్ల అండర్‌పాస్‌ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయనున్నట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

రామప్పను సందర్శించిన మిస్ ఇండియా నందినిగుప్తా

- రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెంకటాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని 2023 మిస్ ఇండియా నందిని గుప్తా శనివారం సందర్శించారు. ఆమెకు ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రామలింగేశ్వరుడికి నందిని గుప్తా ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు పర్యాటకశాఖ జిల్లా అధికారి శివాజీ నేతృత్వంలో టూరిజం గైడ్లు రామప్ప ఆలయ చరిత్ర, రామప్పలోని మదనిక సాలబంజికల చరిత్రను వివరించారు. రాళ్లను కరిగించి పోతపోసి మలిచిన శిల్పాలను నందిని గుప్తా ఆసక్తిగా తిలకించారు. అపురూప శిల్ప సంపదకూ.. అద్భుత నిర్మాణ రీతులకు నెలవైన రామప్ప ఆలయం జగద్విఖ్యాతం, కాకతీయుల నాటి నిర్మాణాలకే తలమానికం. వచ్చే నెల ఏడో తేదీ నుంచి 31 వరకూ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చే సుందరీమణులు సందర్శించేందుకు వీలుగా సర్కారు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో భాగంగా మే 14న రామప్ప గుడిని సుందరీమణులు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్‌కు చెందిన మిస్ ఇండియా నందిని గుప్తా ముందుగానే రామప్ప ఆలయాన్ని సందర్శించడం పాధాన్యం సంతరించుకున్నది.



ఆలయంలోని శిల్ప సౌందర్యాన్ని తిలకిస్తున్న నందిని

రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా చిత్రా రామచంద్రన్



హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) అప్పిలేట్ ట్రైబ్యునల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా మాజీ ఐఏఎస్ అధికారిణి చిత్రా రామచంద్రన్‌ను నియమించారు. ఇప్పటి వరకు రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్ చైర్మన్‌గా ఉన్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిని ప్రభుత్వం లోకాయుక్తగా నియమించింది. ఆయన రాజీనామాతో అప్పిలేట్ ట్రైబ్యునల్ చైర్మన్ పోస్ట్ ఖాళీ అయింది. జస్టిస్ రాజశేఖర్ రెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ శనివారం ఉత్తర్వు(జీవో87)లిచ్చారు. అదే ఉత్తర్వుల్లో పూర్తి స్థాయి చైర్మన్ నియామకం జరిగే వరకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా చిత్రా రామచంద్రన్ కొనసాగుతారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె అప్పిలేట్ ట్రైబ్యునల్‌లో పరిపాలనా సభ్యురాలిగా ఉన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఒకప్పుడు పార్టీలో అంతా తానై వ్యవహరించిన విజయసాయిరెడ్డికి ఈ అధికారాల పంపిణీ సహజంగానే రుచించలేదు. అధికారం–డబ్బు వల్ల మనస్పర్ధలు రావడం సహజం కనుక జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి మధ్య కూడా దూరం పెరిగింది. తాను జగన్‌రెడ్డి నమ్మకం కోల్పోయానని, ఆయన గుండెల్లో తనకు స్థానం లేదని విజయసాయిరెడ్డి తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు. వైసీపీకి, తన ఎంపీ పదవికి రాజీనామా చేయడానికి చాలా ముందు నుంచే విజయసాయిరెడ్డి తన అసంతృప్తిని సన్నిహితుల వద్ద వ్యక్తం చేస్తూ వచ్చారు. చివరికి ఇరువురి మధ్య విభేదాలు రోడ్డునపడ్డాయి. తన దారి తాను చూసుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన విజయసాయిరెడ్డి భారతీయ జనతా పార్టీ ముఖ్యులను ఆశ్రయించారు. తాడేపల్లి ప్యాలెస్ గుట్టుమట్లు విజయసాయిరెడ్డికి తెలుసు. ఆయన నిజాయితీగా నోరు విప్పితే జగన్‌రెడ్డి కథ కంచికి చేరుతుంది.

జగన్ పాల్పడిన మద్య పాతకం!

ఇంటి గుట్టు లంకకు చేటుగా మారనుందా? ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చోటుచేసుకున్న లిక్కర్ కుంభకోణంలో 'సిట్' అధికారులు తవ్వుతున్న కొద్దీ వెలుగులోకి వస్తున్న విషయాలను గమనిస్తే ఇది నిజం అని నమ్మాల్సిందే! ఈ కుంభకోణానికి సంబంధించిన మూలాలన్నీ తాడేపల్లి ప్యాలెస్‌లోనే ఉన్నాయని, ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన నిందితులు సిట్ అధికారులకు చెబుతున్న దాన్నిబట్టి అర్థమవుతోంది. మద్యం ఉత్పత్తి కంపెనీలు ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం సహజం. అయితే, మద్యం కొనుగోళ్లలో అధికారంలో ఉన్నవాళ్లు గతంలో పెద్దగా జోక్యం చేసుకొనేవారు కారు. డిమాండ్‌కు అనుగుణంగా ఆయా కంపెనీలకు చెందిన మద్యాన్ని అధికారులే కొనుగోలు చేసేవారు. 2019 వరకు ఇదే విధానం తెలుగునాట అమల్లో ఉంది. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం కొనుగోళ్ల వ్యవహారాన్ని సమూలంగా మార్చి దాన్నొక పాడి ఆవుగా చేసుకున్నారు. పాపులర్ అయిన బ్రాండ్లను పక్కనబెట్టి, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీల మద్యాన్ని మాత్రమే కొనుగోలు చేసే విధానాన్ని తెరమీదకు తెచ్చారు. ఊరూ పేరూ లేని కంపెనీలను సృష్టించి, వాటి ద్వారా నాసిరకం మద్యాన్ని ఉత్పత్తి చేయించి కొనుగోలు చేశారు. ఫలితంగా పలువురు మద్యం ప్రియులు ప్రాణాలు కోల్పోగా, మరెందరో అనారోగ్యం పాలయ్యారు. ఈ కుంభకోణానికి పాల్పడిన వారు కొన్ని వేల కోట్ల రూపాయల సొమ్ము జేబులో వేసుకోవడంతోపాటు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ఈ కారణంగా దీన్నొక ఆర్థిక నేరంగానే కాకుండా ప్రజల చావుకు కారకులుగా గుర్తించి కేసు కట్టాల్సిన అవసరం ఉంది.

కమీషన్లకోసం కసరత్తు

మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న నాటి పాలకులు మద్యం కొనుగోళ్ల విధానం రూపకల్పనకు భారీ కసరత్తు చేశారు. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ అనే అధికారులను ఏరికోరి మరీ తెచ్చుకొని మద్యం కొనుగోళ్ల బాధ్యతను అప్పగించారు. ఇసుక, మద్యంను సొంత ఆదాయ వనరులుగా మార్చుకున్న ఘనత జగన్ అండ్ కోకు మాత్రమే చెల్లింది. గత పాలకులు ఎవరూ ఇసుకను ఆదాయ వనరుగా చూడలేదు. ఇసుక నుంచి డబ్బు పిండుకొనే ఆలోచన చేయలేదు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఇసుకను కూడా పార్టీకి ప్రధాన ఆదాయ వనరులలో ఒకటిగా చేర్చారు. ఇసుక ధరలు పెరిగి ప్రజలు ఆర్థికంగా మాత్రమే నష్టపోయారు. కానీ, మద్యం విషయంలో అలా కాదు. ఆరోగ్యాలు దెబ్బతిని ప్రాణాలు కూడా కోల్పోయారు. లిక్కర్ కుంభకోణంలో అరెస్టయిన వారితో పాటు విచారణకు హాజరైన నిందితులు చెప్పిన వివరాల ప్రకారం... ఈ వ్యవహారంలో భాగస్వామ్యం ఉన్న ప్రతి ఒక్కరూ అమానవీయంగా వ్యవహరించారు. తమ ధనదాహం పేదల ఉసురు తీస్తుందన్న విషయాన్ని విస్మరించారు. అధికారం శాశ్వతం అని భావించి సమాజమే ఉలికిపాటుకు గురయ్యే స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారు. మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన బేవరేజస్ కంపెనీ ఎండీగా పనిచేసిన వాసుదేవ రెడ్డి, మరో అధికారి సత్యప్రసాద్ అప్పట్లో ఏం జరిగిందో, ఎవరి ప్రోద్బలంతో తాము అలా చేయవలసి వచ్చిందో న్యాయాధికారి ఎదుట చెప్పేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కసిరెడ్డి రాజశేఖరరెడ్డి సిట్ అధికారుల విచారణలో జరిగిందంతా పూస గుచ్చినట్టు చెప్పారు. తామంతా నిమిత్తమాత్రులమేనని, కమీషన్లు చేరాల్సిన చోటుకు చేరాయని చెప్పుకొచ్చారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా అప్పట్లో ఏం జరిగిందో చెప్పేశారు. కమీషన్ల సొమ్మును అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకొనేవారని నేరుగా చెప్పకుండా... అదే అర్థమొచ్చేలా సిట్ అధికారులకు చెప్పేశారు. మద్యం కొనుగోళ్లలో తప్పు జరగలేదని విజయసాయిరెడ్డి ఎక్కడా పేర్కొనలేదు. ప్రతి సందర్భంలోనూ 'మద్యం కుంభకోణం' అనే మాట్లాడారు. అయితే, ఆ కుంభకోణంలో ప్రధాన పాత్రధారి కసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని చెప్పారు.

చెడిన దోస్తీ...

ఇద్దరు తెలివైన నేరస్తులు ఎక్కువకాలం కలసి ప్రయాణం చేయలేరు. విజయసాయిరెడ్డి, కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఒకప్పుడు సన్నిహితంగానే ఉండేవారు. విజయసాయి ఆదేశాల ప్రకారమే కసిరెడ్డి పనిచేసేవారు. అయితే, జగన్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్న కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఆ తర్వాత విజయసాయిరెడ్డిని పట్టించుకోవడం మానేశారు. ఇసుక, మద్యం వ్యాపారాల నుంచి జగన్‌రెడ్డి తనను దూరం పెట్టడానికి రాజ్ చెప్పిన చాడీలే కారణమని విజయసాయిరెడ్డి భావించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా దూరం పెరిగింది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఇంటెలిజెంట్ క్రిమినల్ అని విజయసాయి అభివర్ణించారు. అయితే, ఆర్థిక నేరాలు చేయడంలో విజయసాయిరెడ్డిని మించిన వారు లేరన్న అభిప్రాయం అప్పటికే ఉంది. జగన్‌రెడ్డితో మాయా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మింపజేయడంలో విజయసాయి రెడ్డిదే ప్రధాన పాత్ర అన్నది అందరికీ తెలిసిన విషయమే. అధికారం–డబ్బు మనుషులను కుదురుగా ఉండనివ్వవు. ఈ రెండూ వచ్చినప్పుడు ప్రాణ స్నేహితులు కూడా విడిపోవడం చూశాం. రక్త సంబంధాలను మరచిపోయి కొట్టుకోవడం చూస్తున్నాం. తనకు వ్యతిరేకంగా ఎవరు ఏది మాట్లాడినా వారి వెనుక చంద్రబాబు ఉన్నారని జగన్‌రెడ్డి ఆరోపిస్తారు గానీ.. అసలు కారణం వారి వెనుక ఉన్నది డబ్బు–అధికారమే! దివంగత రాజశేఖరరెడ్డి కుటుంబంలో కలతలు ఏర్పడటానికి ఈ రెండూ కారణం కాదా? అధికారం, తద్వారా సమకూరిన డబ్బును రక్తం పంచుకుపుట్టిన షర్మిలతో పంచుకోవడానికి జగన్‌రెడ్డి సిద్ధపడి ఉంటే వారి మధ్య గొడవలు జరిగేవి కావు కదా? సొంత అన్నపై కత్తులు దూయడానికి షర్మిల సిద్ధపడ్డారంటే ఆస్తుల పంపకంలో న్యాయం చేయకపోవడమే కారణం కాదా? చివరకు తుచ్ఛమైన ఆస్తులకోసం సొంత తల్లి విజయలక్ష్మిపైనే జగన్‌రెడ్డి కేసు వేశారు కదా? జగన్‌రెడ్డి తన తల్లి, చెల్లిపై కేసు వేయడానికి కూడా చంద్రబాబే కారణం అని చెప్పగలరా? పులివెందులపై పెత్తనం ఎవరికి దక్కాలన్న వివాదం తలెత్తడం వల్లనే కదా వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు! రక్త సంబంధీకులను ఖైదు చేయించడం, హత్యలు చేయించడం మొఘల్ సామ్రాజ్య కాలంలో జరిగాయని చరిత్ర పుస్తకాల్లో చదివాం. ఇప్పుడు మళ్లీ ఇంత కాలానికి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో అలాంటివి జరగడం చూస్తున్నాం. ఈ నేపథ్యంలోనే జగన్‌రెడ్డి–విజయసాయిరెడ్డి మధ్య విభేదాలు తలెత్తడాన్ని చూడాలి.

సాయిరెడ్డి ప్రస్థానం...

విజయసాయిరెడ్డి చెబుతున్నట్టుగా 2019 వరకు వైసీపీలో అన్నీ తానే అయి నడిపించారు. అప్పుడు అధికారంలో ఉన్న వారికి వ్యతిరేకంగా ఎన్నో కుటిల పన్నాగాలు పన్నారు. జగన్‌రెడ్డికి కుడి భుజంగా వ్యవహరించారు. ఈ క్రమంలో 2019లో వారి కుట్రలు ఫలించి జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటివరకు పార్టీలో నంబర్ టూగా ఉన్న విజయసాయిరెడ్డి ప్రభుత్వంలో కూడా నంబర్ టూగా చెలామణి కావచ్చునని భావించారు. ఏడాదికి పైగా అంతులేని అధికారాన్ని చలాయించారు కూడా! అదే సమయంలో మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ అనిల్‌రెడ్డి వంటివారు జగన్‌రెడ్డికి సన్నిహితం అయ్యారు. వనరుల దోపిడీ, కమీషన్ల వసూలు బాధ్యతను ముఖ్యమంత్రి హోదాలో జగన్‌రెడ్డి ఆ ముగ్గురికీ అప్పగించారు. దీంతో విజయసాయిరెడ్డి ప్రభ మసకబారడం మొదలైంది. సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు ప్రధాన అధికార కేంద్రాలుగా మారారు. అధికారం వస్తే దున్నేద్దామని అనుకున్న విజయసాయిరెడ్డికి ఈ పరిణామం సహజంగానే రుచించలేదు. మద్యం విషయంలోనే కాకుండా మిగతా సహజ వనరుల నుంచి కమీషన్లు పిండుకొని తనకు అందజేసే బాధ్యతను జగన్‌రెడ్డి తన చుట్టూ ఉండే కోటరీకే అప్పగించారు. అన్ని వ్యవహారాలనూ ఒకరికే అప్పగించకూడదన్న ప్రాథమిక సూత్రానికి అనుగుణంగా అరడజను ముఖ్యులకు బాధ్యతలను పంచిపెట్టారు. విచిత్రం ఏమిటంటే వీరెవరికీ ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉండదు. కమీషన్లు వసూలు చేయడం మాత్రమే వారి బాధ్యత. అందుకు అవసరమైన అధికారాన్ని మాత్రమే దఖలు చేసేవారు. విధాన నిర్ణయాలలో వారెవరికీ సంబంధం ఉండేది కాదు. తమకు అప్పగించిన శాఖలలోనే ఆయా వ్యక్తుల మాట చెల్లుబాటు అయ్యేది. ఒకప్పుడు పార్టీలో అంతా తానై వ్యవహరించిన విజయసాయిరెడ్డికి ఈ అధికారాల పంపిణీ సహజంగానే రుచించలేదు. అధికారం–డబ్బు వల్ల మనస్పర్ధలు రావడం సహజం కనుక జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి మధ్య కూడా దూరం పెరిగింది. తాను జగన్‌రెడ్డి నమ్మకం కోల్పోయానని,

> **అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన జగన్ అండ్ కో హేయమైన పాపాలకు ఒడిగట్టారని ప్రజలకు వివరించగలిగినప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రాథమిక కర్తవ్యాన్ని నెరవేర్చినవారు అవుతారు. జగన్‌రెడ్డిని రాజకీయంగా సీసాలో బంధించడానికి లిక్కర్ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వానికి అందివచ్చిన ఆయుధం.**

ఆయన గుండెల్లో తనకు స్థానం లేదని విజయసాయిరెడ్డి తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు. వైసీపీకి, తన ఎంపీ పదవికి రాజీనామా చేయడానికి చాలా ముందు నుంచే విజయసాయిరెడ్డి తన అసంతృప్తిని సన్నిహితుల వద్ద వ్యక్తం చేస్తూ వచ్చారు. చివరికి ఇరువురి మధ్య విభేదాలు రోడ్డునపడ్డాయి. తన దారి తాను చూసుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన విజయసాయిరెడ్డి భారతీయ జనతా పార్టీ ముఖ్యులను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇంటి గుట్టు లంకకు చేటు అని గ్రహించిన జగన్‌రెడ్డి తన మనుషులతో విజయసాయిరెడ్డిపైన ఎదురుదాడి చేయించడం మొదలుపెట్టారు. తాడేపల్లి ప్యాలెస్ గుట్టుమట్లు విజయసాయిరెడ్డికి తెలుసు. ఆయన నిజాయితీగా నోరు విప్పితే జగన్‌రెడ్డి కథ కంచికి చేరుతుంది. ఈ కారణంగానే విజయసాయిరెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుతో చేరిపోయారని ప్రచారం చేయడం మొదలుపెట్టారు. విజయసాయిని ద్రోహిగా చిత్రించే పనిలో జగన్ అండ్ కో బిజీగా ఉన్నారు. జగన్‌రెడ్డితో విభేదించి ఎదురు



తిరగడం వల్ల ఎదురయ్యే పరిణామాలు విజయసాయిరెడ్డికి తెలుసు. అందుకే ఆయన ముందుగా బీజేపీ ప్రముఖుల ఆశ్రయం పొందారు. లిక్కర్ కుంభకోణంలో జగన్‌రెడ్డికి కమీషన్ల సొమ్ము ముట్టిందని చెప్పడం మినహా మిగతా అన్ని విషయాలనూ అయన సిట్ అధికారులకు పూసగుచ్చినట్టు చెప్పేశారు. ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న వారి బట్టలు సగమే విప్పానని, మిగతా సగం దుస్తులు కూడా త్వరలోనే విప్పుతానని ఆయన తాజాగా ప్రకటించారు. అంటే విజయసాయిరెడ్డి త్వరలో జగన్‌రెడ్డి దుస్తులు కూడా విప్పుతారా? అన్న సందేహం కలుగుతోంది.

జగన్ పరిస్థితి ఏమిటి?

నాలుగేళ్ల తర్వాత తాను తిరిగి అధికారంలోకి వస్తానని, అప్పుడు తమపై కేసులు పెట్టిన పోలీసు అధికారుల బట్టలు విప్పిస్తానని జగన్‌రెడ్డి చెప్పుకొంటున్న వేళ విజయసాయిరెడ్డి హెచ్చరికలు వైసీపీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే, కపట నాటకాలకు మారుపేరైన విజయసాయిరెడ్డిని ఇప్పటికీ చాలామంది నమ్మడం లేదు. జగన్‌రెడ్డితో ఆయనకు విభేదాలు ఏర్పడటం డ్రామా అని నమ్ముతున్న వాళ్లు కూడా గణనీయంగానే ఉన్నారు. వారిరువురి మధ్య విభేదాలు నిజమే అయిన పక్షంలో విజయసాయిరెడ్డి తదుపరి ఎత్తుగడలు ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. జగన్‌రెడ్డి గుట్టుమట్లు అన్నీ తెలిసిన వ్యక్తి ఆయన. జగన్ అవినీతి కేసులలో విజయసాయిరెడ్డి ఏ–2గా ఉన్నారు. వాటిలో ఆయన అప్రూవర్‌గా మారితే పరిస్థితి ఏమిటి? అది సాధ్యమా? జగన్‌రెడ్డి నైజం తెలిసిన విజయసాయిరెడ్డి ప్రాణాలకు తెగించి అప్రూవర్‌గా మారగలరా? ఇలాంటి సందేహాలు సహజంగానే కలుగుతాయి. ఆయన ఇవాళ కాకపోతే రేపైనా బీజేపీలో చేరిపోతారు. జగన్‌రెడ్డిపై నమోదైన కేసులలో శిక్ష పడితే విజయసాయిరెడ్డికి కూడా శిక్ష పడుతుంది. అలా అయితే భారతీయ జనతా పార్టీలో చేరడం ఎందుకు? అని ప్రజల్లో సందేహం కలగకుండా ఉంటుందా?

అవినీతి విషయంలో జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి శరీరం అతుక్కుని పుట్టిన అవిభక్త కవలలవంటి వారు. ఈ ఇద్దరిలో ఒకరిని తప్పించి మరొకరిని శిక్షించలేరు. విజయసాయిరెడ్డి బీజేపీలో చేరిపోతే అవినీతి కేసులలో పురోగతి ఉండకపోవచ్చు. అంటే, విజయసాయి చర్యల వల్ల పరోక్షంగా జగన్‌రెడ్డికి కూడా మంచి జరగబోతున్నదని భావించాలి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంపై సిట్ విచారణ వేగం పుంజుకుంది.

ఎవరి భయం వారిది...

మద్యం కేసులో మరో కీలక నిందితుడు బాలాజీ సిట్ అధికారులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్నారు. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఇప్పటికే విచారించిన సిట్ అధికారులు తదుపరి ఏం చేయబోతున్నారో వేచిచూడాలి. అయితే, ఈ కేసులో తనను అరెస్టు చేయబోతున్నారని మిథున్‌రెడ్డి మానసికంగా సిద్ధపడుతున్నారు. తనను మళ్లీ విచారణకు పిలిస్తే మరిన్ని వివరాలు చెబుతానని విజయసాయిరెడ్డి చెబుతున్నందున సిట్ అధికారులు త్వరలోనే ఆయనను విచారణకు పిలవవచ్చు. అప్పుడు ఆయన ఏమి చెబుతారు? ఆయన నోటివెంట వెలువడే నిజాలతో ఈ కుంభకోణంలో జగన్‌రెడ్డిని నిందితుడిగా చేర్చుతారా? అన్న సందేహం సర్వత్రా వ్యాపించింది. ఏది ఏమైనా అవినీతికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడిన ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న వారందరినీ శిక్షించాల్సిందే.

> **మద్యం కుంభకోణంలో వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసిన లిక్కర్ కంపెనీలు అనూహ్యంగా మద్యం వ్యాపారంతో సంబంధం లేని కంపెనీలకు, సంస్థలకు చెల్లింపులు చేశాయి. ఈ విధంగా జరిగిన చెల్లింపులన్నీ చివరకు 'మూల విరాట్'కే చేరాయి. చరిత్రలో జరగని, చూడని రీతిలో జరిగిన ఈ కుంభకోణంపై దర్యాప్తును సిట్ అధికారులకే పరిమితం చేయకుండా ఆర్థిక వ్యవహారాలలో నిపుణులైన వారికి కూడా భాగస్వామ్యం కల్పించాలి. దర్యాప్తు పరిధిని విస్తరించాలి. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం జాతీయ స్థాయిలో పతాక శీర్షికలతో ప్రచురితమైంది, ప్రచారం పొందింది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది అంతకు మించిన మహా ఘాతుకం కనుక రాష్ట్ర ప్రభుత్వం ఈ కుంభకోణంపై జాతీయ స్థాయిలో తెలిసేలా చేయాలి. జగన్‌రెడ్డి పాలనలో చోటుచేసుకున్న పాపాలను దేశ ప్రజలకు వివరించి అటువంటి నేరాలకు పాల్పడే వారికి రాజకీయాలలో చోటు లేని విధంగా చర్యలు తీసుకోవాలి.**

ఢిల్లీలో లిక్కర్ కొనుగోళ్లలో ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలను అరెస్టు చేసి జైలుకు పంపారు. అక్కడ అంతా కలిపి కొన్ని వందల కోట్ల రూపాయలు మాత్రమే చేతులు మారాయి. కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టినా తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆయనపై ప్రజల్లో ఎలాంటి సానుభూతీ ఏర్పడలేదు. ఆప్ పార్టీ చిత్తుగా ఓడిపోయింది. అవినీతి విషయాలలో ప్రజలు పెద్దగా స్పందించలేకపోవచ్చునుగానీ, మద్యం వంటి వ్యవహారాలలో ఇరుక్కుంటే దాన్ని జీర్ణించుకోలేరు. ఈ కారణంగానే తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత ఇదే కేసులో జైలుకు వెళ్లి వచ్చినా ఆమెపై ప్రజల్లో సానుభూతి ఏర్పడలేదు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న లిక్కర్ కుంభకోణాన్ని చూడాలి.


హేయం... నీచం...

దేశ చరిత్రలోనే ఇంతటి నీచమైన కుంభకోణం జరగలేదు. అధికారంలో ఉన్నంత కాలం నాసి రకం మద్యాన్ని ప్రజలకు సరఫరా చేసి వారి ప్రాణాలతో చెలగాటమాడారు. హేయమైన ఈ కుంభకోణంతో తనకు సంబంధం లేదని జగన్‌రెడ్డి చెప్పగలరా? చెప్పినా ప్రజలు నమ్ముతారా? జగన్‌రెడ్డిని కుల, మత ప్రాతిపదికన గుడ్డిగా అనుకరించేవారు, అభిమానించేవారు గణనీయంగా ఉంటే ఉండవచ్చునుగానీ చేసిన పాపానికి ఏదో ఒక రోజు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. పుష్కర కాలం క్రితం తనపై సీబీఐ దాఖలు చేసిన కేసు విచారణకు నోచుకోకుండా తప్పించుకోగలుగుతున్నామని జగన్ అండ్ కో ధీమాగా ఉండవచ్చునుగానీ, మద్యం కుంభకోణంలో పాపం కూడా చేశారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు... ఏపీలో జరిగిన కుంభకోణం వైపు ఇంకా చూడటం లేదు. దీనికి కారణం తెలియదు. ఐదేళ్ల పాటు సాగిన ఈ కుంభకోణంలో వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసిన లిక్కర్ కంపెనీలు అనూహ్యంగా మద్యం వ్యాపారంతో సంబంధం లేని కంపెనీలకు, సంస్థలకు చెల్లింపులు చేశాయి. ఈ విధంగా జరిగిన చెల్లింపులన్నీ చివరకు 'మూల విరాట్'కే చేరాయి. ఉదాహరణకు ఒక డిస్టిలరీ కంపెనీ ముంబైలోని ఒక వస్త్ర దుకాణానికి 28 కోట్ల రూపాయలు చెల్లించింది. ఆ దుకాణం నుంచి సదరు డిస్టిలరీ వస్త్రాలు కూడా కొనుగోలు చేయలేదు. ఈ విధంగా డిస్టిలరీలు ప్రభుత్వ పెద్దలకు చెల్లించాల్సిన కమీషన్లను వారు చెప్పిన కంపెనీలకు బదలాయించారు. అంతిమంగా, ఈ డబ్బు ఎవరికి చేరింది? ఏ మేరకు అక్రమ లావాదేవీలు జరిగాయి? ఇందులో ఎవరెవరి పాత్ర ఎంత? అనేది ఇంకా తెలియవలసి ఉంది. చరిత్రలో జరగని, చూడని రీతిలో జరిగిన ఈ కుంభకోణంపై దర్యాప్తును సిట్ అధికారులకే పరిమితం చేయకుండా ఆర్థిక వ్యవహారాలలో నిపుణులైన వారికి కూడా భాగస్వామ్యం కల్పించాలి. దర్యాప్తు పరిధిని విస్తరించాలి. అవసరాన్ని బట్టి మరిన్ని ఏజెన్సీలు రంగంలోకి దిగాలి. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం జాతీయ స్థాయిలో పతాక శీర్షికలతో ప్రచురితమైంది, ప్రచారం పొందింది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది అంతకు మించిన మహా ఘాతుకం కనుక రాష్ట్ర ప్రభుత్వం ఈ కుంభకోణంపై జాతీయ స్థాయిలో తెలిసేలా చేయాలి. జగన్‌రెడ్డి పాలనలో చోటుచేసుకున్న పాపాలను దేశ ప్రజలకు వివరించి అటువంటి నేరాలకు పాల్పడే వారికి రాజకీయాలలో చోటులేని విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు ఇంటి గుట్టు కూడా ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నందున... పాపులను శిక్షించడానికి సహకరించే వారందరికీ తగిన రక్షణ కల్పించాలి. భవిష్యత్తులో మరెవరూ లిక్కర్ కొనుగోళ్లలో ఇటువంటి దరిద్రపు ఆలోచన చేయకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి అరాచకాలపై ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నారు. నోరు పారేసుకున్న వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగినా పర్వాలేదుగానీ... మద్యం కుంభకోణం విచారణలో జాప్యం జరగకూడదు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరిగినా ఇలాంటి పాపాలకు పాల్పడిన వారికి లైసెన్స్ ఇచ్చినట్టు అవుతుంది.

జగన్ బేఖాతరు...

లిక్కర్ కుంభకోణంలో అయినా విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారతారో లేదో తెలియదు. ఎవరు అప్రూవర్‌గా మారినా మారకపోయినా ఈ కేసులో నిందితులను శిక్షించడానికి అవసరమైన ఆధారాలను సిట్ అధికారులు ఇదివరకే సేకరించారు. ఈ కేసులో జగన్‌రెడ్డి ప్రధాన నిందితుడు అవుతారా? లేదా? అన్నదే ప్రస్తుత ప్రశ్న. లిక్కర్ కేసులో చిక్కుకున్నవారు భయపడుతున్నట్టుగా జగన్‌రెడ్డి మాత్రం భయపడటం లేదు. అతనొక అసాధారణ మనస్తత్వం కలిగిన వ్యక్తి. సాధారణంగా ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయినవారు కోలుకోవడానికి సమయం తీసుకుంటారు. 2019లో ఓడిపోయిన చంద్రబాబు కోలుకోవడానికి రెండేళ్లకు పైగా సమయం పట్టింది. 2023లో తెలంగాణలో ఓడిపోయిన కేసీఆర్ కూడా ఏడాది పాటు మౌనంగా ఉండిపోయారు. జగన్‌రెడ్డి అంచనాలకు అందని విధంగా పరాజయం పాలైనా కుంగిపోలేదు. మూడు నెలలకే నిలదొక్కుకున్నారు. ఆరు నెలలు గడిచేసరికి త్వరలో నేనే అధికారంలోకి వచ్చేది అంటూ ప్రకటిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్లకు పైగా వ్యవధి ఉంది. అయినా రేపో మాపో అధికారంలోకి వచ్చేసినట్టుగా ఆయన ప్రవర్తిస్తున్నారు. ఈ విషయంలో ఆయన ఎంత బలంగా ప్రచారం చేస్తున్నారంటే, నిజంగా జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారా? అని ప్రజలతో పాటు కూటమి కార్యకర్తలు భయకంపితులు అవుతున్నారు. ఒక వ్యక్తి విషయంలో ప్రజలు కూడా భయపడటం ఇప్పుడే చూస్తున్నాం. కూటమి నాయకత్వం ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన జగన్ అండ్ కో హేయమైన పాపాలకు ఒడిగట్టారని ప్రజలకు వివరించగలిగినప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రాథమిక కర్తవ్యాన్ని నెరవేర్చినవారు అవుతారు. జగన్‌రెడ్డిని రాజకీయంగా సీసాలో బంధించడానికి లిక్కర్ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వానికి అందివచ్చిన ఆయుధం. ఈ ఆయుధాన్ని ఎంత సమర్థవంతంగా వినియోగించబోతున్నారో వేచి చూద్దాం!

నిజం చెప్తే నిష్ఠూరం..!



> **నేను ఎన్టీఆర్‌కి గానీ, తెలుగుదేశానికి గానీ మేలు చేయాలని అనుకుంటే – 'తెలుగుదేశానికేమీ పసలేదు, వాపే కానీ బలుపు లేదు' అని చెప్పేసేవాణ్ణి. అప్పుడు అధికార పార్టీ ఆరాంగా నిద్ర పోయేది. కానీ నేను హెచ్చరిక లాంటిది చేసి 'మేలుకోండి' అని ఒక అధికారిగా, నిజాయితీగా చెప్పేసరికి దానికి రకరకాల రంగులు పూసి పెట్టారు.**

నేనప్పటికి గుంటూరు, చీరాలలో law and order డీఎస్పీగా పని చేశాను గాబట్టి ఇతర శాఖల్లోనూ చేస్తే సీనియర్ అధికారి అయ్యాక అనుభవాలన్నీ ఉపయోగపడతాయని నాకు intelligence బ్రాంచీలో పని చేయాలన్న ఆసక్తి కలిగింది. అప్పటికే intelligence హెడ్డాఫీసులోని అధికారులు పరిచయం అయ్యారు గనక నా ఆసక్తి గమనించి అప్పటి హెడ్– కె. విజయరామారావు నన్ను వైజాగ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ చేశారు.

అప్పుడే తెలుగుదేశం పార్టీ పుట్టింది. ఎన్.టి. రామారావు ముమ్మరంగా జనంలో తిరుగుతున్నారు. ప్రజా రథానికి జనం జేజేలు పలుకుతున్నారు. తెలుగుదేశం జెండా చూసి మురిసిపోతున్నారు. ఎన్టీఆర్ మాటలకి, ఆయన ఆత్మగౌరవ నినాదానికి చెయ్యెత్తి జై కొడుతున్నారు. ఇన్ని మాటలు చెప్పటానికి 'నిఘా' ఏమీ పెట్టనవసరమే లేదు.

ఎన్టీఆర్ మీద అభిమానం ప్రజల్లో రోజు రోజుకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా వెనకబడిన వర్గాల్లో వూపు చెప్పనలవి గానిది. నిజానికి కాంగ్రెస్ పార్టీ అంత వరకూ ఎస్సీలకు, ఎస్టీలకు, మైనార్టీలకు మేలుచేసే పార్టీగా ముద్రపడింది. మిగతా backward classesలోనూ అవే పరిస్థితులున్నా కాంగ్రెస్ పట్టించుకోవడం లేదనే అపప్రథ ఉండేది. ఆ నేపథ్యంలో ఇందిరాగాంధీ కూడా విశాఖ వచ్చి రెండు మూడు మీటింగుల్లో మాట్లాడారు. కానీ ఒక చోట ఒక గ్రూపు, ఇంకో చోట ఇంకో గ్రూపు సభలను అనుకున్నంత గొప్పగా జరగనివ్వలేదు.

తెలుగుదేశం పార్టీకి ఎన్నికల్లో విజయావకాశాలు దండిగా వున్నాయని మా ఇంటెలిజెన్స్ హెడ్డాఫీసుకు తెలియచేయడం మొదలుపెట్టాను. అవతలి వాళ్లకు రోషాలు, కోపాలు! సి.ఆర్. నాయుడు 'కమ్మ కళ్ల'తో చూస్తున్నాడు అని నా మీద పితూరీలు మొదలుపెట్టారు. నేను చూసింది కమ్మ కళ్లతో కాదు, జనం కళ్లతో. వాళ్లకది అర్థం కాలేదు. అర్థం చేసుకోవడానికి కనీస ప్రయత్నం కూడా చెయ్యలేదు.

నేను ఎన్టీఆర్‌కి గానీ, తెలుగుదేశానికి గానీ మేలు చేయాలని అనుకుంటే – 'తెలుగుదేశానికేమీ పసలేదు, వాపే కానీ బలుపు లేదు' అని చెప్పేసేవాణ్ణి. అప్పుడు అధికార పార్టీ ఆరాంగా నిద్ర పోయేది. కానీ నేను హెచ్చరిక లాంటిది చేసి 'మేలుకోండి' అని ఒక అధికారిగా, నిజాయితీగా చెప్పేసరికి దానికి రకరకాల రంగులు పూసి పెట్టారు. మా అమ్మ ఎప్పుడూ చెప్తుండేది, 'ఎప్పుడూ నిజమే చెప్పు. కొందరికి నిష్ఠూరమైనా సరే' అని. ఆ ప్రకారమే నిజం చెప్పాను.

అప్పుడు హోం మంత్రిగా వున్న రోశయ్య నాకు చీరాల, గుంటూరు నుంచే తెలుసు. ఆయన విశాఖ వచ్చినప్పుడల్లా నన్ను ప్రత్యేకంగా వెంట బెట్టుకుని తిరిగేవారు. నేనంటే కాస్త ఇష్టం కూడా అనుకుంటాను. ఒకరోజు నాతో రోశయ్య, "ఏం నాయుడూ! సినిమా ఆయన ఎన్టీఆర్ తిరుగుతున్నాడు గదా, జనం వస్తున్నారు. మేమూ మీటింగులు పెడితే జనమైతే వస్తారు గదా. ఏమంటావ్?" అనడిగారు.

"సార్ లీడర్లంతా మీ వైపు, ఓటర్లంతా ఆ వైపు!" అన్నాను నవ్వుతూనే. "హేయ్, వూరుకో, నువ్వేదో అభిమానం కొద్దీ అంటున్నావ్, అదేం కాదు" అని ఆయనా సరదాగానే కసురుకున్నారు. "చూద్దాం లెండి సార్," అన్నా నేనూ తగ్గకుండా.

నా మీద కొందరు పితూరీలు చెప్పారు కాబట్టి సత్యం నిగ్గు తేల్చుకోవడానికి విశాఖ జిల్లా అంతా రహస్యంగా తిరిగా. అలా పాయకరావుపేట వెళ్లినప్పుడు బడ్డీ కొట్టు దగ్గర ఒక సిగరెట్టు తీసుకుని అక్కడున్న తాడుతో ముట్టించుకుని, బడ్డీ కొట్టు కుర్రాడితో మాట కలిపా... 'ఎవరండీ' అనడిగితే, ప్రెస్ రిపోర్టర్‌ని అని చెప్పా. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ, "ఏంటీ, ఈ పాయకరావుపేటకి గంటెల సుమన అనే candidateని తెలుగు దేశం వాళ్లు నిలబెట్టబోతున్నారట. ఆమెని మీరెప్పుడన్నా చూశారా? ఆవిడ ఎక్కడావిడ? గ్రామం ఏది?" అనడిగా.

"ఏమోనండి సార్, నాకు తెలీదు, అయినా మేం ఓటేసేది ఎన్టీ రామారావుకి కదా. గంటెల సుమన ఎవరైతే మాకేంటి?" అనేశాడు. ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం గెలిచింది.

తెలుగుదేశం పార్టీ గెలిచాక ఎన్టీఆర్ ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునే కాలం మొదలైంది. ఆయన చేసిన వాగ్దానాల్లో – అవినీతి పాలన అంతమొందిస్తాననేది ఒకటి.

కొద్ది నెలలకే ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ఫోను! ఏకంగా ఇంటెలిజెన్స్ చీఫ్ అప్పారావు నుంచే! "ఇంటెలిజెన్స్‌కి రా. నీలా ఇంటెలిజెన్స్‌లో అనుభవం వున్న ఆఫీసర్లు జిల్లాల్లో కాదు వుండాల్సింది! హెడ్డాఫీసు హైదరాబాద్‌కి రా" అంటూ– అంతే, హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

నేను హైదరాబాద్ చేరిన తొలి నాళ్లలోనే మచిలీపట్నం అసెంబ్లీ ఉప ఎన్నిక వచ్చింది. అక్కడున్న ఎమ్మెల్యే హఠాత్తుగా చనిపోబట్టి! అప్పుడు వసంత నాగేశ్వరరావు హోం మినిస్టర్. కృష్ణా జిల్లా వాసి. ఆయనకు ఉప ఎన్నికల్లో గెలుస్తామో లేదో అని డౌట్. ఎన్టీ రామారావుకి ఇదే చెప్పారు. అప్పుడు ఎన్టీఆర్ ఇంటెలిజెన్స్ చీఫ్ అప్పారావుని పిలిచి అడిగారు, "ఏం జరుగుతుంది"ని. విజయవాడలో ఉన్న ఇంటెలిజెన్స్ డీఎస్పీ కూడా డౌట్‌గా చెప్తున్నాడు. అప్పారావు నన్ను పిలిచి 'సరిగ్గా' కనుక్కోమన్నారు. వెంటనే బయలుదేరి విజయవాడ వెళ్లాను. అక్కడ లోకల్‌గా వున్న ఇంటెలిజెన్స్ డీఎస్పీతో మాట్లాడి ఆయనకున్న సమాచారాన్నంతా నోట్ చేసుకున్నాను. తర్వాత అక్కడ నుంచి ఒక ఎస్సైని వెంటబెట్టుకుని బందరు వెళ్లాను. నాతో ఉన్న ఎస్సైకి చెప్పి– రోజంతా మాతో వుండడానికి రిక్షా అతన్ని మాట్లాడుకుని– ఎస్సై, నేను రిక్షా ఎక్కి అతన్ని మాటల్లోకి దింపాము. రిక్షా కార్మికుల సమస్యలన్నీ చెప్పాడు. టిఫిన్ తింటూ తింటూనే హోటల్ కార్మికుల్ని కూడా కదిపి చూశాము. వాళ్ల సాధక బాధకాలన్నీ నాకు బోధపడ్డాయి. టిఫిన్ అయ్యాక as usualగా కిళ్లీకొట్టు, సిగరెట్టు! కిళ్లీ కొట్టతనితో మాటామంతీ కానిచ్చి, రిక్షాలో వూరంతా తిరగడం మొదలుపెట్టాము. ఇంకా మచిలీపట్నం పక్కనున్న పెడన వెళ్లాము. అక్కడ ఎక్కువగా నేత కార్మికులు– ప్రభుత్వం నుంచి వారేమి కోరుకుంటున్నారో కనుక్కున్నా. బీచ్ వున్న వూరు కాబట్టి మత్స్యకారుల సమస్యల్నీ, కోరికల్నీ నోట్ చేసుకున్నా.

మరుసట్రోజు నేను సేకరించిన సమాచారాన్ని అన్ని కోణాల నుంచి విశ్లేషించి మా చీఫ్ అప్పారావుకు బ్రీఫ్ చేశాను. ఏమీ అవాంతరాలు లేకపోతే తెలుగుదేశం 10 నుంచి 15 వేల మెజార్టీతో గెలిచే అవకాశం వుందని చెప్పాను. ఆగమేఘాల మీద నేను చూపించిన స్థానిక సమస్యలకు పరిష్కారాలు చేపట్టడం మంచిదని చెప్పాను. అప్పారావు ఎన్టీఆర్‌ను కలిసి 10, 15 వేల మెజార్టీ అనకుండా ఎందుకైనా మంచిదని, 5 వేల మెజార్టీతో బయటపడతామని చెప్పేశాడు. ఎన్నికలు జరిగాయి. 13 వేల పైచిలుకు మెజార్టీతో తెలుగుదేశం గెలిచింది.

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి చేరెడ్డి రామచంద్రనాయుడు (సి.ఆర్.నాయుడు) ఆత్మకథ 'కొండ మెట్లు' పుస్తకం నుంచి కొన్ని భాగాలు ఇవి.


వేయిస్తంభాల ఆలయంలో శనీశ్వరునికి తైలాభిషేకం చేస్తున్న అర్చకులు


ఎల్కతుర్తిలో సిద్ధమైన బీఆర్ఎస్ రజతోత్సవ సభా వేదిక

సభా ప్రాంగణం వద్ద కేసీఆర్ కటౌట్

సందడిగా.. వడివడిగా..

నేడు బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభ

- ఎడ్లబండ్లు, ప్రభబండ్లు, ర్యాలీలు, పాదయాత్రలతో తరలుతున్న శ్రేణులు
- స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, పార్టీజెండాలతో ఓరుగల్లు రోడ్లు గులాబీమయం
- విస్తృత ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ నేతలు
- 1,213 ఎకరాల్లో సభ ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లు
- 1,100మంది పోలీసులతో బందోబస్తు

7

ఎల్కతుర్తి బాటలో గులాబీ దళం

'గులాబీ' పార్టీ పాతికేళ్ల పండుగకు ఓరుగల్లు ముస్తాబైంది. ఎల్కతుర్తి వేదికగా ఆదివారం జరిగే బీఆర్ఎస్ సభకు సర్వం సిద్ధమైంది. తమ అధినేత కేసీఆర్‌తో పాటు ముఖ్యనేతలంతా హాజరయ్యే ఈ సభను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ శ్రేణులు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. పాదయాత్రలు, ఎడ్లబండ్లు, ప్రభ బండ్లు, వాహనాల ర్యాలీలతో సభా ప్రాంగణానికి పయనమవడంతో ఓరుగల్లు రోడ్లు గులాబీ మయమయ్యాయి. ఉమ్మడి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన శ్రేణుల రాకతో సర్వత్రా సందడి వాతావరణం కనిపిస్తోంది. ఇప్పటికే పలు ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు ఎల్కతుర్తి మండల కేంద్రం గులాబీ జెండాలు, తోరణాలు, నేతల కటౌట్లు, ఫ్లెక్సీలతో కళకళలాడుతున్నాయి. 2005, 2010లో వరంగల్ కేంద్రంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలకు దీటుగా ఈ రజతోత్సవ సభను నిర్వహించేలా.. లక్షలాదిగా జనసమీకరణ చేసేందుకు గులాబీదళం కార్యాచరణ అమలు చేసింది. ఇక అసెంబ్లీ ఎన్నికలు సహా వరుస ఓటములతో నైరాశ్యంలో ఉన్న గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేలా సభను జయప్రదం చేయాలన్న సంకల్పంతో పార్టీ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 1,216 ఎకరాలను సిద్దం చేయగా.. 169ఎకరాల్లో సభప్రాంగణం, వెయ్యి ఎకరాల్లో పార్కింగ్, మిగతా స్థలాల్లో మరుగుదొడ్లు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించి.. పర్యవేక్షణకు సీసీ కెమెరాలు, 2వేల మంది వలంటీర్లను ఏర్పాటు చేసింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్


సభ ఏర్పాట్ల గురించి నేతలతో మాట్లాడుతున్న హరీష్‌రావు

ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా పనిచేస్తాం

- బీఆర్ఎస్ పుట్టిందే వారి కోసం.. దేశానికి మార్గదర్శి కేసీఆర్
- దేవుళ్లపై ఒట్లేసి.. అసెంబ్లీలో మాటిచ్చి మోసం చేసింది కాంగ్రెస్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు
- ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్ల పరిశీలన

7

ఘనంగా శనిత్రయోదశి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శనివారం మాసశివరాత్రితోపాటు శనిత్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రుద్రేశ్వరుడిని సందర్శించి శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శని దోష నివారణ కోసం వివిధ రాశుల వారు ప్రత్యేక తైలాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారి మాసశివరాత్రి సందర్భంగా వైభవంగా రుద్రేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. యజ్ఞోపవీతం, జీలకరబెల్లం, మంగళసూత్రం, తలంబ్రాలు, షోడసోపచార పూజల అనంతరం నీరాజనమంత్రపుష్పం నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్ పర్యవేక్షించారు.

మెట్టుగుట్టలో..

మడికొండ : మడికొండలోని మెట్టురామ లింగేశ్వరస్వామి, సీతారామచంద్ర స్వామి క్షేత్రంలో మాస శివరాత్రి, శనిత్రయోదశి సందర్భంగా భక్తులు స్వయంభూ శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక అర్చనలు జరిపా రు. అనంతరం లోక కళ్యాణార్థమై యాగశాలలో రుద్రహోమం, నవగ్రహ హోమం, శనైశ్చర మూల మంత్ర హోమం చేశారు. ఈవో శేషుభారతి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, పారపెల్లి సత్యనారాయణ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభ

- ప్రజలే స్వచ్ఛందంగా తరలొస్తున్నారు
- మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారు
- టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌ది ఒకటే జెండా.. ఒకటే అజెండా
- అదే కారుగుర్తు.. కేసీఆరే అధ్యక్షుడు
- వరంగల్ సభతో రాష్ట్ర రాజకీయాల్లో సంచలన మార్పులు

7


'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్సీ, సభ ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ఎర్లీబర్డ్ లక్ష్యాలను సాధించాలి : సీడీఎంఏ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలు ఎర్లీబర్డ్ లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి అన్నారు. శనివారం హైదరాబాద్ కార్యాలయం నుంచి రాష్ట్ర మునిసిపాలిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్‌లతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ బల్దియా నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీఎంఏ శ్రీదేవి మాట్లాడుతూ.. 5 శాతం రిబేట్‌తో ఆయా మునిసిపాలిటీల అధికారులు ముందస్తుగా 45 శాతం వార్షిక పన్నులు వసూలు చేయాలని అన్నారు. ఈ నెల 30 లోగా ఆయా మునిసిపాలిటీల పన్ను వసూళ్ల లెక్కలను రాష్ట్ర కార్యాలయానికి వెల్లడించాలని ఆదేశించారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జేడీ లక్ష్మీనారాయణ, తదితరులు

'పోకల పలుకులు' గ్రంథావిష్కరణ

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండకు చెందిన లయన్ పీడీజీ, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ స్వర్గీయ పోకల చందర్ రాసిన చమక్కుల గేయ కావ్యం 'పోకల పలుకులు' గ్రంథాన్ని శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో జేడీ మాట్లాడుతూ పోకల సాహిత్య అభిలాషి, మానవతావాది అని కొనియాడారు. ఆయనతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా సేవాభావం కలిగిన వ్యక్తిగా జీవిత కాలం పోకల చందర్ కృషి చేశారని కొనియాడారు. పెండెం వేణుమాధవ్ సంయోజకులుగా వ్యవహరించి నిర్వహించిన కార్యక్రమంలో నెల్లుట్ల రమాదేవి తనదైన శైలిలో గ్రంథాన్ని సమీక్షించారు. భాషా సంచాలకులు మామిడి హరికృష్ణ, నీల్, రమ్య, దేవి, నమశివాయా, పోల శ్రీధర్, కంది కొండ శ్రీనివాస్‌లతో పాటు చందర్ సహచర లయన్ నేతలు కె.గోవిందరాజ్, డాక్టర్ లక్ష్మీనర్సింహరావు, కన్నా పరశురాములు, హనుమకొండ లయన్ నేతలు ప్రొఫెసర్ ఎస్ఎం.రెడ్డి, రేపూరి రమణారెడ్డి, ప్రొఫెసర్ రమణయ్య, సత్యనారాయణ, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ట్రాలీ ఆటోడ్రైవర్ మృతి



చంద్రమౌళి (ఫైల్)

కమలాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్ కొయ్యడ చంద్రమౌళి (45) వడదెబ్బతో శనివారం మృతి చెందాడు. మృతుడు చంద్రమౌళి తన ట్రాలీతో ఉప్పల్ నుంచి పరకాల మండలానికి కూలీలను తీసుకొని వస్తుంటాడు. అదే క్రమంలో ఉదయం కూలీలను దింపేసి వెళ్లి ఉప్పల్‌లో కిరాయిలు చేశాడు. మధ్యాహ్నం తర్వాత కూలీలను పరకాల నుంచి ఉప్పల్‌కు క్షేమంగా తీసుకువచ్చాడు. అనంతరం మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి కిరాయికి వెళ్లాడు. వడదెబ్బ తగలడంతో అక్కడే అస్వస్థతకు గురై మృతి చెందాడు.

ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారు..

- రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలి వస్తున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



ప్రభబండికి స్వాగతం పలుకుతున్న చల్లా ధర్మారెడ్డి, వినయ్ భాస్కర్



ఎడ్ల బండ్ల ర్యాలీలో పాల్గొన్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బూటకపు హామీలతో ప్రజలను మాయచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల్లోనే విఫలమైందని ప్రజలు కేసీఆర్, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి స్వచ్ఛందంగా 800 ఆటోల ద్వారా సభకు వెళ్తుండగా వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల జీవితాలను ఆగం చేసిందన్నారు. సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఆటో డ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడవేసిందన్నారు. వందలాది మంది ఆటో డ్రైవర్లు జీవనోపాధి కరువై ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కేసీఆర్ హయాంలో ఆటో కార్మికులకు ట్యాక్స్ రద్దు చేసి రుణాలు అందించి కార్మికులకు లైసెన్స్‌లు ఇవ్వడంతో పాటు ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. రజతోత్సవ సభకు ఆటో డ్రైవర్లు రూ. లక్షా 116 విరాళం అందించారని పేర్కొన్నారు.

ఎడ్ల బండ్లతో వచ్చిన రైతులకు ఘన స్వాగతం..

సూర్యాపేట జిల్లా నుంచి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు స్వచ్ఛందంగా ఎడ్లబండ్లతో ఎల్కతుర్తి సభకు బయల్దేరి రావడంతో శనివారం హనుమకొండలోని కాళోజీ సెంటర్ వద్ద హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ రైతులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, జోరిక రమేష్, ఆటో యూనియన్ సంఘం నాయకులు రవీందర్‌రెడ్డి, సంజీవ్, అనిల్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, కుమార్, బాలు, జయరాం, స్వామి, సంజీవ్, బాబు, రమేష్, రవీందర్, రాజేందర్, గణేష్, సంతోష్, నాగరాజు, శరత్, సమీర్, సుదర్శన్, రవి, కిట్టు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల గుండె ధైర్యమే కేసీఆర్

మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, వినయ్ భాస్కర్

తెలంగాణ ప్రజలకు గుండెధైర్యమే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి , పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శనివారం పరకాల నియోజకవర్గంలోని గీసుగొండ, సంగెం మండలాల నుంచి రజతోత్సవ మహాసభకు 60 ఫీట్ల పొడవుతో గులాబీ జెండాలు , కేసీఆర్ ఫొటోలతో ఏర్పాటు చేసిన ప్రభబండ్లను హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వద్ద ప్రభబండికి కొబ్బరికాయ కొట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభబండ్లను నడుపుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. మహిళలు ఉత్సాహంగా గులాబీ జెండాలను చేతపట్టి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాన్ని ప్రజలు ఇంటి పండుగలా జరుపుతున్నారని అన్నారు. దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గూడ సుదర్శన్‌రెడ్డి, పసునూరి సారంగపాణి, పలు గు సాగర్‌రెడ్డి, లేతాకుల సంజీవరెడ్డి, కార్పొరేటర్ సోదా కిరణ్, చెన్నం మధు, బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, నేతాని శ్రీనివాస్‌రెడ్డి, సుదాటి వెంకటేశ్వర్లు, జాకీర్ అలీ, చందుపట్ల సాయి తిరుపతిరెడ్డి, శనిగరపు నవీన్, గండు రాము, దాడి మల్లయ్య, దురిశెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ తనిఖీ

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టేకులగూడెంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య మందిర్‌లో అందుతున్న 12 రకాల సేవలను పరిశీలించారు. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఎంత మందికి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ద్వారా సేవలు అందుతున్నాయో తెలుసుకున్నారు. అనంతరం సోమిడిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి నిల్వ ఉంచిన వ్యాధి నిరోధక టీకాలు, ఔట్రీచ్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో డ్యూ లిస్టును, వీవీఎంలను, హాజరు పట్టికను, ఫార్మసీ, ల్యాబ్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ అనిత, డాక్టర్ సృజన, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టేకుల గూడెంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

ప్రజలకు క్షమాపణ చెప్పి రజతోత్సవ సభకు రావాలి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజలను మోసం చేసిన కేసీఆర్ యావత్తు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి ఎల్కతుర్తిలో జరిగే సభకు రావాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హంటర్‌రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కష్టార్జితాన్ని కాళేశ్వరం ప్రాజెక్టులో పెట్టి అక్కరకు రాకుండా నిర్మించాడన్నారు. ఒక్క పిల్లరు కుంగిపోయిందని ఇన్ని రోజులు ప్రజలకు మాయమాటలు చేప్తూ నెట్టుకొచ్చాడని కానీ కేంద్ర కమిటీ ప్రాజెక్టు మొత్తం ప్రమాదంలో ఉందని, మరో మూడో ప్రాజెక్టులపై సైతం టెక్నికల్‌గా సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని నివేదిక విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. దీనిపై ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే సభలో ఏమి సమాధానం చేప్తావని ప్రశ్నించారు. రాజకీయ లబ్ది కోసం కేంద్ర పథకాలైన ఆయుష్మాన్ భారత్, ప్రధాని మంత్రి ఆవాస్ యోజనను రాకుండా అడ్డుకుంది మీరు కాదా అని ప్రశ్నించారు. దమ్ముంటే ఉద్యకారులకు రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఇచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో కొవ్వొత్తులతో ర్యాలీ

మడికొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో మృతి చెందిన పర్యాటకుల కోసం శనివారం మడికొండలో బీఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి చౌరస్తాలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో అబ్బ సాయిలు, గోపనబోయిన రాజు, పల్లపు రాజ్‌కుమార్, బరిగెల క్రిష్ణ, గంగారపు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మండుతున్న ఎండలు

- భూపాలపల్లి జిల్లాలో అత్యధికం
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

హనుమకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండలు మండిపో తున్నాయి. ఉక్కపోత ఎక్కువైంది. ప్రజలు ఎక్కిరిబిక్కిరి అవుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి మహదేవ్‌పూర్ మండలం పద్దంపేటలో 42.5 డిగ్రీలు, ములుగు జిల్లా కన్నాయిగూడెంలో 42.4 డిగ్రీలు, హనుమకొండ జిల్లా కాజీపేటలో 42.2, వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం మంగ శవారిపేటలో 41.2 డిగ్రీలు, జనగామ జిల్లాలోని చిల్పూర్ మండలం మాల్కాపూర్‌లో 41.8 డిగ్రీలు మహబూబాద్ జిల్లాలోని గార్లలో 41.9 డిగ్రీలు, ఉష్ణోగ్రత నమోదైంది.

డిగ్రీ పరీక్షలు మళ్లీ వాయిదా

- వారం రోజుల్లో రెండుసార్లు పోస్ట్‌పోన్
- ప్రైవేట్ కళాశాలలు ఫీజులు చెల్లించకపోవడమే కారణం
- మళ్లీ ఎప్పుడనేది స్పష్టత ఇవ్వని కేయూ అధికారులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మళ్లీ వాయిదా పడ్డాయి. వారం రోజుల్లోనే వాయిదా పడడం ఇది రెండోసారి. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. దీంతో 1.70 లక్షల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి మొదట ఏప్రిల్ 21 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల ఫీజులను చెల్లించకపోవడంతో వాయిదా వేశారు. తర్వాత ఏప్రిల్ 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించారు. తీరా పరీక్షల తేదీ దగ్గర పడగా మళ్లీ రెండో దఫా వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. శనివారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డితో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు భేటీకి ప్రయత్నించాయి. అయితే రాష్ట్ర ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో వీసీ సమావేశం ఉండటంతో ఆయన వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం వరకు కూడా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదు. మరోవైపు ఆదివారం సెలవు.. తెల్లవారితే సోమవారమే పరీక్షలు ఉండడంతో పరీక్షల నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలలోని విద్యార్థులు టెన్షన్‌గా ఎదురుచూశారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఒకే అన్నట్లయితే శరవేగంగా విద్యార్థులకు పరీక్షల కేంద్రాల కేటయింపుతో పాటు హాల్ టికెట్ల జారీకి యుద్ధ ప్రాతిపాదికనగా విడుదల చేసేందుకు పరీక్షల నియంత్రణాధికారులు సిద్ధమయ్యారు. ఈలోగా పరీక్షలను మళ్లీ వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ వెంకయ్య ప్రకటించారు.

ప్రవేశ పరీక్షలపై ప్రభావం

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడడంతో రానున్న ఏడాది పీజీతో పాటు ఇతర కోర్సుల ప్రవేశ పరీక్షలపై ప్రభావం పడనుంది. ఎడ్‌సెట్, ఐసెట్, లాసెట్‌తో పాటు ఇతర పోటీ పరీక్షలకు విద్యార్థులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. డిగ్రీ పరీక్షలు అలస్యంగా నిర్వహించడం వల్ల పేపర్ వాల్యుయేషన్‌తో పాటు ఇతర సమస్యలు ఏర్పడుతాయని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఏ అర్హతతో సభ నిర్వహిస్తున్నారు ?

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

వరంగల్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు వరంగల్ అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్ నాయకులు ఇపుడు ఏ అర్హతతో వరంగల్‌లో సభ నిర్వహిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ప్రశ్నించారు. శనివారం వరంగల్ చౌరస్తాలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేసి వరంగల్, హనుమకొండ జంటనగరాలను రెండు జిల్లాలుగా విభజించి కాకతీయుల చరిత్రను కాలరాశారని మండిపడ్డారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయలేదని, వరంగల్ అభివృద్ధి కోసం యేటా రూ.300 కోట్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. వరంగల్‌లో ఎంతమందికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చారని ప్రశ్నించారు. 2023 ఎన్నికలకు ముందు వరంగల్‌లో రూ. 750 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కేటీఆర్ ఆ అభివృద్ధి పనులను చూపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టును మంజూరు చేసినా భూసేకరణను అడ్డుకున్నది బీఆర్ఎస్ పార్టీనే అని ఆరోపించారు. సైనిక్ స్కూల్, హెచ్ఆర్డీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లకు భూమి కేటాయించలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మరోసారి మోసం చేయడానికి కేసీఆర్ కంపెనీ వస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, మాచర్ల దీన్‌దయాళ్, గడల కుమార్, క్రాంతికుమార్, ఆడెపు వెంకటేష్, సాగర్, పోలెపాక మార్టిన్ లూథర్, రఫీ, సుమన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గంటా రవికుమార్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సర్వం సన్నద్ధమైంది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు మిడిల్ పాయింట్‌గా ఉన్న ఎల్కతుర్తి వద్ద భారీ సభను నిర్వహిస్తున్నారు. 50వేల వాహనాలకు పార్కింగ్ చేసే విధంగా, రైతుల నుంచి సేకరించిన 1,216 ఎకరాల్లో 1,059 ఎకరాలను పార్కింగ్ కోసం కేటాయించారు. వివిధ ప్రాంతాల నుంచే వచ్చే బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్కింగ్ పరంగా ఇబ్బందులు ఎదురుకాకుండా ఐదు జోన్లుగా విభజించారు. 2వేల మంది గులాబీ వలంటీర్లను నియమించారు. అలాగే 154ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. 500మంది కూర్చునే సామర్థ్యంతో వేదికను నిర్మిస్తున్నారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదిక వెనుక వైపు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. అలాగే లక్షకు పైగా కుర్చీలను వేస్తున్నారు. భారీ సైజులో ఉన్న 23 ఎల్ఈడీ స్ర్కీన్‌లను సభా ప్రాంగణంలో ఎక్కడ కూర్చున్న కనిపించేలా ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ కోసం 200 జనరేటర్లను సమకూర్చుకున్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా 1,200కు పైగా తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించారు. వీటితో పాటు 12 వైద్యశిబిరాలను, ఆరు అంబులెన్స్‌లు, వాహనాలకు ట్రాఫిక్‌లో చెడిపోతే పక్కకు తీసుకెళ్లేందుకు 25టోయింగ్ వాహనాలను అందుబాటులో ఉంచారు. సభకు వచ్చేవారి కోసం 10లక్షల వాటర్ బాటిళ్లు, 15లక్షల మజ్జిగ బాటిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. 200మొబైల్ పెట్రోలింగ్ వాహనాలు, 200సీసీ కెమెరాలు, 200 వైర్‌లెస్ సెట్లతో నిరంతరం పర్యవేక్షించేలా గులాబీ నేతలు ఏర్పాట్లు చేశారు. దారిపొడువునా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, వాల్‌రైటింగ్‌తో గులాబీమయం చేశారు.


సభా ప్రాంగణంలో తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది


ఎల్కతుర్తిలో సిద్ధమైన సభా ప్రాంగణం

సందడిగా.. వడివడిగా..

నేడు బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ

- విస్తృత ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ నాయకులు
- ఎల్కతుర్తి బాటలో 'గులాబీ' దళం
- ఎడ్లబండ్లు, ప్రభబండ్లు, ర్యాలీలు, పాదయాత్రలతో తరలుతున్న శ్రేణులు
- స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో ఓరుగల్లు రోడ్లు గులాబీమయం

జన సమీకరణపై గులాబీ నేతలు ఫోకస్

రజతోత్సవ సభకు భారీగా జనసమీకరణ చేసేందుకు గులాబీ నేతలు తీవ్ర కసరత్తు చేశారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లా నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 30వేల నుంచి 50వేల వరకు, సభకు సమీపంలో ఉన్న నియోజకవర్గాల్లో 70వేల వరకు జనాన్ని తరలించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే 2.50లక్షల మందిని తరలించనున్నట్లు తెలుస్తోంది. 2010 డిసెంబరు 16న వరంగల్‌లోని ప్రకాష్‌రెడ్డిపేటలో జరిగిన శంఖారావం సభకు రికార్డు స్థాయిలో జనం రగా.. ఆ సభకు దీటుగా లక్షలాది మందిని తరలిస్తామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు పూర్తిచేయగా.. వర్ధన్నపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ఇప్పటికే ఎడ్లబండ్లపై బీఆర్ఎస్ కార్యకర్తలు సభకు బయలుదేరారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి మాజీ మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో, ములుగు జిల్లా వెంకటాపూర్ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు పాదయాత్రలతో సభకు వస్తున్నారు. వరంగల్ జిల్లా కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి జాతర ప్రభబండ్లతో ఎల్కతుర్తి సభకు బయలుదేరారు. వివిధ మార్గాల్లో గులాబీ శ్రేణులు సభకు వస్తుండటంతో క్యాడర్ జోష్‌లో ఉంది. ఇప్పటికే బీఆర్ఎస్ 3వేల ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. వీటితో పాటు అందుబాటులో ఉన్న వాహనాల ద్వారా సభకు జనాన్ని తీసుకవచ్చేందుకు నేతలు దృష్టి సారించారు. సుమారు 30వేల నుంచి 40వేల వాహనాల్లో జనం తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

శ్రేణుల్లో జోష్ నింపేలా వేడుకలు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన బీఆర్ఎస్ 14ఏళ్ల ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది. ఆ తరువాత 2014లో తెలంగాణలో అధికారం చేపట్టి సుమారు పదేళ్లు పాలించింది. అయితే టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చుకుని 2023 నవంబరులో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైంది. తొలిసారిగా ప్రధాన ప్రతిపక్ష పాత్రను పోషిస్తోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి తేరుకోకముందే 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గులాబీ పార్టీ గెలుచుకోలేదు. దీంతో బీఆర్ఎస్ క్యాడర్ తీవ్ర నిరాశకు గురైంది. ఆ తరువాత వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిని ఎదుర్కొవాల్సి వచ్చింది. గత మార్చిలో జరిగిన వరంగల్, నల్గొండ, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ దూరంగా ఉండటం గులాబీ శ్రేణులు మరింత నిరాశకు గురయ్యాయి. వరుసగా ప్రతి ఎన్నికల్లో ఓటమితో క్యాడర్‌లో కొన్ని చోట్ల చేజారుతుండగా, మరికొన్ని చోట్ల నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో జోష్ నింపి.. తెలంగాణలో మళ్లీ కారు పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు బీఆర్ఎస్ అధిష్టానం రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. సుమారు రూ.100కోట్లకు పైగా ఈ వేడుకల కోసం ఖర్చు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. రాష్ట్రంలోని 12,750గ్రామాల నుంచి జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక్కరినైనా సభకు తరలిస్తామని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. సభ వేదికను కూడా వ్యూహత్మకంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు సెంటర్ పాయింట్‌గా ఎల్కతుర్తిని ఎంపిక చేశారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇలాంటి భారీ సభలు నిర్వహించి, ప్రజల చూపు తన వైపు తిప్పుకోవటంతో కేసీఆర్ దిట్ట అనే టాక్ ఉంది. టీఆర్ఎస్ ఆవిర్భావం తరువాత 2005, 2010, డిసెంబరు 16న వరంగల్‌లో శంఖారావం సభలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసి పడేలా చేశారన్న పేరుంది. అదే వ్యూహంతో ప్రస్తుతం వరుస ఓటములతో నిరాశలో ఉన్న క్యాడర్‌లో జోష్ నింపేందుకు రజతోత్సవ వేడుకలకు వరంగల్ కేంద్రంగా భారీ బహిరంగ సభ ద్వారా ప్రజల్లో మళ్లీ గులాబీ గుబాళించేలా కేసీఆర్ వ్యూహరచన చేశారనే చర్చ జరుగుతోంది. గులాబీ నేతలు కూడా తమ మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి సభను సవాల్‌గా తీసుకుని పని చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఐదు జోన్లుగా పార్కింగ్

రజతోత్సవ సభకు వచ్చేవారి కోసం ఐదు జోన్లుగా విభజించి పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి జోన్‌లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మల్లంపల్లి, గుడెప్పాడ్, వంగపహాడ్, ఎన్‌హెచ్ 163 యూటర్న్ తీసుకుని హసన్‌పర్తి, ఎల్లాపూర్ నుంచి వాహనాల పార్కింగ్ కోసం హనుమకొండ-కరీంనగర్ జాతీయ రహదారి పక్కన ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర వెనకాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. అలాగే జోన్-2లో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. జోన్-3లో జనగామ, స్టేషన్‌ఘనపూర్ నుంచి వచ్చేవారి కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. జోన్-4లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్‌తో పాటు వరంగల్‌లోని భూపాలపల్లి, పరకాల నుంచి వచ్చే వారి కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇక జోన్-5లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లోని కొంత భాగం నుంచి వచ్చేవాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు.

నేడు గులాబీ రజతోత్సవం

తెలంగాణ స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా ఏర్పడిన బీఆర్ఎస్ 24 ఏళ్లు పూర్తి చేసుకుని ఆదివారం 25వ ఏటా అడుగు పెడుతోంది. ఈ క్రమంలో ఎల్కతుర్తి వేదికగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు నేతలు సన్నద్ధమయ్యారు. ఇక్కడ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయగా.. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితల సతీష్‌కుమార్ సభ ఏర్పాట్లు పూర్తి చేశారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత తదితర నేతలు సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం సాయంత్రం 4.30గంటలకు కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా ఎల్కతుర్తిలోని సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు సభ నిర్వహణకు అనుమతి ఉంది. భారీ ఎత్తును జనసమీకరణ పై దృష్టి పెట్టిన నేతలు, వారు ఇంటికి చేరే వరకు పర్యవేక్షించే కమిటీని కూడా ఏర్పాటు చేశారు. మొత్తానికి రజతోత్సవ సభతో గులాబీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకెళుతోంది.

పోలీసుల భారీ బందోబస్తు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వరంగల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 1,100మందికి పైగా పోలీసులు, ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 8మంది ఏసీపీలు, 28మంది సీఐలు, ఆర్ఐలు, 66మంది ఎస్ఐలు, 137మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 511మంది కానిస్టేబుళ్లు, 200మంది హోంగార్డులతో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.


గీసుగొండ నుంచి వస్తున్న బీఆర్ఎస్ ప్రభ బండి, కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా సమర్ధవంతంగా పనిచేస్తాం

- బీఆర్ఎస్ పుట్టిందే వారి కోసం.. దేశానికి మార్గదర్శి కేసీఆర్
- దేవుళ్లపై ఒట్లేసి.. మోసం చేసిన కాంగ్రెస్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు
- ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్ల పరిశీలన


సభాప్రాంగణం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న హరీష్‌రావు, చిత్రంలో పలు జిల్లాల నేతలు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజల కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా పనిచేస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను శనివారం ఆయన పరకిశీలించారు. ఆయన వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవిందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగుర్ల వెంకన్న తదితరులు ఉన్నారు. సభ స్థలం, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. 14యేళ్లు ఉద్యమ పార్టీగా, పదేళ్లు అధికార పార్టీగా, ఏడాదిన్నర కాలంగా ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా వారి ఆకాంక్ష మేరకు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. వరంగల్ జిల్లాకు భారీ బహిరంగ సభలు జరిపిన ఘనమైన చరిత్ర ఉందని, వరంగల్ మహాగర్జన చరిత్రలో నిలిచిందన్నారు. ఇప్పుడు ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ జరుపుకోవడం ద్వారా మరో చరిత్రను తిరగరాస్తున్నామన్నారు. సమైక్య రాష్ట్రంలో కరువు కాటకాలకు, వలసలకు, ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న తెలంగాణకు విముక్తి కలిగించింది బీఆర్ఎస్ పార్టీయేనని, నాడు ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ప్రజల పక్షాన నిలిచింది గులాబీ జెండాయేనన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఏడాదిన్నరలోనే ఆ పార్టీ చెప్పిన మాయమాటలు ప్రజలకు అర్థమయ్యాయయన్నారు. కేబినెట్‌లో ఉన్న నాయకులు అనాలోచితంగా ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర ఆదాయాన్ని ఏటా 12 శాతానికి పెంచి వచ్చిన సంపదను పేదలకు పంచిందని, కానీ కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే ప్రభుత్వ వైఫల్యం వల్ల సీఎం రేవంత్ రెడ్డి చేతగాని పాలన వల్ల సంపద పూర్తిగా కుంటు పడిందన్నారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి, అంసెబ్లీలో 2025 మార్చి 31లోగా రైతులకు రైతు భరోసా అందజేస్తానని చెప్పి.. అటు దేవుళ్లను ఇటు అసెంబ్లీ.. మరోవైపు ప్రజలను మోసగించాడని మండిపడ్డారు. సమ్మక్క - సారమ్మ ఎత్తిపోతల ప్రాజెక్టులో కావలసినంత నీరు సమృద్ధిగా ఉన్నా చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల పంపులను 45 రోజులు ఆలస్యంగా మోటార్లను ప్రారంభించడంతో సాగు నీరు సకాలంలో పంటలకు అందక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని మండిపడ్డారు. దేవాదుల మోటార్లు ఆన్‌చేస్తే వచ్చే రూ.ఆరేడు కోట్ల నిర్వహణ ఖర్చు కోసం ఆరేడు వందల కోట్ల విలువైన పంటలను ఎండబెట్టారని మండిపడ్డారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో నీళ్లుండి పంటలు ఎండ బెట్టిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. బీఆర్ఎస్ పాలనలో 30 శాతానికి పైగానే నీటిని వాడుకున్నామన్నారు. కాంగ్రెస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున రజతోత్సవ సభకు తరలి రావడానికి సిద్ధమయ్యారు. ఎడ్లబండ్లు, సైకిళ్లు, పాదయాత్రలు, సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా సభకు బయలుదేరుతున్నారన్నారు. పార్టీ పరంగా తరలించే జనం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల నష్టపోయిన యువత, రైతులు, వృద్ధులు, మహిళలు, యువతులు స్వచ్ఛంద సభకు తరలి వస్తున్నారన్నారు. రజతోత్సవ సభ ఏర్పాట్లను చూసే కాంగ్రెస్ నాయకులకు భయం పుట్టిందన్నారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలను సభకు రాకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, స్వీయ క్రమశిక్షణతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రజలను సభకు చేర్చాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పోలీసుల్లా డ్యూటీ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, చింతం సదానందం, నగేష్, ఎల్వూరి స్వామి, కడారి రాజు, శాలిని మహేందర్, బోయినపెల్లి యశోద రాజేశ్వర్‌రావు, కోరే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహిస్తున్నామని, ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా జనసమీకరణ చేస్తున్నామని ఎమ్మెల్సీ, సభ ఏర్పాట్ల ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరు గుతున్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలొస్తున్నారని, అందుకు సూర్యా పేట, ఇతరప్రాంతాల నుంచి ఎడ్లబండ్లలో, ర్యాలీలుగా జాత రకు వచ్చినట్లుగా తరలిరావడమే నిదర్శనమన్నారు.

ఉద్యమానికి వెన్నంటి ఉన్న ఓరుగల్లు వేదికగా..

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూది.. వెన్నంటి ఉన్న ఓరుగల్లు వేదికగా సభ నిర్వహిసున్నామని, గతంలో వరంగల్‌లో జరిగిన అనేక సభలు సక్సెస్ అయ్యాయని గుర్తుచేశారు. అందుకే వరంగల్ అంటే కేసీఆర్‌కు ఓ సెంటిమెంట్ అని.. 2010 డిసెంబరు 16న ప్రకాష్‌రెడ్డిపేటలో నిర్వహించిన సభ దేశంలోనే అతిపెద్ద సభగా రికార్డుకెక్కిందన్నారు. ఆ సభకు దీటుగా రజతోత్సవ సభను కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. 14ఏళ్లు అన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమాలు, పోరాటాలు చేసి తెలంగాణను సాధించుకున్నామని, పదేళ్లు అధికార పార్టీగా, 16నెలలు ప్రతిపక్షంగా.. ప్రజలు ఎలా కోరుకుంటే అలా పని చేస్తున్నామన్నారు. అలాంటి పార్టీ 25ఏట అడుగు పెడుతున్న వేళ రాష్ట్ర ప్రజలు, 60లక్షల గులాబీ సైన్యం పండుగ జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఎల్కతుర్తి వద్ద 1,250 ఎకరాల్లో ఏర్పాట్లు చేశామని, 169ఎకరాల్లో సభ ప్రాంగణం ఉంటుందన్నారు. వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల వైపు నుంచి వచ్చే వారి కోసం వరంగల్- ఎల్కతుర్తి హైవేకు సమీపంలో 600ఎకరాల్లో, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వచ్చే వారి కోసం కరీంనగర్- ఎల్కతుర్తి హైవే దగ్గర 200ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మెదక్, నిజామాబాద్, రంగారెడ్డిలోని కొంత భాగం నుంచి వచ్చే వాహనాల కోసం సిద్ధిపేట- ఎల్కతుర్తి హైవేకు సమీపంలో 200ఎకరాల్లో పార్కింగ్ ఇచ్చామన్నారు. ఇక మజ్జిగ, వాటర్ బాటిళ్లను అందుబాటులో ఉంచామని, మహిళలు, పురుషులకు వేర్వేరుగా 1100 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. 2వేల మంది గులాబీ వలంటీర్లు పర్యవేక్షిస్తారని, 12చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సిబ్బందితో పాటు 12మంది వైద్యులు, 10అంబులెన్సులు, 200సీసీ కెమెరాలు, 23 ఎల్ఈడీ భారీ స్ర్కీన్లు, 25టోయింగ్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు.

జాతరకొచ్చినట్టు వస్తున్నారు..

రజతోత్సవ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా జనాన్ని సమీకరించేలా ప్రణాళిక చేసుకున్నామని, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మిగిలిన జిల్లాలు, ప్రాంతాల నుంచి కూడా లక్షలాదిగా జనం తరలి వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే మేడారం జాతరకు వచ్చినట్లుగా ఎడ్లబండ్లు, ప్రభ బండ్లు, పాదయాత్రలతో ప్రజలు బయలుదేరటం కేసీఆర్‌పై ప్రేమ చెక్కుచెదరలేదనటానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సభలో కేసీఆర్ ప్రసంగం కోసం యావత్తుదేశం ఎదురుచూస్తోందని, ఆయనే మళ్లీ సీఎం కావాలన్న అకాంక్ష ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఇప్పటికే ఏ సమస్య వచ్చిన ప్రజలు తెలంగాణ భవన్ తలుపులు తడుతున్నారని, వరంగల్ సభ ప్రజల గుండెల్లోని ఉద్యమ జ్ఞాపకాలకు వేదిక కాబోతుందని అభివర్ణించారు. ఇక టీఆర్ఎస్, బీఆర్ఎస్ వేర్వేరు కాదని, తెలంగాణ ప్రజల గుండె చప్పుడైన టీఆర్ఎస్‌ది ఒకే జెండా.. ఒకటే అజెండా అని స్పష్టం చేశారు. పేరులో అక్షరమే మారింది కానీ, అదే కారు గుర్తు... అధ్యక్షుడు కేసీఆరేనని, ప్రజలకు ఈ విషయంలో స్పష్టత ఉందన్నారు. కానీ, కాంగ్రెస్ నేతలు అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. పాతికేళ్ల గులాబీ జెండా పండుగ.. తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ పండుగన్నారు. ఇందులో ఎవరికీ ఎలాంటి కన్‌ఫ్యూజన్ అవసరం లేదన్నారు.



కాంగ్రెస్ మోసగించిందని గుర్తించారు..

గతంలో, ఇప్పుడు కాంగ్రెస్‌ను నమ్మి తాము మోసపోయామని ప్రజలు గుర్తించారని, బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే, ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదన్న ఆవేదన వారిలో ఉందని ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అందుకే కేసీఆర్‌ను చూడాలని, ఆయన ప్రసంగం వినాలనే ఆసక్తి వారిలో పెరిగిందని, సభకు స్వచ్ఛందంగా వచ్చేందుకు వారే ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు.

చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభ

- ప్రజలే స్వచ్ఛందంగా సభకు తరలొస్తున్నారు
- మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారు
- టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌ది ఒకటే జెండా.. ఒకటే అజెండా
- అదే కారు గుర్తు.. కేసీఆరే అధ్యక్షుడు
- వరంగల్ సభతో రాష్ట్ర రాజకీయాల్లో సంచలన మార్పులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్సీ, సభ ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

టీడీపీ, బీఆర్ఎస్‌లే నిలబడ్డాయి..

ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చినా.. కొన్నాళ్లకే కనుమరుగయ్యాయని, కానీ పాతికేళ్లపాటు ప్రజల మద్దతుతో నిలిచిన పార్టీలు రెండే ఉన్నాయన్నారు. వాటిలో ఒకటి ఎన్‌టీఆర్ స్థాపించిన టీడీపీ అయితే.. మరొకటి కేసీఆర్ ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందని, అన్ని పార్టీలు రాజకీయాలు, కులాలు, ఇతర వాదాలతో ఏర్పడితే.. బీఆర్ఎస్ మాత్రం ఉద్యమం కోసం పురుడు పోసుకుందని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం సాధించడమే ఎజెండాగా ఆవిర్భవి

ఏడాదంతా ఉత్సవాలు

రజతోత్సవ సభ తరువాత రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని, బీఆర్ఎస్‌కు గెలుపోటములు కొత్తకాదని, 24ఏళ్లలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిందన్నారు. ఇక ఈ ఏడాదంతా ఉత్సవాలు నిర్వహిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంతో పాటు వివిధ దేశాలు, ప్రాంతాల్లో కూడా బీఆర్ఎస్‌కు అభిమానులు, కార్యకర్తలున్నారని, వారు కూడా ఆయా ప్రాంతాల్లో ఈ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా కూడా ఉత్సవాలు నిర్వహించేలా అధిష్ఠానం కార్యచరణ రూపొందిస్తోందని పోచంపల్లి వివరించారు.

రామప్పను సందర్శించిన మిస్ ఇండియా

వెంకటాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని 2023 మిస్ ఇండియా విజేత నందిని గుప్తా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం నందినిగుప్తా రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ నేతృత్వంలో టూరిజం గైడ్లు ఆమెకు రామప్ప ఆలయ చరిత్ర, రామప్పలోని మదనిక సాలబంజికల చరిత్రను వివరించారు. అద్భుత నిర్మాణ రీతులు, అపురూప శిల్పా సంపదకు నెలవైనా రామప్ప ఆలయం జగద్విఖ్యాతం, కాకతీయుల నిర్మాణాల్లో తలమానికం. రాళ్లను కరిగించి పోతపోసి మలిచిన శిల్పాలను ఆమె ఆసక్తిగా తిలకించారు. అయితే మే 7 నుంచి 31 వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరనుండగా.. ఈ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాల సుందరీమణులకు రాష్ట్రంలోని పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలను చూపేలా ప్రభుత్వం కార్యాచరణ చేసింది. అందులో భాగంగా మే 14న సుందరీమణులు రామప్పకు రానున్నారు. కానీ ముందుగానే రాజస్థాన్‌కు చెందిన మిస్‌ఇండియా రామప్పను సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రత్యేక పూజలు చేసిన నందినిగుప్తా


రామప్ప సన్నిధిలో మిస్ ఇండియా నందినిగుప్తా

సమ్మర్ క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్ కోచింగ్ క్యాంపుల నిర్వహణలో భాగంగా క్రీడల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం కమి షనర్ బల్దియా కార్యాలయం సమీపంలో నిర్మాణం జరుగుతున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. మే 1 నుంచి 31 వరకు నిర్వహించే స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపులలో క్రీడాకారులకు కావలసిన అన్ని రకాల మౌళిక సదుపాయాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రవి కుమార్, మాధవీలత, కార్తీక్‌రెడ్డి, రాజ్‌కుమార్, ఏఈ రాగుల శ్రీనివాస్, స్టేడియం సిబ్బంది భరత్, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనుల వివరాలను తెలుసుకుంటున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఉగ్రదాడిని నిరసిస్తూ సైక్లిస్టుల ర్యాలీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నిరసిస్తూ ట్రైసిటీ రైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి భద్రకాళి ఆలయం వరకు సైక్లిస్టులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఏఆర్ అడ్మిన్ ఏసీపీ అంతయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపి, ట్రైసిటీ రైడర్స్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జయరాజు, విద్యాసాగర్, ఏజే పెడల్స్ అధినేత జయంత్, డాక్టర్ ప్రదీప్, సదాశివారెడ్డి, ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, కేఎంసీ విద్యార్థులు పాల్గొన్నారు.


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ అంతయ్య

చాంబర్‌లలో వసతులు పునరుద్ధరించండి

▸▸ బల్దియా కమిషనర్ అశ్విని తానాజి వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో దెబ్బతిన్న చాంబర్‌లను గుర్తించి అక్కడి పనులను పుణరుద్ధరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో దెబ్బతిన్న చాంబర్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. చాంబర్‌లో దెబ్బతిన్న మరుగుదొడ్లు, నీటి సరఫరాల పనులు చేపట్టడంతో పాటు కుర్చీలు, టేబు ళ్లను కొత్తవి కొనుగోలు చేసి సిబ్బందికి సమకూర్చాలని అన్నారు. సిబ్బందికి కావలసిన కంప్యూటర్లను అందుబాటులోకి తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్, డీఈలు రవికుమార్, కార్తీక్‌రెడ్డి, ఏజేవో సరిత, జగదీశ్వరి, సూపరింటెండెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలి

▸▸ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో వివిధ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులలో పురోగతి కనిపించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. డివిజన్లలో జరుగుతున్న పనులను సంబంధిత ఏఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనుల నాణ్యతను పరిశీలించాలన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, శ్రీనివాస్, మాధవీలత, డీఈలు కార్తీక్‌రెడ్డి, సారంగం, రాజ్‌కుమార్, రంగారావు, కృష్ణమూర్తి, ఏఈలు పాల్గొన్నారు.


ఓఆర్ఆర్ నుంచి ఎడ్లబండ్లతో బయలుదేరిన దయాకర్‌రావు

పెగడపెల్లి నుంచి ఎడ్లబండ్లతో సభకు..

- ర్యాలీని ప్రారంభించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ నుంచి శనివారం ఎడ్లబండ్లతో భారీగా బయలుదేరారు. పెగడపెల్లి, గుండ్లసింగారం, ముచ్చెర్ల, నాగారం, పలివెల్పుల, సీతనాగారం నుంచి సుమారు వంద ఎడ్లబండ్లు ఓఆర్ఆర్ మీదుగా ఎర్రగట్టుగుట్ట వరకు చేరుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరై ఎండ్లబండ్ల ర్యాలీని ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు గుండు అశోక్‌యాదవ్, నన్నెబోయిన కుమార్ యాదవ్, రఘు, శ్రీధర్‌తో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫార్మసిస్టులు ఇకపై ఫార్మసీ ఆఫీసర్స్

- హర్షం వ్యక్తం చేసిన యూనియన్ నాయకులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఫార్మసిస్టుల హోదాను ఫార్మసీ ఆఫీసర్స్‌గా మారుస్తూ ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి జీవో నెంబర్ 71ను జారీ చేసింది. వైద్య విద్య, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న ఫార్మసిస్టులు గ్రేడ్-2లను ఫార్మసీ ఆఫీసర్స్‌గా, ఫార్మసిస్టు గ్రేడ్-1 లను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్‌గా, ఫార్మసీ సూపర్ వైజర్లను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్లుగా మార్పు చేస్తూ జీవో జారీ చేసింది. తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు ఉప్పు భాస్కర్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శరత్‌బాబు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, వైద్య ఆరోగ్య ఆరోగ్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రారంభం

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆదర్శకాలనీలో ఆదర్శ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను శనివారం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.అపర్ణదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్‌లో మొదటి మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం దీనికి కాలనీవాసులు సహకరించడం అభినందనీయమన్నారు. సమాజంలోని వ్యక్తులు, సమూహాల మధ్య ఏర్పడే వివాదాలను కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుతంగా పరిష్కంచుకోగలిగే సత్ఫలితాలు వస్తాయన్నారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టంకు చట్టబద్ధత కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ న్యాయసేవాధికారి సంస్థ సెక్రటరీ క్షమాదేశ్ పాండే, వరంగల్ సంస్థ సెక్రటరీ సాయి కుమార్, కాలనీవాసులు విద్యాసాగర్‌రెడ్డి, పరికిపండ్ల వేణు, నరసింహస్వామి, పి.శ్రీను, కుమారస్వామి పాల్గొన్నారు.

'పింగిళి'కి డీసీసీ అధ్యక్షుడి పదవి ఇవ్వాలి

- ఎర్రగట్టు దేవస్థానంలో కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డికి హనుమకొండ డీసీసీ అధ్యక్షుడి పదవి ఇవ్వాలని కోరుతూ శనివారం ఎర్రగట్టుగుట్ట దేవస్థానంలో కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ తోకల లక్ష్మారెడ్డి, దేవస్థానం చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లు జోరుక పూల, పుల్ల రవీందర్, దేవస్థానం మాజీ చైర్మన్ జన్ను రవిందర్, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు బత్తుల స్వాతి, మాజీ ఉపసర్పంచ్‌లు భగత్, రాజు, సురేందర్, సునీల్, బల్సుకూరిశ్రీనివాస్, వీసం సురెందర్‌రెడ్డి, కనపర్తి రాజు, రమేష్, ప్రభాకర్, చరణ్‌తేజ పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను మెస్, హాస్టల్స్‌కు సెలవులు ప్రకటించి ఇబ్బందులకు గురిచేయవద్దని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కేయూ పాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. వర్సిటీలో అడ్మిషన్లు పొంది పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు సెలవులు ఇవ్వద్దని పేర్కొన్నారు. సెలవుల్లో ఇండ్లలోకి వెళితే విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. నేతలు మాతంగి వినయ్, కొమ్ము మధు, మేకల పీటర్, ఇప్ప భరత్, ఉదయ్ పాల్గొన్నారు.

కర్రెగుట్టల్లో మారణహోమాన్ని నిలిపివేయాలి

▸▸ కేంద్ర బలగాలను వెనక్కి రప్పించాలి

▸▸ పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత, ప్రొఫెసర్ హరగోపాల్

వడ్డెపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టల్లో పారామిలటరీ దళాలు జరుపుతున్న మారణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని, కాల్పులను వెంటనే విరమించుకోవాలని, మధ్య భారతంలో ఆదివాసీల హననాన్ని ఆపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత, ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న పోరాటంలో అమాయక ఆదివాసీలే బలి అవుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని, కేంద్ర బలగాలను వెనక్కు రప్పించాలని హరగోపాల్ అన్నారు. కేంద్ర బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ఆదివాసీ మహిళలు, పిల్లలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం, హింస లేకుండా సమస్యను పరిష్కరించుకోవాలని, పౌరుల ప్రాణాలకు విలువ లేకుండా చేయడం అనాగరికమని స్పష్టం చేశారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమంటున్నారు, ప్రభుత్వాలు సైతం చర్చలు జరుపాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు.ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టల ప్రాంతంలో జరుగుతున్న మారణ హోమాన్ని నిలువరించాలని పేర్కొన్నారు.

ఆదివాసీ ప్రజలు భయానక వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ మగ్గుతున్నారని చెప్పారు. మావోయిస్టు పార్టీ లేఖలు రాసినప్పటికీ కర్రెగుట్టలను వేలాది మంది పోలీసు బలగాలతో ముట్టడించడం సరికాదని చెప్పారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులపై కాల్పుల విరమణ పాటించాలని అన్నారు. భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ గోపీనాథ్ మాట్లాడుతూ ఆదివాసీలతో భారత ప్రభుత్వం అంతర్ యుద్ధం చేస్తుందని పేర్కొన్నారు.

భారత్ బచావో నేత గాదె ఇన్నయ్య మాట్లాడుతూ భారత ప్రజలను భారత ప్రభుత్వ సైన్యాలే చంపడం మంచి పరిణామం కాదని గతంలో సైతం సుప్రీం కోర్టు వెల్లడించిందని చెప్పారు. కేయూ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ కేంద్రంతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష హననాన్ని దేశ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. విరసం రాష్ట్ర నేతలు నారాయణరావు, డాక్టర్ తిరుపతి, పాణి మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరుపాలని మేధావులు కోరుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు రమేష్‌చందర్, డాక్టర్ ఎం.వెంగళ్ రెడ్డి, డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, ఎస్.రామబ్రహ్మం, జనగాం కుమారస్వామి, చుంచు రాజేందర్, సాయిని నరేందర్, కోడం కుమారస్వామి, ఎండి.రాజ్‌మహ్మద్, దొమ్మాటి ప్రవీణ్‌కుమార్, నున్న అప్పారావు, మెట్టు రవీందర్, శాంత, రమ, మాదాసి సురేష్ పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పీఆర్టీయూ ప్రతీ సమస్యను పరిష్కరిస్తుంది

వరంగల్‌టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలను పీఆర్టీయూనే పరిష్కరిస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాషాపండితులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని కలిసి వారి సమస్యలను వివరించారు. అందుకు స్పందించిన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... బాషా పండితుల ప్రమోషన్ల విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రమోషన్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. మొదటి నుంచి పీఆర్టీయూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే పాటుపడుతుందన్నారు. ఎపదోన్నతులు రాక మిగిలిన పండిట్‌లందరికీ పదోన్నతు ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నగదు రహిత హెల్త్ కార్డులను ఉద్యోగులతో పాటు ప్రైవేటు ఉద్యోగులకు కూడా ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మందల తిరుపతిరెడ్డి, పలిత శ్రీహరి, నాయకులు అలీ, లక్ష్మీనారాయణ, నడికుడ ఎంఈవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

శనగలతో హనుమంతుడికి అలంకరణ

న్యూశాయంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పద్మాక్షి టెంపుల్ రోడ్డులో ఉన్న హనుమత్‌గిరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కొలువైన హనుమంతుడికి శనివారం ఆలయ అర్చకులు 51 కేజీల మార్వాడీ శనగలతో అలంకరించారు. అనంతరం అర్చకులు ఆరుట్ల రామాచారి స్వామివారికి చందన సేవ, అర్చనలు చేశారు. అలాగే 21రోజుల మాలధారణ భక్తులకు దుర్గాప్రసాద్ స్వామీజీ వారు మాలలు వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు భజన చేసి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షా సేవా సమితి అధ్యక్షులు గండె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కర్రు దశరథ్‌కుమార్, మాదాసు మొగులయ్య పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన కాజీపేట మండలం మడికొండలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా వెల్డింగ్ షాపు నడుపుకునే నంబి మోహన్ మరో వ్యక్తితో కలసి శనివారం సాయంత్రం బైక్‌పై ఎస్సీ కాలనీ వరకు వెళ్ళి తిరిగి వస్తున్నాడు. మడికొండ చౌరస్తా వైపు రావడానికి యూటర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని 108లో ఆస్పత్రికి తరలించారు.

రాంపేటలో చోరీ

మడికొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాళం పగులగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాల చోరీకి పాల్పడిన ఘటన కాజీపేట మండలం రాంపేటలో చోటుచేసుకుంది. మడికొండ ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రాంపేటకు చెందిన భార్యాభర్తలు పుల్యాల భవానీ-మహిపాల్‌రెడ్డి బొల్లికుంటలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి కళాశాలకు వెళ్ళారు. నర్సంపేటలోని వారి తాతకు అనారోగ్యంగా ఉందని తెలిసి కళాశాల నుంచే నర్సంపేటకు వెళ్ళారు. అదే రోజు తిరిగి ఇంటికి చేరుకునే సరికి అర్ధరాత్రి దాటింది. ఇంటికి వెళ్ళి చూడగా ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.80వేల విలువగల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. శనివారం బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫార్మసీలో ఫలక్‌నాజ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధకురాలు ఫలక్‌నాజ్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం సీడీసీ డైరెక్ట ర్ సాత్వికరెడ్డి, వైస్ చాన్సలర్ జి.దామోదర్, పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, డీన్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్, సీడీసీ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ శంకరయ్యలు ఫలక్‌నాజ్‌కుడాక్టరేట్ ప్రకటించారు. 'రోల్ ఆఫ్ బయోమార్కర్స్ ఇన్ ప్రీడియక్టింగ్ డయాబెటిస్ కంప్లికేషన్స్' అనే అంశంపై సీడీసీ కళాశాల ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ ప్రక టించారు. ప్రస్తుతం ఖమ్మంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఫలక్‌నాజ్‌ది వరంగల్ శంభునిపేట.

కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలి

▸▸ మే 20న సార్వత్రిక సమ్మెకు దిగుతాం

▸▸ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక విధానాలను ఐక్యంగా అడ్డుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం కేయూ కామర్స్ హాల్‌లో హనుమకొండ ఆల్ ట్రేడ్ యూనియన్స్ నేతృత్వంలో మే 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నేతృత్వంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్ పావని, బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఏఐసీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవిలు హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నాయని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్ల నిర్ణయాలతో కార్మికులకు బానిసత్వంలోకి నెట్టివేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సంక్షేమానికి కోత పెడుతూ కార్మికుల హక్కులను విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. హక్కుల రక్షణకు మే 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు దిగుతామని వెల్లడించారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సుకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, ఐఎన్టీయూసీ జిల్లా నాయకులు షైముదా, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, బీఆర్టీయూ జిల్లా నేతలు నాయిని రవి అధ్యక్షులుగా వ్యవరించారు. సదస్సులో మెట్టు రవి, బొట్ల చక్రపాణి, పల్లా అశోక్, పెండ్యాల రవి, బొల్లారం సంపత్, సీహెచ్. రాజేశ్వరి, కె.కల్పన, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సంతకం ఫోర్జరీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

హసన్‌పర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడి సంతకం ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీతంపేట ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు గుంపుల రణధీర్‌రెడ్డి శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను కలిసి ఫిర్యాదు చేశారు. సీతంపేట పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అధ్యక్షతన మొదటి దఫా ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సమావేశంలో 20 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి తీర్మానంపై కమిటీ సభ్యుల సంతకాలు చేయడం జరిగిందని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ కమిటీ సభ్యుడనైన తన సంతకం ఫోర్జరీ చేసి రెండో జాబితాలో 24 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఎంపీడీవోకు మరో జాబితా సమర్పించినట్లు తెలిపారు. రెండో జాబితాలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి తన సంతకం ఫోర్జరీ చేసిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకొని రెండో జాబితాను రద్దు చేసి మొదటి జాబితాలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌ను బాధితుడు రణదీర్‌రెడ్డి కోరారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే నాయిని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందచేస్తామని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల అంశంపై సమీక్ష జరిగింది. కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు ఇతర నాయకులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక, ఎంపికైన వారికి అందజేత తదితర అంశాలను రాజేందర్‌రెడ్డి సమీక్షించారు. సమావేశం ఆరంభానికి ముందుగా పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సమావేశంలో టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, బీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్‌తో పాటు మహ్మద్ అంకూశ్, అబూబాకర్, రాజాలీ, రహీమున్నీసా బేగం, గుంటి స్వప్న, బంక సంపత్ యాదవ్, అంబేద్కర్ రాజు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు పరిశోధనలు దోహదం చేయాలి

▸▸ కేయూ సోషల్ సైన్స్ రిటైర్డు డీన్ ప్రొఫెసర్ బలరాములు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన లక్ష్యంగా సామాజిక శాస్త్ర పరిశోధనలు ఉండాలని కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్, సోషల్ సైన్స్ డీన్ సీహెచ్.బలరాములు అన్నారు. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో హెడ్ పెదమళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన రీసెర్చ్ మెథడాలజీపై జరిగిన కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన ప్రొఫెసర్ బలరాములు రిపోర్టు రైటింగ్ అనే అంశంపై మాట్లాడారు. అన్ని సమస్యలకు మూల కారణం పేదరికమేనని చెప్పారు. పేదరికం చుట్టూ అన్ని రకాల సామాజిక సమస్యలు ముడిపడి ఉంటాయని తెలిపారు. సామాజిక శాస్త్రాల స్కాలర్స్ క్షేత్ర స్థాయిలో పరిశోధనలు చేసి మూల కారణాలను వెలికితీయాలని సూచించారు. సమస్యలకు సానుకూల పరిష్కార మార్గాలను అన్వేషించాలని అన్నారు. పరిశోధకులు క్రమపద్ధతిలో విషయాన్ని క్రోడీకరించాలని వివరించారు. ఈ కార్యశాలలో ప్రోగ్రాం కన్వీనర్, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, సీహెచ్. శ్రీను, బి. ఉమాశంకర్, ఓ.మోహన్, పరిశోధకులు పాల్గొన్నారు.


కార్యశాలలో మాట్లాడుతున్న బలరాములు

ప్రజా సమస్యలపై పోరాటమే కమ్యూనిస్టుల ఎజెండా

మడికొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పోరాటమే కమ్యూనిస్టుల ఎజెండా అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. కాజీపేట మండలం రాంపూర్‌లో శుక్రవారం పార్టీ నాయకులు మంద సుమన్ అధ్యక్షతన జరిగిన శాఖ మహా సభలో భిక్షపతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిత్యం పోరాటం చేస్తూ పేదప్రజల పక్షపాతిగా నిలుస్తోందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని గొప్పలు చెప్పుకొన్న నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా ధరలను నియంత్రించలేకపోవడం కాకుండా నిత్యావసర సరుకులు, వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. ప్రభుత్వం రాంపూర్‌లో గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, సహాయ కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, బొట్టు భిక్షపతి, మునిగాల అయిలయ్య, లక్ష్మి, పద్మ, స్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ బాలుర విజేత టీజీడబ్ల్యూఆర్‌జేసీ కాటారం

- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్‌హంట్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్‌హంట్ పోటీల్లో బాలుర విభాగంలో టీజీడబ్ల్యూఆర్‌జేసీ కాటారం, బాలికల విభాగంలో టీడబ్ల్యూఎంఎస్ఎస్‌జీ అసిఫాబాద్ జట్లు విజయకేతనం ఎగరవేశాయి. శనివారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల ముగింపు వేడుకలకు ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతగా నిలిచిన జటకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓరుగల్లు ఖిల్లా హ్యాండ్‌బాల్ క్రీడకు పెట్టింది పేరని అన్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ మాట్లాడుతూ..మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అండర్-15 బాలబాలికల హ్యాండ్‌బాల్ టాలెంట్‌హంట్ టోర్నీలో ఉమ్మడి పది జిల్లాల నుంచి 18బాలుర, 9బాలికల జట్లు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, కరీంనగర్, నల్గొండ, జిల్లాల కార్యదర్శులు బాసరవేణి లక్ష్మణ్, చింతకాయల పుల్లయ్య, పీడీలు జెట్టి రాజేశ్వర్, తాళ్ళ గ్రేసమ్మ, లక్ష్మీనారాయణ, ఖోఖో అసోసియేషన్ బాధ్యులు శ్యామ్, రెఫరీలు శ్రీనివాస్, వెంకటేశ్, అరుణ్‌కుమార్, కోచ్ నిమ్మల సుధీర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.


బాలుర విభాగంలో విజేతగా నిలిచిన టీజీడబ్ల్యూఆర్‌జేసీ కాటారం జట్టుకు ట్రోఫీని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తటస్థ విచారణకు సిద్ధం

» విశ్వసనీయ దర్యాప్తులో మేం పాలు పంచుకుంటాం

» పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్ర మారణకాండపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా స్పందించారు. ఈ ఘటనపై తటస్థ విచారణకు తాము సిద్ధమేనని తెలిపారు. విశ్వసనీయ దర్యాప్తులో పాలు పంచుకుంటామని చెప్పారు. శనివారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్-పఖ్తున్‌ఖ్వాలోని మిలిటరీ అకాడమీలో జరిగిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో షెహబాజ్ పాల్గొన్నారు. "పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మన దేశం మరోసారి నిందలు మోయాల్సి వచ్చింది. ఈ నిందలను శాశ్వతంగా అరికట్టాలి. బాధ్యతాయుతమైన దేశంగా మన పాత్రను కొనసాగించాలి. ఈ క్రమంలో ఎలాంటి తటస్థ, పారదర్శక, విశ్వసనీయ విచారణలోనైనా పాకిస్థాన్ పాలు పంచుకుంటుంది." అని షరీఫ్ తెలిపారు. అంతేకాదు.. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా దానిని తమ దేశం ఖండిస్తుందని చెప్పారు. అయితే, అదేసమయంలో దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి దుస్సాహసం జరిగినా.. పాకిస్థానీ సాయుధ దళాలు దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. "మన దేశ సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం" అని షరీఫ్ చెప్పారు. సింధు నది జలాలపై భారత్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ.. ఇది ఏకపక్ష నిర్ణయమన్నారు. ఇలాంటి నిర్ణయాలు తగవని చెప్పారు. వీటి వల్ల యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు.

287 మంది పాక్‌కు.. 191 మంది భారత్‌కు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్‌లోని పాక్ జాతీయులు 48 గంటల్లో దేశం వదిలి వెళ్లాలని కేంద్రం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 287 మంది పాక్ జాతీయులు దేశం వీడి వెళ్లారని అధికారులు తెలిపారు. అదేసమయంలో 191 మంది భారతీయ పౌరులు కూడా పాక్ నుంచి తిరిగి వచ్చారు. ఇక, పాక్ జాతీయులను వివాహం చేసుకున్న పలువురు మహిళలు.. అట్టారి-వాఘా సరిహద్దు దాటేందుకు ప్రయత్నించగా వారిని సరిహద్దు భద్రత అధికారులు అనుమతించలేదు. వీరికి భారత పాస్‌పోర్టులు ఉండడంతో.. సరిహద్దు దాటనివ్వలేదు. దీంతో ఆయా మహిళలు వారి కుటుంబాల్లోని పాక్ జాతీయత ఉన్న వ్యక్తులను మాత్రమే ఆ దేశానికి పంపించారు.

మీడియా సంయమనం పాటించాలి

» సైనిక కార్యకలాపాలపై ప్రత్యక్ష ప్రసారాలు వద్దు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాద దాడితో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో.. మీడియా సంస్థలు ప్రసారాల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా.. సైనిక కార్యకలాపాలకు సంబంధించిన వార్తలు ఇచ్చేటప్పుడు చట్టాలు, నిబంధనలు పాటించాలని పేర్కొంది. విశ్వసనీయ వర్గాల సమాచారం పేరుతో వివరాలు వెల్లడించరాదని, భద్రతా దళాల కదలికలపై ప్రత్యక్ష ప్రసారాలు చేయవద్దని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ.. మీడియా సంస్థలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. సున్నితమైన సమాచారాన్ని ముందుగానే వెల్లడించడం వల్ల శత్రువర్గాలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుందని, సిబ్బంది భద్రతకు, ఆపరేషన్ల సమర్థతకు ముప్పు వాటిల్లవచ్చని పేర్కొంది. కార్గిల్ యుద్ధం, ముంబయిలో ఉగ్రదాడులు, కాందహార్ హైజాకింగ్ వంటి ఘటనలు జరిగినప్పుడు ఎటువంటి ఆంక్షలు లేకుండా సమాచారాన్ని ప్రసారం చేయడం వల్ల జాతీయ ప్రయోజనాలకు నష్టం వాటిల్లిందని గుర్తు చేసింది.

ముంబైలో 5వేల మంది పాకిస్థానీలు



గుజరాత్ పోలీసుల అదుపులో బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు

ముంబై, ఏప్రిల్ 26: మహారాష్ట్రలో 5వేల మంది పాకిస్థానీలు ఉన్నారని, వీరిలో 1,000 మంది స్వల్పకాలిక వీసాలు కలిగి ఉన్నట్టు ఆ రాష్ట్ర మంత్రి యోగేష్ కదమ్ శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారందరినీ దేశం విడిచివెళ్లాలని చెప్పామన్నారు. దేశంలో కొంత మంది 8-10 ఏళ్లుగా నివసిస్తున్నారని, కొందరు పెళ్లి కూడా చేసుకున్నారని చెప్పారు. కొందరు తమ పాకిస్థాన్ పాస్‌పోర్టును సరెండర్ చేసి భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 21మంది పాకిస్థానీలు ఉన్నట్లు గుర్తించారు. వారిని వెంటనే పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు, గుజరాత్ పోలీసులు చేపట్టిన భారీ ఆపరేషన్‌లో భాగంగా వెయ్యి మందికి పైగా బంగ్లాదేశ్‌కు చెందిన అక్రమ వలసదారులను అహ్మదాబాద్, సూరత్‌లో అదుపులోకి తీసుకున్నట్టు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి హర్ష్ సంఘవి శనివారం తెలిపారు. వీరిలో పిల్లలు, మహిళలు కూడా ఉన్నట్టు తెలిపారు. వీరందరినీ దేశం నుంచి పంపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గుజరాత్ పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

భారత్-పాక్‌లది వెయ్యేళ్ల పోరాటం..
1,500 ఏళ్లుగా సరిహద్దు సమస్య!

» పహల్గాం ఉగ్రదాడి దారుణం: ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: భారత్, పాకిస్థాన్ దేశాలు కశ్మీర్ కోసం వెయ్యేళ్లుగా పోరాడుతున్నాయని, 1,500 ఏళ్లుగా రెండు దేశాల మధ్య సరిహద్దు సమస్య ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రమైన వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు తమంతట తామే ఏదో ఒకలా పరిష్కరించుకుంటాయని పేర్కొన్నారు. పోప్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వాటికన్ సిటీకి ప్రయాణిస్తున్న సమయంలో.. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల అంశాన్ని మీడియా ప్రస్తావించగా.. "నేను భారత్‌కు చాలా దగ్గర, పాకిస్థాన్‌కు కూడా చాలా దగ్గరివాడిని. కశ్మీర్‌లో ఆ రెండు దేశాలు వెయ్యి ఏళ్లుగా పోరాడుతున్నాయి. ఆ ఉగ్రవాద దాడి చాలా దారుణం. రెండు దేశాల మధ్య బహుశా 1,500 ఏళ్లుగా సరిహద్దుల సమస్య కొనసాగుతోందనుకుంటా" అని ట్రంప్ బదులిచ్చారు. అఖండ భారతం నుంచి పాకిస్థాన్ విడిపోయి 75 ఏళ్లే అవుతోందని, వెయ్యేళ్లు అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అర్థం లేనివని సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి.

నీట్‌పై అనుమానాస్పద అంశాలను..
తెలియజేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 : వైద్య విద్య ప్రవేశ పరీక్ష(నీట్)కు సంబంధించి అనుమానాస్పద అంశాలను తెలియజేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌లను ఏర్పాటు చేసినట్లు జాతీయ పరీక్ష ఏజెన్సీ(ఎన్టీఏ) అధికారులు తెలిపారు. ఈ పరీక్ష రాసే అభ్యర్థులు తప్పుదోవ పట్టించే వ్యక్తుల మాటలు నమ్మవద్దని వారు సూచించారు. గత ఏడాది నీట్‌లో అక్రమాలు, లీకులు చోటు చేసుకున్నాయని పలు ఆరోపణలు రావడంతో ముందు జాగ్రత్తగా ఎన్టీయే ఈ చర్య తీసుకుంది. నీట్ అభ్యర్థులు తమ దృష్టికి వచ్చిన అనుమానాస్పద అంశాలను https://nta.ac.in, https://neet.nta.ac.in అనే వెబ్‌సైట్ల ద్వారా తెలియజేయవచ్చు. సోషల్ మీడియా ఖాతాల ద్వారా లేదా అనధికారిక వెబ్‌సైట్ల ద్వారా నీట్ ప్రశ్నపత్రం అందిస్తామనే వారు లేదా ఈ పరీక్ష వివరాలు చెబుతామనే వారి వివరాలు తెలియజేయవచ్చు.

సరిహద్దు.. ఉద్రిక్తం!

కాల్పుల విరమణను ఉల్లంఘిస్తున్న పాక్

» హెచ్చరికలు లేకుండానే కాల్పులు

» దీటుగా బదులిస్తున్న భారత సైన్యం



కుల్గాంలో భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలతో భారత్- పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించి విచ్చలవిడిగా కాల్పులకు తెగబడుతుండటం, ప్రతిగా కాల్పులతో భారత దళాలు దీటుగా సమాధానం ఇస్తుండటంతో.. ఎప్పుడేం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. సరిహద్దులకు సమీపంలోని గ్రామాల ప్రజలు ముందు జాగ్రత్త చర్యగా బంకర్లలోకి వెళ్లి తలదాచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు ఉగ్రవాదుల జాడ కోసం భద్రతా బలగాలు వివిధ ప్రాంతాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత కొనసాగుతోంది.

విచ్చలవిడిగా పాక్ సైన్యం కాల్పులు..

పాక్ సైన్యం నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) పొడవునా ఉన్న ఔట్‌పోస్టుల నుంచి ఎలాంటి హెచ్చరికలూ లేకుండానే.. కాల్పులు జరుపుతోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. పహల్‌గామ్ ఘటన తర్వాత ఈ నెల 24న రాత్రి తొలిసారిగా పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించిందని.. తర్వాత అడపాదడపా కాల్పులు జరుపుతూనే ఉందని, శుక్రవారం రాత్రంతా కూడా ఇది కొనసాగిందని తెలిపాయి. పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించిన సమయంలో.. తలదాచుకునేందుకు భారత ప్రభుత్వం సరిహద్దు గ్రామాల్లో 18 వేలకుపైగా వ్యక్తిగత, సామూహిక బంకర్లను నిర్మించింది. కొన్నేళ్లుగా సరిహద్దుల వెంట కాల్పుల ఘటనలు లేకపోవడంతో వాటిని వినియోగించలేదు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, పాక్ దళాల కాల్పుల నేపథ్యంలో... ఆ బంకర్లను శుభ్రం చేసి, తలదాచుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. "ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందుకే అండర్‌గ్రౌండ్ బంకర్లను సిద్ధం చేసి పెట్టుకుంటున్నాం. మా గ్రామంలో గోధుమ పండిస్తున్నాం. దిగుబడి రావడానికి ఇంకా కొన్ని రోజులు పడుతుంది. అయినా ముందే పంట కోతలు చేపడుతున్నారు. మగవాళ్లంతా ఆ పనుల్లో ఉంటే.. ఆడవాళ్లంతా బంకర్లను శుభ్రం చేసే పనుల్లో ఉన్నారు" అని ఆర్ఎస్ పుర సెక్టార్‌లోని ట్రివా గ్రామ మాజీ సర్పంచ్ బల్బీర్ చెప్పారు.

మరో ముగ్గురు ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత

ఉగ్రవాద నిర్మూలన దిశగా కీలక చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేతను కొనసాగిస్తోంది. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఆసిఫ్ షేక్, ఆదిల్ తోకర్‌ల ఇళ్లను శుక్రవారం పేల్చేసిన భద్రతా బలగాలు.. శనివారం మరో ముగ్గురు ఉగ్రవాదులు అహ్సాన్ షేక్, షాహిద్ కుట్టే, జాహిద్ అహ్మద్‌ల ఇళ్లను కూల్చేశాయి. ఇందులో పుల్వామాకు చెందిన లష్కరే తాయిబా ఉగ్రవాది అహ్సాన్‌కు పహల్గాం దాడితో సంబంధం ఉన్నట్టు గుర్తించారు. ఇక, షోపియాన్ ప్రాంతానికి చెందిన షాహిద్, కుల్గాంకు చెందిన జాహిద్ ఇద్దరూ గత మూడు, నాలుగేళ్లుగా దేశద్రోహ చర్యల్లో పాలుపంచుకుంటున్నట్టు తేల్చారు. దీనిపై జమ్మూకశ్మీర్ సీనియర్ అధికారి ఒకరు స్పందిస్తూ.. "స్థానికులు పాక్ ఉగ్రవాదులకు సాయం చేయడం, ఉగ్రవాదులుగా మారడాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టక తప్పడం లేదు. ఉగ్రవాదులుగా మారిన వారి కుటుంబాలు కూడా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలేవీ అందవని స్థానిక యువతకు స్పష్టం చేస్తున్నాం. ఇళ్ల కూల్చివేత కూడా ఆ దిశగా ఇస్తున్న సంకేతాలే.." అని పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉండగా, పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను వేటాడేందుకు భద్రతా బలగాలు జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా అడుగడుగూ జల్లెడపడుతున్నాయి. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లా తొకర్‌పొర ప్రాంతంలో ఉగ్రవాదుల అనుచరులు ఇద్దరిని భద్రతా దళాలు గుర్తించి, అదుపులోకి తీసుకున్నాయి. మరోవైపు కుప్వారా జిల్లాలోని సెడోరి నల అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల ఆయుధాల డంప్‌ను పోలీసులు గుర్తించారు.

పహల్గాం కేసు ఎన్ఐఏ చేతికి..

పహల్గాం ఉగ్రదాడి కేసు అధికారికంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పరిధిలోకి వెళ్లింది. ఘటన జరిగిన వెంటనే జమ్మూకశ్మీర్ స్థానిక పోలీసులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఘటన వివరాలు, పూర్వాపరాలను సేకరించి కేసు డైరీని సిద్ధం చేశారు. తాజా వీటన్నింటినీ అధికారికంగా ఎన్ఐఏకు అప్పగించారు. నిజానికి దేశంలో ఉగ్రవాద కేసుల దర్యాప్తు ఎన్ఐఏ ఆధ్వర్యంలోనే సాగుతుంది. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కూడా ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. శనివారం ఒడిశాలోని ఇషాని గ్రామానికి చేరుకుని.. ఉగ్రదాడిలో మృతి చెందిన ప్రశాంత్ సత్పతి భార్య ప్రియదర్శిని నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. కోల్‌కతాకు చెందిన ఇద్దరు మృతుల కుటుంబ సభ్యులను కూడా కలసి వాంగ్మూలాలు నమోదు చేశారు.

గొంతు కోస్తాం!

పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ ఎదుట నిరసన తెలుపుతున్న భారతీయులకు పాక్ ఆర్మీ అధికారి చేసిన హెచ్చరిక సంజ్ఞ కలకలం రేపుతోంది. భారత సంతతివారితోపాటు ఇజ్రాయెలీలు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో పాక్ హైకమిషన్‌లో సైనిక, వైమానిక దళాల సలహాదారుగా ఉన్న కల్నల్ తైమూర్ రాహత్ బాల్కనీలోకి వచ్చారు. అభినందన్ చిత్రాన్ని పట్టుకుని రెచ్చగొట్టేలా వ్యవహరించారు. నిరసనకారులకు వేలు చూపిస్తూ..గొంతు కోస్తామన్నట్టుగా సంజ్ఞ చేశారు. అంతే కాదు నిరసనకారుల నినాదాలు వినిపించకుండా లౌడ్ స్పీకర్లు పెట్టి పాకిస్థాన్ దేశభక్తి గీతాలను ప్లే చేశారు.



మా నీళ్లు రాకపోతే..
వారి రక్తం ప్రవహిస్తుంది!

» పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో ప్రేలాపనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేయడంపై పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్నారు. నదిలో నీరు పారకపోతే వారి నెత్తురు ప్రవహిస్తుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధు నాగరికతకు తామే నిజమైన సంరక్షకులమని ప్రకటించుకున్నారు. శుక్రవారం ఆయన ఓ బహిరంగ సభలో మాట్లాడారు. 'సింధు నది మనది.. ఇకముందు కూడా మనదిగానే ఉంటుంది. దానిలో నీళ్లు ప్రవహిస్తాయి. లేకపోతే వారి రక్తం పారుతుంది' అన్నారు. ఈ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ తీవ్రంగా స్పందించారు. బిలావల్ ఒక మూర్ఖుడన్నారు.

పహల్గాం దాడి మా పని కాదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తమ పని కాదంటూ ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా(ఎల్ఈటీ) అనుబంధ సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్) బుకాయించింది. ఈ మేరకు జాతీయ మీడియా సంస్థలకు టెలిగ్రామ్ ద్వారా సందేశాలు పంపింది. తమ అధికారిక డిజిటల్ ప్లాట్‌ఫామ్ హ్యాకింగ్ గురైందని బుకాయిస్తూ.. భారతీయ నిఘా సంస్థలపై నెపాన్ని మోపింది. హ్యాకింగ్ ఉదంతంపై అంతర్గత ఆడిట్ చేస్తున్నామని, త్వరలో నిజాలను వెల్లడిస్తామని వివరించింది.

కశ్మీర్లో చురుగ్గా 14 మంది ఉగ్రవాదులు

శ్రీనగర్, ఏప్రిల్ 26: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అప్రమత్తమైన భద్రతాబలగాలు ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్నాయి. ఈ తరుణంలో జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం 14 మంది ఉగ్రవాదులు చురుగ్గా ఉన్నారని నిఘావర్గాలు గుర్తించాయి. వీరంతా 20 నుంచి 40 ఏళ్లలోపువారే. వీరంతా పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్థానిక కీలక సమాచారం ఇవ్వడంతో పాటు వారికి ఆశ్రయం కల్పించడం, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు.

చీనాబ్ నదీ జలాల విడుదల

» పాకిస్థాన్ ముజఫరాబాద్‌లో ఎమర్జెన్సీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా భారత్ శనివారం సాయంత్రం చీనాబ్ నది నుంచి నీటిని వదిలిందని పాకిస్థాన్ ఆరోపించింది. నదీ పరీవాహకాల్లో భారీ వరద వచ్చిందని పాకిస్థానీ పత్రిక 'డాన్' పేర్కొంది. సుమారు 22 వేల క్యూసెక్కుల నీటిని భారత్ వదిలిందని వివరించింది. కాగా.. 1960 నాటి సింధు నది ఒప్పందంలో భాగంగా నీటిని దిగువకు వదిలినప్పుడు పాకిస్థాన్‌కు భారత్ సమాచారం అందించాలి. తాజాగా భారత్ ఆ ఒప్పందాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే..!

నేను భారత్ కోడలిని..
ఇక్కడే ఉంటా!

» మోదీ, యోగికి సీమా హైదర్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: సీమా హైదర్ గుర్తుందా? పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌కు చెందిన ఈ వివాహిత, నోయిడాకు చెందిన సచిన్‌తో ప్రేమలో పడి.. తన నలుగురు చిన్నారులను వెంటబెట్టుకొని రెండేళ్ల క్రితం నేపాల్ మీదుగా భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించింది. అప్పట్లోనే సచిన్ మీనాను పెళ్లి చేసుకొని, అతడితో పాటే ఉంటోంది. పహల్గాం ఘటన నేపథ్యంలో పాకిస్థాన్ జాతీయులు దేశం వీడి వెళ్లాలంటూ కేంద్రం హుకుం జారీ చేయడంతో సీమా హైదర్ ఆందోళనలో పడింది. తాను సచిన్ మీనాను పెళ్లి చేసుకున్నాక హిందూ మతం స్వీకరించానని.. ఇప్పుడు తాను హిందువునని అంటోంది. తాను పాక్ బిడ్డనే అయినా ఇప్పుడు భారత్ కోడలినంటోంది. తనను పాక్‌కు పంపించొద్దని ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగికి విజ్ఞప్తి చేసింది.

'ఆ నరకానికి మళ్లీ వెళ్లం'

» హిందూ శరణార్థుల వేడుకోలు

జైసల్మేర్, ఏప్రిల్ 26 : ఇక్కడ చావడానికైనా సిద్ధమే.. కానీ నరకం లాంటి పాకిస్థాన్‌కు మాత్రం మళ్లీ వెళ్లం, దయ చూపండి.. భారతదేశంలో శరణార్థులుగా ఆశ్రయం పొందిన పాకిస్థాన్ హిందువులు ప్రభుత్వానికి చేసుకుంటున్న వేడుకోలు ఇది. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్ పౌరులంతా 27వ తేదీలోగా భారతదేశం వదిలి వెళ్లిపోవాలని భారత ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల శరణార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాకిస్థాన్‌లో వేధింపులు భరించలేక, ఉన్నదంతా అమ్ముకొని, అన్నీ వదులుకుని భారత్‌కు వచ్చామని, తిరిగి ఆ నరకానికి వెళ్లలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ముల్సాగర్ అనే గ్రామంలో స్వల్పకాలిక వీసా కలిగిన పాక్ హిందువులు వెయ్యి మందికిపైగా ఉన్నారు. ప్రధాని మోదీ, భారత ప్రభుత్వం తమపై దయ చూపాలని వారంతా వేడుకుంటున్నారు.

ఆ జంట పెళ్లికి సరి'హద్దు' గీత!

జైపూర్, ఏప్రిల్ 26: వధువు మెడలో వరుడు ఇక తాళి కడతాడనగా.. 'ఆగండి.. ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు' అంటూ శాసించే కంఠాన్ని ఎన్ని సినిమాల్లో వినలేదు!? అచ్చంగా ఇలానే.. భారత్-పాక్‌కు చెందిన వధూవరుల పెళ్లి వేడుకను పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన అనిశ్చితిలో పడేసింది. రాజస్థాన్‌లోని బర్మార్ జిల్లాకు చెందిన శైతాన్ సింగ్.. పాకిస్థాన్‌లోని అమర్ కోట్ యువతి కేసర్ కన్వర్ పెళ్లి ఈనెల 30న వధువు ఇంట జరగాల్సి ఉంది. మేళతాళాలతో వరుడు, ఆయన కుటుంబసభ్యులు గురువారం పాక్‌లో అడుగుపెట్టేందుకు బరాత్‌తో అటారీ సరిహద్దుకు వెళ్లారు. అంతకు ముందు రోజే కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో ఆ సరిహద్దును మూసివేశారు. వరుడి కుటుంబీకులు ప్రాధేయపడ్డా అవలివైపు వెళ్లేందుకు అధికారులు అనుమతివ్వలేదు.

కశ్మీర్ నుంచి తిరిగొచ్చిన
పర్యాటకులు

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న 116 మంది



శంషాబాద్‌రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం నుంచి మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, హైదరాబాద్, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు చెందిన 116 మంది పర్యాటకులు శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్వాగతం పలికారు. ఉగ్రదాడులను నిరసిస్తూ పర్యాటకులతో కలిసి విమానాశ్రయంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సమయంలో మెదక్ జిల్లాకు చెందిన కొందరు అక్కడికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నారు. ఈ విషయం మైనంపల్లికి తెలియజేయడంతో ఆయన తెలంగాణ సీఎస్, డీజీపీ, జమ్మూ కశ్మీర్ డీజీపీతో మాట్లాడారు. పర్యాటకుల వద్దకు బలగాలను పంపించి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రత్యేక విమానంలో ఢిల్లీకి, అక్కడ నుంచి శంషాబాద్‌కు తీసుకొచ్చారు. కపిల్ చిట్‌ఫండ్ సంస్థకు చెందిన ఏజెంట్లు ఏటా పర్యాటక ప్రదేశాలకు వెళతుంటారు. ఈసారి 116 మంది జమ్మూ కశ్మీర్‌కు వెళ్లారు. ఇది తమకు పునర్జన్మ అని, మైనంపల్లికి రుణపడి ఉంటామని పలువురు పర్యాటకులు చెప్పారు. ఉగ్రదాడికి జరిగినచోటుకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నామని మెదక్‌కు చెందిన రాములు అనే వ్యక్తి ఫోన్‌లో తనకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడానని మైనంపల్లి తెలిపారు. రాష్ట్రానికి చెందిన పర్యాటకులు క్షేమంగా తిరిగివచ్చేలా సహకరించిన జమ్మూ కశ్మీర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలు అరచేతిలో: రాములు, సిద్దిపేట

పహల్గాంలోని బైసరన్ లోయ అందాలు చూద్దామని బయలుదేరాం. అప్పటికే అక్కడ ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరుపుతున్నారనే సమాచారం రావడంతో దగ్గర్లోని ఓ హోటల్‌కు వెళ్లి తలదాచుకున్నాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపాం. వెంటనే హన్మంతన్నకు ఫోన్ చేశాం. కొద్దిగంటల్లోనే జవాన్లువచ్చి భారీ భద్రత మధ్య మమ్మల్ని ఒకహోటల్‌లో ఉంచారు. పరిస్థితి చక్కబడిన తర్వాత విమానంలో శ్రీనగర్‌కు, అక్కడి నుంచి ఢిల్లీకి తరలించారు. హన్మంతన్న చొరవ వల్ల సురక్షితంగా బయటపడ్డాం.

వస్తామనుకోలేదు: పద్మశ్రీ, సంగారెడ్డి

ఉగ్రవాదుల చేతిలో మేం కూడా ప్రాణాలు కోల్పోతామేమో అని భయం భయంగా గడిపాం. తిరిగి ఇంటికొస్తామని అనుకోలేదు. దేవుడి దయ వల్ల తిరిగి వచ్చాం. పహల్గాం వెళుతున్న మేము.. అక్కడ ఉగ్రదాడి విషయం తెలియడంతో ఆగిపోయి.. ఓ హోటల్‌లో ఉన్నాం. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, మైనంపల్లి హన్మంతరావు ఫోన్ చేసి మాకు ధైర్యం చెప్పారు. కొద్దిసేపటికే ఆర్మీ బలగాలు వచ్చి మాకు రక్షణ కల్పించాయి.


భార్య, కొడుకును చూసేందుకు వచ్చి..
హైదరాబాద్‌లో చిక్కిన పాకిస్థానీ!

హైదరాబాద్ సిటీ/మదీన, ఏప్రిల్ 26: భారత్‌లో ఉన్న పాకిస్థానీలు వెంటనే వారి స్వదేశానికి వెళ్లిపోవాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మహ్మద్ ఫయాజ్ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. ఫయాజ్ హైదరాబాద్‌లో ఉన్న భార్య, కొడుకును చూసేందుకు అక్రమ మార్గంలో హైదరాబాద్ వచ్చి చిక్కిన పాకిస్థానీ! అతన్ని 2023 ఆగస్టులో బహదూర్‌పురా పోలీసులు అరెస్టు చేశారు. అతను దుబాయ్‌లో పని చేస్తున్నప్పుడు అక్కడే ఉద్యోగం చేస్తున్న హైదరాబాద్ యువతి ఫాతిమాను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. గర్భవతి అయిన ఫాతిమా పుట్టింటికి హైదరాబాద్ వచ్చింది. ఆమెకు కొడుకు పుట్టాడు. ఫయాజ్ దుబాయ్‌లో కొంత కాలం ఉద్యోగం చేసి పాకిస్థాన్‌కు వెళ్లాడు. భార్య, కొడుకును చూడాలనుకున్న అతను హైదరాబాద్‌లోని అత్తమామల సూచనతో నేపాల్ మీదుగా భారత్ సరిహద్దు వరకు చేరుకున్నాడు. ఉత్తరప్రదేశ్ వెళ్లిన ఫయాజ్ అత్తమామలు.. అక్కడి మధ్యవర్తుల సాయంతో కొంత డబ్బు ఖర్చుపెట్టి అతన్ని సరిహద్దు దాటించారు. రహస్యంగా హైదరాబాద్‌కు తీసుకొచ్చి.. పది నెలలపాటు బయటకు రానివ్వకుండా ఇంట్లోనే ఉంచారు. నకిలీ జనన ధ్రువీకరణ పత్రం సంపాదించి, ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేశారు. ఈ క్రమంలో ఆ నోటా ఈ నోటా పడి ఫయాజ్ విషయం బహదూర్‌పురా పోలీసులకు చేరడంతో అతన్ని అరెస్టు చేశారు. అత్తమామలపైనా కేసు నమోదు చేశారు. కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. బెయిల్‌పై విడుదలైన ఫయాజ్ చిరు వ్యాపారం చేసుకుంటూ భార్య, కొడుకుని పోషించుకుంటున్నాడు. ప్రస్తుత తరుణంలో అతని కేసు ప్రాధాన్యత సంతరించుకుంది.

3డీ ప్రింటెడ్ మిలిటరీ బంకర్!

» స్వదేశీ సాంకేతికతతో హిమాలయాల్లో నిర్మించిన ఐఐటీహెచ్, సింప్లిఫోర్జ్ క్రియేషన్స్

» 11 వేల అడుగుల ఎత్తులో నిర్మాణం



కంది, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సముద్రమట్టానికి 11 వేల అడుగుల ఎత్తులో.. లఢక్‌లోని లేహ్‌లో.. కేవలం 14 గంటల్లో సైన్యం కోసం బంకర్‌ను నిర్మించారు. ఐఐటీ హైదరాబాద్, సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ అనే సంస్థ కలిసి 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో ఈ అద్భుతాన్ని సాకారం చేశాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో నిర్మించిన 3డీ నిర్మాణంగా ఇది గుర్తింపు పొందింది. భారత సైన్యం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్ట్ ప్రభల్‌లో భాగంగా.. సైనికుల వినియోగం కోసం దీనిని నిర్మించారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్ ప్రొఫెసర్ కేవీఎల్ సుబ్రమణ్యం మార్గదర్శకత్వంలో ఐఐటీహెచ్ బృందాలు, సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ సంస్థ ప్రతినిధులు.. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా పని చేసే ప్రత్యేక 3డీ ప్రింటింగ్ సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఐఐటీహెచ్ పీహెచ్‌డీ విద్యార్థి అరుణ్ కృష్ణన్ దీనికి సహకారం అందించారు. స్థానికంగా లభించే వనరులతోనే ఈ సాంకేతికత పని చేయటం విశేషం. ఈ టెక్నాలజీతోనే హిమాలయాల్లోని లేహ్‌లో సైనిక బంకర్‌ను నిర్మించారు. శనివారం దీనికి సంబంధించిన వివరాలను ప్రొఫెసర్ కేవీఎల్ సుబ్రహ్మణ్యం, సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ సీఈవో ధ్రువ్ గాంధీ వెల్లడించారు. లఢఖ్ వంటి ఎత్తైన ప్రదేశాల్లో ఆక్సిజన్ తక్కువగా ఉంటుందని, అలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఒక సవాల్‌గా తీసుకొని ప్రాజెక్టును విజయవంతం చేశామని ధ్రువ్‌గాంధీ తెలిపారు. రోబోటిక్ ప్రింటర్ వ్యవస్థను 24 గంటల్లో సిద్ధం చేసి, ఐదు రోజుల రికార్డు సమయంలో పూర్తి చేశామని.. ప్రింటింగ్‌కు 14 గంటలు పట్టిందని వెల్లడించారు. ఎత్తైన ప్రాంతాల్లో తక్కువ ఆక్సిజన్, తక్కువ ఆర్ద్రతతోపాటు ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయని.. అలాంటి పరిస్థితులను తట్టుకోవటానికి వీలుగా యంత్రాలను రూపొందించామని ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రత్యేకమైన కాంక్రీట్ మిశ్రమాన్ని తయారు చేసినట్లు వెల్లడించారు.









కార్తీక్ స్టైల్లో ఆకట్టుకుంటుంది

సూర్య

"రెట్రో' కార్తీక్ సుబ్బరాజ్ స్టైల్లో ఉండే సినిమా. ఆయన శైలి ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. మంచి సినిమాటిక్ అనుభూతినిస్తుందీ చిత్రం. ప్రేక్షకుల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది. ఇందులో చాలా మంది గొప్పవారితో కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి" అని హీరో సూర్య చెప్పారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన చిత్రం 'రెట్రో'. మే1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ప్రీరిలీజ్ వేడుక ఏర్పాటు చేశారు. సూర్య మాట్లాడుతూ 'నాపై మీరు చూపిస్తోన్న ప్రేమ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. సంతోష్‌నారాయణ్‌గారు అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఈ సినిమాకు తెలుగులో కాసర్ల శ్యామ్ హృదయానికి హత్తుకునే లిరిక్స్ ఇచ్చారు. 'రెట్రో'తో పాటు నా మిత్రుడు నాని నటించిన 'హిట్ 3' కూడా ఘనవిజయం సాధించాలి. చిరంజీవిగారి బ్లడ్ బ్యాంక్ స్ఫూర్తితోనే 'అగరం' ఫౌండేషన్ స్థాపించా. మీ ప్యాషన్‌ను వెతుక్కుంటూ వెళ్లండి. అదే మీకు దారి చూపుతుంది. నన్ను ఇన్నేళ్లుగా సపోర్ట్ చేస్తున్న అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు' అన్నారు. ముఖ్య అతిథి విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "సూర్య అన్న సినిమాలను నేను స్కూల్, కాలేజీ డేస్‌లో విపరీతంగా చూసేవాడ్ని. 'గజినీ' సినిమా చూశాక, ఆయన యాక్టింగ్‌తో ప్రేమలో పడిపోయా. ఆయనను కలవాలని చాలా సార్లు ప్రయత్నించాను. ఇప్పటికి కుదిరింది. ఈ సందర్భం నాకు చాలా ప్రత్యేకం. ఆయనలా ప్రయోగాత్మక పాత్రలు చేయాలంటే చాలా ధైర్యం కావాలి. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. 'అగరం' ఫౌండేషన్ ద్వారా ఆయన చేసే సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకం" అని అన్నారు. "ఈ సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులు ఇచ్చిన సూర్యగారికి కృతజ్ఞతలు. ఆయన హీరోగా నేను నిర్మిస్తోన్న సినిమా గురించే ఇప్పుడేమీ చెప్పను. అది ప్రేక్షకుల ఊహకే వదిలేస్తున్నాను" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు. "ఒక సినిమా కోసం ఓ యాక్టర్ ఎంతలా కష్టపడతాడో గజినీ' చూశాకే తెలిసింది. ఆయన చేసిన సినిమాలు జీవిత పాఠాలు" అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

మరోసారి జంటగా



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'శర్వా 38' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉందీ చిత్రం. త్వరలోనే షూటింగ్ మొదలుకానుంది. 1960ల కాలంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో శర్వా సరసన అనుపమ పరమేశ్వరన్ నటించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆమెను టీమ్ లోకి ఆహ్వానిస్తూ పోస్ట్ పెట్టారు. 1960ల కాలానికి తగ్గ దుస్తులను ధరించారు అనుపమ. ఈ పాన్ ఇండియా ప్రాజెక్టును కే.కే.రాధామోహన్ నిర్మిస్తున్నారు. సౌందర్‌రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. కాగా, శర్వా, అనుమప కలసి 2017లో విడుదలై ఘనవిజయం సాధించిన 'శతమానం భవతి' సినిమాలో నటించారు.

కొత్త లుక్‌లో...



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కాంత'. పీరియాడిక్ నేపథ్యంలో రూపొందుతోంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. సముద్రఖని ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'కాంత' చిత్రం నుంచి ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం పంచుకుంది. పోస్టర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న సముద్రఖని బ్యాక్‌సైడ్ లుక్‌ను చూపించారు. ఆయన భిన్నమైన ఆహార్యంతో తీక్షణంగా చూస్తూ కనిపించారు. ప్రస్తుతం 'కాంత' నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలో మేకర్స్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఝును చంతర్, సినిమాటోగ్రఫీ: డానీ శాంచెజ్ లోపెజ్

ప్రాధాన్యమున్న పాత్ర నాది

శ్రీనిధి శెట్టి

'నా క్యారెక్టర్ పేరు మృదుల. అర్జున్ సర్కార్ పాత్రకు భిన్నంగా ఉంటుంది. ఎంతో ప్రాధాన్యమున్న పాత్ర నాది. నిజానికి ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో హీరోయిన్ పాత్రకు అంత ప్రాధాన్యం ఉండదు. దర్శకుడు శైలేష్ కొలను చాలా తెలివైన రచయిత. మీరు 'హిట్, 'హిట్-2' సినిమాలు గమనిస్తే ఒక్కో సినిమాకి హీరోయిన్ క్యారెక్టరైజేషన్‌లో ప్రాధాన్యం పెరుగుతుంది' అని అన్నారు కథానాయిక శ్రీనిధి శెట్టి. నాని, శ్రీనిధి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీనిధి మీడియాతో మాట్లాడుతూ 'నానితో పనిచేయడం ఓ అద్భుతమైన అనుభవం. ఈ సినిమాలో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. ఓ కన్నడ అమ్మాయిలా కాకుండా తెలుగు అమ్మాయిలానే డబ్బింగ్ చెప్పా. దర్శకుడు సినిమాను చక్కగా తెరకెక్కించారు. మిక్కీ జే మేయర్ అద్భుతమైన సంగీతం అందించారు. మొదటి పాట ప్రేమ వెల్లువ సూపర్ హిట్ అయింది. అలాగే అనిరుధ్ పాడిన పాట కూడా ఆదరణ పొందుతోంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది' అని తెలిపారు.



సీత పాత్రను వద్దనలేదు

'రామాయణ్' చిత్రంలో సీత పాత్రలో నటించే అవకాశం వస్తే తిరస్కరించానని మీడియాలో తప్పుడు వార్తలు వస్తున్నాయి. నేను సీత క్యారెక్టర్ కోసం ఆడిషన్ ఇచ్చాను. ఆ తర్వాత మేకర్స్ నుంచి ఎలాంటి పిలుపు రాలేదు. అసలు అలాంటి క్యారెక్టర్‌ని రిజెక్ట్ చేసే యాక్టర్‌ని కాదు నేను. ఫైనల్‌గా ఆ పాత్రకు సాయి పల్లవిని ఎంపిక చేశారని మీడియా ద్వారానే తెలుసుకున్నాను.

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు



ఇంద్రారామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చౌర్య పాఠం'. దర్శకుడు త్రినాధరావు నక్కిన ఈ చిత్రంతో నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం 'గ్రాటిట్యూడ్ మీట్'ని శనివారం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో త్రినాధరావు నక్కిన మాట్లాడుతూ 'బుకింగ్స్ రోజు రోజుకూ పెరుగుతున్నాయి. మా సినిమాను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. తెరపై యాక్టర్స్ కాకుండా క్యారెక్టర్స్ కనిపిస్తున్నాయని ప్రేక్షకులు అంటున్నారు' అని అన్నారు. దర్శకుడు నిఖిల్ మాట్లాడుతూ 'మా సినిమాకి వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందం కలుగుతోంది' అని చెప్పారు. కథానాయకుడు ఇంద్రారామ్ మాట్లాడుతూ 'ఈ రోజుల్లో ఆడియన్స్ థియేటర్లకు రావడం కష్టంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా సినిమాకి వచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నిధి కోసం సాహసయాత్ర



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాకు 'ఎన్‌సీ24' అనేది వర్కింగ్ టైటిల్. మైథలాజికల్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా సాగే ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులకు సంబంధించిన ఓ మేకింగ్ వీడియోను టీమ్ తాజాగా విడుదల చేసింది. సాహసయాత్ర ఆరంభం అని తెలిపింది. ఇందులో అద్భుతమైన లోకేషన్లను, సినిమా నేపథ్యాన్ని ప్రతిబింబించే సెట్ డిజైన్లను, వీఎఫ్ఎక్స్ హంగుల కోసం సాంకేతిక బృందం చేస్తున్న పనులను చూపించారు. అలాగే, నాగచైతన్య లుక్‌తో సహా కీలక పాత్రల లుక్ టెస్ట్ స్టిల్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఇందులో మునుపెన్నడూ పోషించని పాత్రను నాగచైతన్య పోషిస్తున్నారు. వీడియోను చూస్తుంటే ఆయన నిధి అన్వేషణలో సాగే ఓ సాహసయాత్రికుడిలా కనిపిస్తున్నారు. బాపినీడు సమర్పణలో దర్శకుడు సుకుమార్, బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



యువతను మెప్పించే చిత్రం

సుధీశ్ వెంకట్, అంకిత జంటగా అరవింద్ జాషువా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్యాషన్'. అరుణ్ కుమార్, నరసింహ నిర్మాతలు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్యాషన్ నవల చదివాను. బాగా నచ్చింది. ఆ కథను అరవింద్ జాషువా చాలా అద్భుతంగా తెరకెక్కిస్తాడనే నమ్మకం కలిగింది. తన బ్యాగ్రౌండ్ అయిన ఫ్యాషన్ టెక్నాలజీ నేపథ్యంలో సినిమా తీయడం అభినందించాల్సిన విషయం' అని అన్నారు. చిత్ర దర్శకుడు అరవింద్ జాషువా మాట్లాడుతూ 'సెలబ్రిటీలు, వీఐపీల పిల్లలు చదివే 'నిఫ్ట్' కాలేజీలో ఒక మామూలు పిల్లాడు చేరితే ఎలాంటి కష్టాలు ఎదురవుతాయనేది ఈ చిత్ర కథ' అని తెలిపారు.

పురాణ నేపథ్యంలో



ప్రస్తుతం మైథలాజికల్ టచ్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండడంతో ఆ తరహా చిత్రాల నిర్మాణం ఎక్కువైంది. ఇటువంటి నేపథ్యంలో జగదీశ్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'యముడు'. ధర్మో రక్షతి రక్షితః అనేది ఉప శీర్షిక. ఇందులో శ్రావణి శెట్టి కథానాయిక. ఈ మూవీకి చెందిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఇందులో యముడి గెటప్‌లో జగదీశ్ కనిపించారు. ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తారు. ఈ చిత్రానికి రచన: హరి అల్లసాని, జగదీశ్ ఆమంచి, సంగీతం: భవానీ రాకేశ్, డీఓపీ: విష్ణురెడ్డి వంగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రజని ఆమంచి.

ఏఆర్ రెహ్మాన్ రూ.2 కోట్లు చెల్లించాలి

● ఢిల్లీ హైకోర్టు ఆదేశం



దర్శకుడు మణిరత్నం రూపొందించిన 'పొన్నియిన్ సెల్వన్-2' మూవీలోని 'వీరా రాజ వీర' పాటకు సంబంధించిన కాపీరైట్ కేసులో సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ హైకోర్టు రిజిస్ట్రార్‌కు రూ.2 కోట్లు, పిటిషన్‌దారుడికి రూ.2 లక్షలు చెల్లించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారత శాస్త్రీయ గాయకుడు ఫయాజ్ వాసిఫుద్దీన్ ఠాకూర్ 2023లో ఢిల్లీ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. 'పొన్నియిన్ సెల్వన్-2' మూవీలోని ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచిన 'వీరా రాజ వీరా' పాట తన తండ్రి నజీర్ ఫయాజుద్దీన్ ఠాకూర్, మామ జహీరుద్దీన్ ఠాకూర్‌లు స్వరపరిచిన శివస్తుతి పాట నుంచి కాపీ చేశారని, అందువల్ల ఈ పాటను ఎక్కడా ఉపయోగించకుండా ఏఆర్ రెహ్మాన్, మద్రాస్ టాకీస్‌లను ఆదేశించాలని, అలాగే కాపీరైట్ చట్టం కింద తనకు పరిహారం చెల్లించాలని అభ్యర్థించారు. అదే సమయంలో రెహ్మాన్ తరఫున కూడా కౌంటర్ దాఖలు చేయడం జరిగింది. వీటిని నిశితంగా పరిశీలించి, పలు దఫాలుగా విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తుదితీర్పును వెలువరించింది. ఈ కేసులో రెహ్మాన్ తరఫు న్యాయవాదులు వినిపించిన వాదనలను తోసిపుచ్చి.. కాపీరైట్ చట్టం కింద రూ.2 కోట్లను హైకోర్టు రిజిస్ట్రార్‌కు, పిటిషన్‌దారుడికి రూ.2 లక్షలు చెల్లించాలని ఆదేశించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

తుమ్మల.. ఎలా ఉన్నారు?.. పలకరించిన రాహుల్



భారత్ సదస్సులో తన ప్రసంగం అనంతరం వెళ్లిపోతున్న క్రమంలో వేదికపై ఉన్న మంత్రి తుమ్మలను రాహుల్ దగ్గరకు పిలిచారు. ఎలా ఉన్నారంటూ ఆప్యాయంగా పలకరించారు. తుమ్మలతో కరచాలనం చేశారు

రాహుల్‌కు పుస్తకమిచ్చిన సీతక్క



రాహుల్‌గాంధీకి.. ఇందిరాగాంధీకి నెహ్రూ రాసిన లేఖల సమాహారంతో రూపొందిన "లెటర్స్ ఫ్రం ఏ ఫాదర్ టూ హిజ్ డాటర్" పుస్తకాన్ని మంత్రి సీతక్క బహూకరించారు.

చరఖా తిప్పిన మంత్రి పొంగులేటి..



భారత్ సమ్మిట్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐసీసీలో ఏర్పాటుచేసిన చరఖా స్టాల్ దగ్గరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెళ్లారు. ఆయన కూడా అక్కడ కూర్చుని నూలు వడికారు.



ముత్యాలపై విదేశీ మహిళ మురిపెం!

భారత్ సదస్సుకు హాజరైన విదేశీ మహిళ ఒకరు ముత్యాలపై మనసు పారేసుకున్నారు. సెర్బియాకు చెందిన సదరు మహిళ ముత్యాలను విక్రయించే స్టాల్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న ముత్యాలను చూస్తూ పరవశించిపోయారు. "సో నైస్" అంటూ.. నచ్చిన వాటిని కొనుగోలు చేశారు. రూ.2,400 విలువ చేసే ముత్యాలను ఆమె కొనుగోలు చేశారని దుకాణదారుడు తెలిపారు.

సంక్లిష్టంగా ప్రపంచ రాజకీయాలు

- ఐక్యత, ధైర్యంతోనే అన్యాయాన్ని ఎదుర్కోగలం
- యూరోపియన్ సోషలిస్టు పార్టీ నేత జొకోమో
- భారత్ సమ్మిట్‌లో 'నమస్తే' అంటూ ప్రసంగం ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): "మనకు సమయం తక్కువగా, సవాళ్లు భారీగా ఉన్నాయి. కానీ కలిసి పనిచేస్తే అందరికీ న్యాయం అందించగలం. న్యాయం, గౌరవం, ఐక్యత.. విజయం సాధించేలా కలిసి పనిచేద్దాం" అని యూరోపియన్ సోషలిస్టు పార్టీ సెక్రటరీ జనరల్ జొకోమో పిలుపునిచ్చారు. భారత్ సమ్మిట్‌కు హాజరైన ఆయన.. 'నమస్తే' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ఆయన... 'అందరం ఒక్కటే' అనే అంశంపై మాట్లాడారు. జాత్యహంకారం, ఉగ్రవాదం, పర్యావరణ విధ్వంసం, మైనారిటీలపై హింస.. ఇలా అనేక రూపాల్లో అన్యాయం కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆయా అంశాల్లో నిజమైన న్యాయం, జవాబుదారీతనం అవసరమన్నారు. ప్రతి సమాజం ఏదో ఒక రూపంలో అన్యాయంతో పోరాడుతుందని, ఐక్యత, ధైర్యంతోనే దాన్ని ఎదుర్కోగలమన్నారు. ప్రపంచంలోని 140పైగా దేశాలు యుద్ధం, అసమానతలు, అన్యాయాలను ఎదుర్కొనేందుకు గతంలో కట్టుబడ్డాయని, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆ కట్టుబాట్లను అన్ని దేశాలు అర్థం చేసుకున్నాయా? లేదా? అనే సందేహం కలుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో రాజకీయ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయని, రాజకీయ నాయకులు ప్రభుత్వ పాలనలో తీసుకునే నిర్ణయాలు కొన్నిసార్లు ఇబ్బందులకు గురిచేస్తాయని అన్నారు. ఇటీవలి కాలంలో మానవ హక్కుల ఉల్లంఘనలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దేశాల్లో రాజకీయ తటస్థత దెబ్బతినడంతో విద్యాసంస్థలు, స్వతంత్ర గొంతుకలు మూగబోతున్నాయన్నారు. సభావేదికపై రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ మధ్య కూర్చున్న జొకోమో తన ప్రసంగంలో ఉద్వేగభరితంగా మాట్లాడారు. తన ప్రసంగం అనంతరం.. ఆయన మాట్లాడిన పలు అంశాలపై రాహుల్‌గాంధీతో చర్చించారు.

కొత్త తరం రావాలి

(మొదటిపేజీ తరువాయి)

విదేశీ ప్రతినిధులనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. ప్రస్తుత దుందుడుకు రాజకీయాల్లో ప్రతిపక్షాన్ని తొక్కేస్తున్నారని, తాము మాట్లాడకుండా అన్ని మార్గాలను మూసేస్తున్నారని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వారిదంతా ప్రతిపక్షాలను తొక్కేసే విధానమన్నారు. ఆధునిక రాజకీయాల్లో ప్రేమ, సహనం అవసరమని, విద్వేష రాజకీయాలను ఎదుర్కోవాలంటే ప్రేమే మార్గమని అన్నారు. పగ, విద్వేషాలను ద్వేషంతో ఎదుర్కోవడం సరికాదని, ప్రేమతోనే వాటిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలు తమ పట్ల కోపం, విద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాయని, భయపెట్టాలని చూస్తున్నాయని తెలిపారు. అయినా.. కాంగ్రెస్ పార్టీ వాటి పట్ల ప్రేమతోనే మసలుకుంటుందని చెప్పారు.



బేగంపేట విమానాశ్రయంలో రాహుల్‌గాంధీకి స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి



ప్రజలతోనే మమేకమవుతాం..

దేశంలో చోటుచేసుకున్న విధ్వంసకర రాజకీయాల వల్ల కాంగ్రెస్ పార్టీని అణగదొక్కే పరిస్థితులు ఏర్పడ్డాయని రాహుల్ గాంధీ తెలిపారు. ప్రతిపక్షం మాట్లాడే మార్గాలన్నింటినీ మూసేశారని, మీడియా కూడా వారితో రాజీ పడిందని ఆరోపించారు. ఇలాంటి సందర్భంలో తాము నేరుగా ప్రజలతోనే మమేకం కావాలని నిర్ణయించుకున్నామన్నారు. తమ వ్యతిరేకులు పగ, విద్వేషాలతో నిండిపోయారని, అలాంటి వారితో పోటీ పడలేకపోయామని, విద్వేషాలు, కోపతాపాలతో తాము పని చేయలేకపోయామని చెప్పారు. విద్వేషాలకు వ్యతిరేకంగా పని చేయాలంటే ఎలాంటి మార్గాన్ని ఎంచుకోవాలన్న విషయమై తమ పార్టీ రకరకాలుగా ఆలోచించిందన్నారు. అందులో భాగంగానే.. ప్రజలు ఏం మాట్లాడుతున్నారో, ఏం చెప్పదలచుకున్నారో వినాలనుకున్నామని తెలిపారు. వారికి ప్రజల బాధలు వినడం తెలియదని, ఎందుకంటే వారికి సమాధానాలు తెలుసునని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రజల బాధలు వినడం అత్యంత ముఖ్యమని, ఇందుకోసమే తాను కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4వేల కిలోమీటర్లు 'భారత్ జోడో' పేర పాదయాత్ర చేశానని గుర్తు చేశారు. ఆ యాత్ర సందర్భంగా తమతో వేలాది మంది కలిసి వచ్చారని పేర్కొన్నారు. చాలా మంది వచ్చి తనతో మాట్లాడేవారని, అప్పుడు వారి బాధలు విన్నానని చెప్పారు. అప్పుడే 'వినడం' నేర్చుకున్నానని, పాదయాత్రలో కొన్ని రోజుల తర్వాత తాను మాట్లాడడం మాని, వినడానికే ప్రాధాన్యమిచ్చానని తెలిపారు. ప్రజలకు ఏదైనా చెప్పాలనుకుంటే ఇదే చాలా ప్రభావవంతమైన విధానమని తెలుసుకున్నానన్నారు.

ఆ విషయంలో విఫలమయ్యాం..

సోషల్ మీడియా, ఇతర కమ్యూనికేషన్ మాధ్యమాల కారణంగా ప్రజలు ఏం చెబుతున్నారో వినలేపోయామని రాహుల్ తెలిపారు. ఈ విషయంలో తాము విఫలమయ్యామన్నారు. అందుకే తాము ప్రజలను నేరుగా కలవాలనుకుంటున్నామని, వారి పిల్లల విద్యకు, ఆర్థిక పరిపుష్టికి సహాయ పడతామనే విధానంతో వెళ్లాలనుకుంటున్నామని చెప్పారు. ప్రజల పట్ల ప్రేమ అనేది తన రాజకీయ జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని, ప్రజలతో మమేకం కావడాన్ని మరింత సులభతరం చేసిందని అన్నారు. తాము పాదయాత్ర సందర్భంలో ఇచ్చిన 'విద్వేషపు మార్కెట్‌లో ప్రేమ దుకాణం' అనే నినాదం ఇప్పుడు దేశంలో చాలా పవర్‌ఫుల్ నినాదంగా మారిందన్నారు. ఇక్కడ జరిగిన చర్చలు తప్పకుండా భారతదేశంలో కొత్త రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రసంగ ప్రారంభంలో సదస్సుకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులకు రాహుల్ స్వాగతం పలికారు. కశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడి నేపథ్యంలో తమకు సంఘీభావంగా నిలిచారంటూ ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్‌గాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క స్వాగతం పలికారు. సదస్సు ముగిసిన అనంతరం సాయంత్రం 7గంటలకు రాహుల్ తిరిగి ఢిల్లీకి వెళ్లారు.

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఖండిస్తాం

ప్రజాస్వామ్య, కార్మిక ఉద్యమాలకు మద్దతిస్తాం

భారత్ సదస్సు-2025లో తీర్మానం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న దేశాల చర్యలతోపాటు ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఖండిస్తున్నట్లు భారత్ సదస్సు-2025 ప్రకటించింది. ప్రపంచంలోని ప్రగతిశీల శక్తులతో కలిసి ప్రజాస్వామ్య, కార్మిక ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తూ సమన్యాయానికి కట్టుబడి ఉంటామని తెలిపింది. స్థిరమైన ప్రగతి, భవిష్యత్తు తరాల కోసం శాంతియుత పంథాలో ముందుకు సాగుతామంటూ తీర్మానం చేసింది. నియంతృత్వ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తూ.. స్వాతంత్ర్య కాంక్షను నియంత్రిస్తున్నాయని, అబద్ధాలను వ్యాప్తి చేస్తూ, విభజన వాదాన్ని ప్రేరేపిస్తూ పౌరహక్కుల అణచివేతకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. ఇలాంటి చర్యల వల్ల అసమానతలు పెరుగుతాయని, నియంతృత్వ ప్రభుత్వాలు విమర్శకులను నియంత్రించడానికి చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని పేర్కొంది. సోషల్ మీడియాతోపాటు సంప్రదాయ మీడియాను తప్పుదోవ పట్టిస్తూ.. విభేదించేవారిపై, హక్కుల కోసం గళమెత్తే వారిపై నిఘాపెడుతున్నాయని తీర్మానంలో భారత్ సదస్సు ఆక్షేపించింది. చట్టాన్ని అనియంత్రిత అధికారంతో కట్టడి చేస్తుండటం అవినీతికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. మైనారిటీలు, శరణార్థులు, వలసదారుల విషయంలో అనుసరిస్తున్న క్రూర విధానంపై ఆందోళన చెందుతున్నామని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అణచివేయబడుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాలకు అండగా నిలుస్తామని, యుద్ధం కన్నా శాంతిని కోరుకుంటామని పేర్కొంది. రాష్ట్రాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా, అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని కోరుకుంటున్నామని స్పష్టం చేసింది. కార్పొరేట్ గుత్తాధిపత్యాన్ని, క్రోనీ క్యాపిటలిజాన్ని, ట్యాక్స్ హెవెన్ దేశాల్లో నల్లధనం దాచడాన్ని వ్యతిరేకిస్తామని తెలిపింది. పర్యావరణ పరిరక్షణ, ధరిత్రిని కాపాడుకోవడానికి ప్రపంచదేశాలు తీసుకుంటున్న అన్ని చర్యలకు మద్దతుగా ఉంటామని ప్రకటించింది. సంఘీభావం, అహింస, సత్యం, న్యాయం ద్వారా ఈ వసుధైక కుటుంబంలో అందరికీ సమన్యాయం ఉండాలని కోరుకుంటున్నామని, సమాన అవకాశాలను పెంపొందించడానికి, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, తరాల పేదరికాన్ని రూపుమాపడానికి ఆర్థిక విధాన పునర్నిర్మాణం అవసరమని భావిస్తున్నామని వివరించింది.

తలసరి ఆదాయమే అభివృద్ధికి ప్రామాణికమా?

కార్పొరేట్ శక్తులను నియంత్రించాలి: ఆర్థికవేత్త కౌశిక్ బసు

దేశ సంపదను జీడీపీలో లెక్కించి, తలసరి ఆదాయన్ని బట్టి దేశాభివృద్ధిని ప్రకటించి సంబరాలు చేస్తున్నారని ప్రముఖ ఆర్థికవేత్త కౌశిక్ బసు విమర్శించారు. తలసరి ఆదాయమే అభివృద్ధికి ప్రామాణికమా అని ప్రశ్నించారు. 'ఎకనామిక్ జస్టిస్ ఇన్ అన్‌సెర్టన్ టైమ్స్'పై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరల్డ్ బ్యాంక్ లెక్కల ప్రకారం అట్టడుగు నుంచి 40 శాతం వర్గం ప్రజల జీవన స్థితిగతులు, వారి తలసరి ఆదాయం పరిగణనలోకి తీసుకుంటే దేశాభివృద్ధి తెలుస్తుందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం కొన్ని కార్పొరేట్ శక్తుల ఆధీనంలో ఉందని, ఆ శక్తులను నియంత్రించాల్సిన అవసరముందని అన్నారు. దేశాలు కార్పొరేట్ శక్తులను నియంత్రించినప్పుడే ఆర్థిక సమానత్వాన్ని సాధిస్తాయని ఆయన తెలిపారు. పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ధనవంతుడు ఇంకా ధనవంతుడవుతుంటే పేదోడు మరింత పేదోడిగా మిగిలిపోతున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు.



గతకాలపు జ్ఞాపకాలు





హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సదస్సు-2025 లో గతకాలపు జ్ఞాపకాలను తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఫొటో ఎగ్జిబిషన్ కోసం ప్రత్యేకంగా కొన్ని పెద్ద పెద్ద స్టాండింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాటిపై మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ, రాజగోపాలాచారి, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, ఇందిరాగాంధీ, అంబేడ్కర్ తదితరుల ఫొటోలను ప్రదర్శించారు. కాగా 1962 సెప్టెంబర్ 22న అప్పటి ప్రధాని నెహ్రూతో పాటు ఇందిరా గాంధీ.. ఫ్రెంచ్ దేశ అధ్యక్షుడు జనరల్ డీ గౌల్‌తో ప్యారిస్‌లోని ఎలీస్ ప్యాలెస్ ప్రవేశద్వారం వద్ద మాట్లాడుతున్న ఫొటోను కూడా ఏర్పాటు చేయగా.. అది అందరినీ ఆకట్టుకుంది.

మహిళా సంఘాలకు ప్రోత్సాహకాలు

- పుస్తక రూపంలో వాళ్ల సక్సెస్ స్టోరీలు ఇవ్వాలి
- జనజీవనంలోకి వచ్చిన తర్వాతే నా చదువు కొనసాగింపు: సీతక్క

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల ప్రోత్సాహకాలు అందిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాల సక్సెస్ స్టోరీలను పుస్తక రూపంలో ఇవ్వడం ద్వారా ఇతరులకు స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. భారత్ సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులను వెంటపెట్టుకుని శనివారం రాత్రి శిల్పారామంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌ను మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుమ్మరి చక్రంపై కుండ తయారీ చేయగా.. వృత్తిదారుకు చెందిన బాలిక కుండ తయారీలో మంత్రికి మెళకువలు నేర్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ చదువును నిర్లక్ష్యం చేయకుండా మంచిగా చదువుకోవాలని బాలికకు సూచించారు. మహిళా సంఘానికి చెందిన రాధ తన జీవిత స్టోరీని పరిచయం చేయడం సంతోషంగా ఉందని, ఆమె ఐకేపీ సెంటర్ నడుపుకొంటూ చదువుకోవాలనుకోవడం అభినందనీయమన్నారు. ఆమెలో తనను చూసుకుంటున్నానని, తాను కూడా పదో తరగతితో చదువు ఆపేశానని, అజ్ఞాతం వీడి జనజీవనంలోకి వచ్చిన తర్వాత తిరిగి చదువు కొనసాగించినట్లు చెప్పారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ చేశానని తెలిపారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల సక్సెస్ స్టోరీలను విదేశీయులు ఇక్కడికి వచ్చి వింటున్నారని, రాష్ట్రానికి ఎవరు వచ్చినా మిమ్మల్ని కలవకుండా వెళ్లే పరిస్థితి లేదన్నారు.



భారత్ సదస్సు ఓ స్టాల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నంప్రభాకర్, కొండా సురేఖ

ప్రజలు కేంద్రంగా సంక్షేమం, అభివృద్ధి: భట్టి

తెలంగాణలో ప్రజలే కేంద్రంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని.. ప్రజలు కేంద్రంగానే పరిపాలన సాగిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. భారత్ సదస్సులో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు చెప్పుకొనేందుకు భారత్ సదస్సు ఒక వేదిక మాత్రమే కాదని... అనేక విషయాలు నేర్చుకునేందుకు ఉపయోగపడిందని చెప్పారు. అహింస, స్వాతంత్ర్యం, శాంతి అంశాలను ఈ సదస్సు ద్వారా గ్రహించామని తెలిపారు. తాము ఇప్పటికే ఈ మూడింటిని కొనసాగిస్తున్నామని.. భవిష్యత్తులో తమ విధానాలు, పథకాలు, ఆలోచనల్లో వీటిని మరింత సమర్థవంతంగా పాటిస్తామని వివరించారు. ఇంత భారీ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని చెప్పారు.

చేయాల్సింది చాలా ఉంది..

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. ముందుకు వెళుతున్నాం.. మా మిషన్‌లో మీరూ చేరండి

- మీ నైపుణ్యాలను మాతో పంచుకోండి
- 'తెలంగాణ రైజింగ్' బ్రాండ్ అంబాసిడర్లుగా రాష్ట్ర గొప్పతనాన్ని ప్రపంచానికి చాటండి
- భారత్ సదస్సులో ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు



మహిళలకు కిట్‌లను అందజేస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజానికి ఇప్పుడే పని మొదలుపెట్టామని.. చేయాల్సింది ఇంకా చాలా ఉందని చెప్పారు. ప్రజల జీవితాలను మార్చేందుకు తాము చేపట్టిన మిషన్‌లో చేరాలని అందరినీ ఆహ్వానిస్తున్నానని 'భారత్ సదస్సు'లో పాల్గొన్న దేశ విదేశాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. "మీ అనుభవం, పరిజ్ఞానం, నైపుణ్యాలను మాతో పంచుకోండి. మీరే 'తెలంగాణ రైజింగ్' బ్రాండ్ అంబాసిడర్లుగా మారి తెలంగాణ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పండి" అని కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సదస్సులో శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో కుల సర్వే నిర్వహించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణమని చెప్పారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టిన మొదటి రాష్ట్రంగా కూడా తెలంగాణ నిలిచిందన్నారు.

ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదు..

తెలంగాణకు ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయని.. ప్రత్యేక రాష్ట్రం కోసం దశాబ్దాల పోరాటం జరిగిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళల పోరాటం వల్లే తెలంగాణ ఏర్పడిందని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చి పదేళ్లయినా ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని.. ఆ ఆకాంక్షల సాధన కోసమే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశ చరిత్రలోనే అతిపెద్ద సంక్షేమ పథకాలను ప్రారంభించామని చెప్పారు. 2024 ఆగస్టు 15న రూ.20,617 కోట్లతో.. 25లక్షల 50 వేల మంది రైతులను రుణ విముక్తులను చేశామని.. దేశంలోనే ఇది అతిపెద్ద రుణమాఫీ అని తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, ఏటా ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా, భూమిలేని రైతుకూలీలకు ఏటా రూ.12వేలు సాయం తదితర అంశాలను వివరించారు. భూమిలేని, భూమి ఉన్న రైతులకు కలిపి ఏటా రూ.20,000 కోట్లకు పైగా నిధులు ఇస్తున్నామన్నారు. నాడు భారత తొలి ప్రధాని నెహ్రూ ప్రధానంగా నీటి పారుదల, విద్య అంశాలపై దృష్టి సారించారని.. ఇందిరాగాంధీ రోటీ, కపడా ఔర్ మకాన్ నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రధానులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్.. ఆధునీకరణ, అభివృద్ధి, టెలికాం, సాఫ్ట్‌వేర్ వంటి సాంకేతిక విప్లవాలపై దృష్టి సారించారని వివరించారు. వారి కృషి వల్లే భారత్ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని చెప్పారు. తాము అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 60 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఏడాదిలోనే రాష్ట్రానికి రూ.2.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించామని వివరించారు.

రాష్ట్రంలో మహిళా సాధికారత..

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చూడాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నామని సీఎం చెప్పారు. సోలార్ పవర్ ప్లాంట్లు, ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులకు మహిళలను యజమానులను చేశామన్నారు. తొలి ఏడాది 4,50,000 కుటుంబాలకు సొంత ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 22వేల కోట్లు అందించనున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని.. ఇందుకోసం 15 నెలల్లో రూ. 5వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం పథకాలనూ వివరించారు. మూసీ పునరుజ్జీవనంతో హైదరాబాద్‌కు కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. భవిష్యత్తులో మూసీ హైదరాబాద్ నగరానికి అతిపెద్ద ఆకర్షణగా మారి వేలాది మందికి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో 30వేల ఎకరాల్లో ప్రపంచస్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.



టూరిజం ప్లాజాలో బీసీ గురుకుల ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి పొన్నం

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఇంటర్ బీసీ గురుకుల, హాస్టల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసిన మంత్రి పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, ఉత్తమ ప్రతిభతో గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. శనివారం బేగంపేట టూరిజం ప్లాజాలో ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 162 మంది మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల, బీసీ హాస్టళ్ల విద్యార్థులను మంత్రి సన్మానించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.

పొన్నం చొరవతో స్వస్థలానికి గల్ఫ్ బాధితుడు

హుస్నాబాద్/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి ఇబ్బందులు పడుతున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్య ఎట్టకేలకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో శనివారం ఇంటికి చేరుకున్నారు. నెల రోజుల క్రితం దుబాయ్ వెళ్లిన లింగయ్య.. తన ఆరోగ్యం క్షీణించిందని, కాళ్లవాపులతో నడువలేక పోతున్నానని, తిరిగి ఇంటికి వెళ్లకుండా కంపెనీ వారు పాస్‌పోర్టు తీసుకున్నారని సెల్ఫీ వీడియో తీసి పంపించారు. తనను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ స్వదేశానికి రప్పించాలని వేడుకున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం స్పందించి దుబాయ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బీఎం వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్ మంద భీమ్‌రెడ్డిలను సమన్వయం చేశారు. అక్కడ వారు చొప్పరి లింగయ్య భారత్‌కు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ లింగయ్యకు విమాన టికెట్‌కు డబ్బులు చెల్లించి ఇంటికి తీసుకరావడానికి కృషి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగిన లింగయ్యను ఆయన భార్య రజిత కలుసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. తన భర్తను ఇంటికి తీసుకొచ్చేందుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ మహిళా సాధికారత కమిటీ సభ్యురాలిగా డీకే అరుణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా సాధికారత కమిటీలో సభ్యురాలిగా బీజేపీ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం అధికారక ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొత్తం 30 మంది సభ్యులతో జాతీయ మహిళా సాధికారత కమిటీని ఏర్పాటు చేయగా కమిటీ చైర్మన్‌గా కేంద్ర మంత్రి పురందేశ్వరి వ్యవహరిస్తున్నారు. తెలంగాణ నుంచి డీకే అరుణ సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి అరుణ కృతజ్ఞతలు తెలిపారు.

లిక్కర్ దందాల కవితకు రాహుల్ పేరెత్తే అర్హత లేదు: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ దందాలు చేసే కవితకు త్యాగాల కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీ పేరెత్తే నైతిక అర్హత లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ మీద పడి దొంగల ముఠా మాదిరి దోచుకుందని.. దోపిడీకి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని ధ్వజమెత్తారు. అగ్రనేత రాహుల్ ఆలోచన మేరకే కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 'లిక్కర్ దందాలతో కవిత దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. ఆమె రౌడీ కాబట్టే.. బహిరంగంగానే రౌడీనని చెప్పుకొంటున్నారు. అసలు రజతోత్సవ సభ బీఆర్ఎస్ కోసమా? టీఆర్ఎస్ కోసమా? వారికే స్పష్టత లేదు." అని అన్నారు

ఆట ముగిశాక నిబంధనల మార్పు చెల్లదు

- ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ పరీక్షలను తెలుగులోనూ జరపాలి: హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆట ముగిసిన తరువాత నిబంధనలు మార్చడం చెల్లదని హైకోర్టు పేర్కొంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం పరీక్ష నిర్వహించాల్సిందేనని, మధ్యలో వాటిని మార్చడం సరికాదని స్పష్టం చేసింది. గురుకుల విద్యాసంస్థల సొసైటీ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ పోస్టులకు సంబంధించిన పరీక్షలో నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు పాటించలేదని తెలిపింది. దాంట్లో పేర్కొన్న ప్రకారం మళ్లీ తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. ఇది 2023 నాటి నోటిఫికేషన్ కాబట్టి వీలైనంత వేగంగా భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. గురుకుల విద్యాసంస్థల్లో క్రాఫ్ట్ టీచర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ 7/2023 విడుదల చేశారు. నోటిఫికేషన్‌లో ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్లం భాషల్లో ఉంటుందని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 1న నిర్వహించిన పరీక్షల్లో ప్రశ్నపత్రాలు ఆంగ్ల భాషలో ఉండటంతో చాలా మంది సరిగ్గా పరీక్షలు రాయలేకపోయారు. రెండు భాషల్లో పరీక్షలు మళ్లీ నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా లాభం లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం విచారణ చేపట్టింది. నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష నిర్వహించడం చెల్లదని తెలిపింది.

ఎస్సీ వర్గీకరణ చట్టం చెల్లదు

- హైకోర్టులో మరో 2 పిటిషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో మరో రెండు పిటిషన్‌లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు సూచించిన విధంగా సంపన్న శ్రేణి నిబంధనను అమలు చేయలేదని పేర్కొంటూ ఇప్పటికే పిటిషన్ దాఖలయింది. దానికి తోడుగా.. చట్టబద్ధమైన డేటా ఏదీ లేకుండా ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చేపట్టిన వర్గీకరణ చెల్లదని పేర్కొంటూ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, ఎస్సీ ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు గడ్డం శంకర్ రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది డీవీ సీతారామ్మూర్తి వాదిస్తూ ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికకు చట్టబద్ధత లేదని తెలిపారు. దీనిపై సవివరంగా వాదనలు వినాల్సి ఉందన్న ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది.

జోగులాంబ ఆలయ అర్చకుడికి హైకోర్టు ఊరట

- ఆనంద్ శర్మ సస్పెన్షన్ నిలిపివేత

హైదరాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఆలయ పూజారి డి.ఆనంద్‌శర్మ సస్పెన్షన్‌ను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 26కు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ సమర్పించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించింది. ఎమ్మెల్యే అనుమతి లేకుండా ఫోటో తీశారనే కారణంతో ఉన్నతాధికారులు జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆనంద్‌శర్మ పిటిషన్ దాఖలు చేయగా.. మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అమోయ్‌కుమార్‌ను ప్రతివాదిగా చేర్చండి

- బిలాదాఖల భూమిని పట్టాగా పేర్కొనే అధికారం కలెక్టర్‌కు లేదు
- అమోయ్ ప్రొసీడింగ్స్‌పై హైకోర్టు స్టే

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బిలాదాఖల(ప్రభుత్వ) స్థలాన్ని పట్టాభూమిగా వర్గీకరిస్తూ.. సర్వే నంబర్లను కేటాయించేలా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హోదాలో ఆదేశాలు జారీ చేసిన అమోయ్‌కుమార్‌ను ప్రతివాదిగా చేర్చాలని హైకోర్టు ఆదేశించింది. బిలాదాఖల భూమి మార్పు అధికారం కలెక్టర్‌కు లేదని స్పష్టం చేసింది. భూముల వర్గీకరణ, రెవెన్యూ ఎంట్రీలపై వ్యాజ్యాలకు సివిల్ కోర్టు మాత్రమే పరిష్కరించాలని తేల్చిచెప్పింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలోని 20 ఎకరాల 12 గుంటల బిలాదాఖల భూమిని ప్రైవేటు వ్యక్తులకు చెందినట్లు పట్టాభూమిగా వర్గీకరిస్తూ.. సర్వే నంబర్లు కేటాయించాలని అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్ 2022 డిసెంబరులో జారీచేసిన ఆదేశాల(ప్రొసీడింగ్స్)పై హైకోర్టు స్టే విధించింది. ఈ వివాదం తేలేవరకు ఆ భూమి విషయంలో ఎలాంటి థర్డ్ పార్టీ ఇంట్రెస్ట్ సృష్టించరాదని.. భూమి స్వభావాన్ని మార్చరాదని ఆదేశించింది.



కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలోని సర్వే నంబర్లు 398, 400, 402 తదితరాల్లో ఎర్రపోతు శైలజ కుటుంబానికి 2 ఎకరాల 14 గుంటల భూమి ఉంది. ఈ సర్వే నంబర్ల చుట్టుపక్కల ఉన్న బిలాదాఖల(ప్రభుత్వ) భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారు. శైలజ భూమిలోకి రాకపోకలను నిలిపివేస్తూ.. ప్రహరీ నిర్మించారు. కృష్ణ రాంభూపాల్ అనే వ్యక్తి 20 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా పేర్కొనడాన్ని శైలజ హైకోర్టులో సవాలు చేశారు. దీనిపై చేవెళ్ల డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, శంకర్‌పల్లి తహసీల్దార్ సర్వే నిర్వహించి.. ప్రభుత్వ భూమిగా గుర్తించారు. బ్లూస్టిక్ ల్యాండ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ప్రభుత్వ భూమిని ఆక్రమించి, ప్రహరీని నిర్మించినట్లు కోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో తహసీల్దార్ పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించారని సర్వే ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్ పేర్కొంటున్నా.. రెండో ప్రతివాది అయిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2022 డిసెంబరు 29న విలేజ్ మ్యాప్‌లో సవరణ చేసి, కొత్త సర్వే నంబర్లను కేటాయించాలంటూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ప్రొసీడింగ్స్ దాఖలు చేయడంపై కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ కూడా.. 20 ఎకరాల 12 గుంటలను కృష్ణ రాంభూపాల్ అనే వ్యక్తి ఆక్రమించారని పేర్కొన్నా.. అప్పటి కలెక్టర్ పట్టించుకోలేదనే విషయం స్పష్టమవుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "భూముల వర్గీకరణ విషయంలో, రెవెన్యూ ఎంట్రీల విషయంలో వివాదం ఏర్పడినప్పుడు ఏంచేయాలనేది చట్టంలో చాలా స్పష్టంగా ఉంది. సదరు వివాదాల పరిష్కారానికి తగిన వేదిక సివిల్‌కోర్టు మాత్రమే. ప్రభుత్వ భూమిని ప్రైవేటు పట్టా భూమిగా వర్గీకరించే అధికారం.. సప్లిమెంటరీ సెత్వార్ లేదా కొత్త సర్వే నంబర్లు కేటాయించాలని ఆదేశించే అధికారం కలెక్టర్‌కు లేదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అధికారిక ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేసిన తర్వాత పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని.. అప్పటివరకు అప్పటి కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై మధ్యంతర సస్పెన్షన్ విధిస్తున్నట్లు తెలిపింది. ఈ వివాదం పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో థర్డ్ పార్టీ హక్కులు సృష్టించడం.. భూమి స్వభావం మార్చడం వంటివి చేయరాదని స్పష్టం చేసింది. తదుపరి విచారణ జూన్ 24కు వాయిదా వేసింది.

కర్రెగుట్టల్లో బలగాల ఉక్కిరిబిక్కిరి?

- డీహైడ్రేషన్‌తో 100 మంది వెనక్కి
- ఎన్‌కౌంటర్ జరిగిందంటూ ప్రచారం
- నిర్ధారించని ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- క్షేత్రస్థాయిలో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన

చర్ల/వెంకటాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కర్రెగుట్టలు' బలగాలకు ఇబ్బందికరంగా మారాయా? ఎండలు మండుతున్న వేళ.. ఈ ఆపరేషన్‌తో జవాన్లు నీరసించి, చతికిలపడిపోతున్నారా? కర్రెగుట్టల మధ్యన.. కీకారణ్యాలను తలపించే అడవుల్లో మావోయిస్టులు తలదాచుకోగా.. జవాన్లు వడదెబ్బ, డీహైడ్రేషన్‌కు గురవుతున్నారా? మూడ్రోజులుగా తెలంగాణవైపు వాజేడు, వెంకటాపురం, ఛత్తీస్‌గఢ్‌వైపు పూజారి కాంకేర్ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానం చెబుతున్నాయి. 280 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న కర్రెగుట్టల మధ్యన ఉన్న అడవులు పచ్చదనంతో అలరాడుతుండగా.. గుట్టల బయట వెలుపలి వైపు మాత్రం ఆకురాలిపోయి ఎండిన చెట్లు నిలువ నీడను కూడా ఇవ్వడం లేదు. రోజుల తరబడి నడక ఒకవైపు.. తీవ్ర చెమటలు, ఉక్కబోతతో ఇబ్బందులకు గురవుతున్న జవాన్లు డీహైడ్రేషన్‌కు గురవుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ వైపు హెలికాప్టర్ ద్వారా బలగాలకు నిత్యావసరాలు, తాగునీరు, ఇతర సామగ్రిని ఎప్పటికప్పుడు పంపుతున్నా.. ఛత్తీస్‌గఢ్ వైపు ఆ తరహా సరఫరాకూ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. గురువారం 15 మంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు. తాజాగా మరికొందరు జవాన్లు కూడా డీహైడ్రేషన్, జ్వరం కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. ఎండకు తోడు మందుపాతరలను నిర్వీర్యం చేసే క్రమంలో జవాన్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు సమాచారం. ఇక ఛత్తీస్‌గఢ్ వైపు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 'ఆంధ్రజ్యోతి' ఈ ప్రాంతంలో క్షేత్రపర్యటనలో ఉండగా.. శనివారం సుమారు 100 మంది డీఆర్‌జీ జవాన్లు వెనుదిరగడం కనిపించింది. వారంతా బీజాపూర్, సుకుమా క్యాంపులకు తిరిగి వెళ్లారని సమాచారం. అయితే.. అస్వస్థతకు గురవ్వడంతో వారిని వెనక్కి పంపారా? అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. పూజారి కాంకేర్ వైపు రాత్రిళ్లు జవాన్ల బస కూడా ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలిసింది. దోమలు, విషకీటకాలతో బలగాలకు కాస్త విశ్రాంతి తీసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని సమాచారం. కర్రెగుట్టల చుట్టూ సుమారు 4 వేల మంది జవాన్లు మోహరించినా.. చాలా మంది వేడి కారణంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. కాగా.. శనివారం ఉదయం నుంచి కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగిందని, 38 మంది మావోయిస్టులు చనిపోయారని ప్రచారం జరిగింది. అయితే.. ఛత్తీస్‌గఢ్ పోలీసులు దీన్ని నిర్ధారించలేదు. కేవలం సోషల్ మీడియాలో వస్తున్న వదంతులేనని కొట్టిపారేశారు.



హెలికాప్టర్ నుంచి మావోయిస్టుల కోసం అన్వేషణ

వెయ్యి మంది తలదాచుకునే గుహ

కర్రెగుట్టల్లో వెయ్యి మంది తలదాచుకునే వీలున్న ఓ భారీ గుహను భద్రతాబలగాలు శనివారం గుర్తించాయి. ఆ గుహలోనే నీటి సదుపాయం ఉన్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాయి. లోపల నిత్యావసరాలున్నాయని, బలగాల రాకను గుర్తించిన మావోయిస్టులు పారిపోయి ఉంటారని పేర్కొన్నాయి. కర్రెగుట్టల్లో ఇలాంటి గుహలు ఎన్నో ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశాయి.



ఎండ మండింది

- ఆదిలాబాద్ సిరికొండలో 45.5 డిగ్రీలు
- మెదక్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షం
- వడదెబ్బకు నలుగురి మృతి
- నేడు రాష్ట్రంలో కొన్ని జిల్లాలకు వర్షసూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. కొన్ని జిల్లాలు శనివారం నిప్పుల కొలిమిని తలపించాయి. కొన్ని జిల్లాల్లో సాయంత్రం అయ్యే సరికి వాతావరణం మారి వానలు బీభత్సం సృష్టించాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. నిరుడు ఏప్రిల్ చివరి వారంలో సగటున 45 డిగ్రీలలోపే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా ఈసారి ఏప్రిల్ మూడో వారం నుంచే 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం రాష్ట్రంలోనే అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్ జిల్లా నర్సాపూర్, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 45.4, జగిత్యాల జిల్లా రాయికల్, నిజామాబాద్ జిల్లా మెండోరలో 45.3, గద్వాల జిల్లా మల్దకల్‌లో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 41.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వడదెబ్బ వల్ల రాష్ట్రంలో శనివారం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన కొయ్యడ చంద్రమౌళి(45) అనే ఆటో డ్రైవర్, రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లికి చెందిన సయ్యద్ అహ్మద్(35), జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టపల్లికి చెందిన మిరుపూరి రాజయ్య(65) అనే వ్యవసాయ కూలీ, భద్రాచలం గ్రామ పంచాయతీ 13వ వార్డు మాజీ సభ్యురాలు మడెం లక్ష్మి(58) ఉన్నారు. ఇక, మెదక్ జిల్లా ఎలదుర్తిలో 3.4, వికారాబాద్ జిల్లా మొమిన్‌పేట్‌లో 2.6, మర్పల్లిలో 1.9, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 1.4 సెంటీమీటర్ల వర్షపాతం శనివారం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మెదక్ జిల్లా తూప్రాన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వర్షానికి తుప్రాన్ వ్యవసాయ మార్కెట్‌లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ రామప్పగుట్టపై ఆరబెట్టిన 40 క్వింటాళ్ల ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. అలాగే, వెల్దుర్తి మండలం ఆరెగూడెంలో ఓ కోళ్లఫారం కూలిపోయి రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. సంగారెడ్డి జిల్లాలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మామిడి, వరి పంటలు దెబ్బతిన్నాయి. ఇక, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాలకు వర్షానికి సంబంధించి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

బీఆర్ఎస్ రజతోత్సవానికి సర్వం సిద్ధం

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నేడు భారీ సభ
- మాట్లాడేది కేసీఆర్ ఒక్కరే.. అడిగేది కాంగ్రెస్ హామీలపైనే
- అదే సమయంలో బీజేపీపైనా విమర్శనాస్త్రాలు
- అన్ని జిల్లాల నుంచి జన సమీకరణకు ప్రణాళికలు

హైదరాబాద్/వరంగల్, ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు వేదికగా రజతోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ సర్వం సిద్ధం చేసింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద ఆదివారం సాయంత్రం 4.30గంటలకు జరిగే భారీ బహిరంగ సభ కోసం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జన సమీకరణపై దృష్టి పెట్టిన బీఆర్ఎస్ అధినాయకత్వం... దానికి తగ్గట్లు ప్రణాళికలు రూపొందించుకుంది. ఉమ్మడి వరంగల్‌తోపాటు సమీపంలోని ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నుంచి ప్రధానంగా జనసమీకరణ చేపడుతోంది. ఆయా జిల్లాల్లోని ఒక్కో నియోజకవర్గం నుంచి 30-50వేల మందిని తరలించేందుకు, మిగతా జిల్లాల నుంచి వీలైనంత మందిని తీసుకొచ్చేందుకు వీలుగా ఇప్పటికే పార్టీ నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. భారీ బహిరంగ సభలో మాట్లాడేది ఒకే ఒక్కరు. అది బీఆర్ఎస్ అధినేత కేసీఆరే. ఆయన ప్రధాన గురి కూడా మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైనే ఉంటుందని సమాచారం. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని, రైతు భరోసా ఇంకా ఇవ్వలేదన్న అంశాల నుంచి పలు హామీల అమలుపై అధికార కాంగ్రెస్‌ను ఆయన నిలదీయనున్నట్లు తెలిసింది. అదే సమయంలో అటు బీజేపీపైనా రాజకీయ విమర్శలుంటాయని సమాచారం.

పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకే..

పదేళ్ల పాలన తర్వాత బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన టీఆర్ఎస్.. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. ఆ ఓటమి నుంచి తేరుకోకముందే.. 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటునూ గెలుచుకోలేకపోయింది. దీంతో బీఆర్ఎస్ క్యాడర్ తీవ్ర నిరాశకు గురైంది. ఆ తరువాత వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. గత మార్చిలో జరిగిన పలు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉండటం గులాబీ శ్రేణులను మరింత నైరాశ్యంలోకి నెట్టింది. మరోవైపు.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుంచీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పెద్దగా బయటకు వచ్చింది లేదు. ఫామ్‌హౌస్‌లో తాను పిలిచిన నేతలు, తనను కలిసేందుకు వచ్చిన నేతలతోనే సమావేశాలు నిర్వహించారు. తాజాగా రజతోత్సవ సభతో కేసీఆర్ మళ్లీ ప్రజల ముందుకు రానున్నారు. గులాబీ శ్రేణుల్లో జోష్ నింపి.. తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఈ సభ దోహదపడుతుందని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. మొత్తం 154 ఎకరాల్లో ప్రధాన సభా ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా సభ: కేటీఆర్

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ సైనికులతోపాటు తెలంగాణ ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సభకు హాజరయ్యే వాళ్లందరూ గులాబీ రంగు దుస్తులు ధరించేలా చూసుకోవాలన్నారు.

దశ దిశ లేకుండా కాంగ్రెస్ పాలన

- మాయమాటలతోనే కాలం వెళ్లదీస్తున్నారు
- బీఆర్ఎస్.. ప్రజల కోసం పుట్టిన పార్టీ: హరీశ్ రావు



ఎల్కతుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఒక దశ, దిశ లేకుండా కాంగ్రెస్ పాలన సాగుతోందని, ఎవరికివారే మాయమాటలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 14ఏళ్లు ఉద్యమ పార్టీగా, పదేళ్లు అధికార పార్టీగా, ఏడాదిన్నర కాలంగా ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా వారి ఆకాంక్షల మేరకు పని చేస్తున్నామని, మున్ముందు కూడా రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఏటా 12 శాతానికి పెంచి వచ్చిన సంపదను పేదలకు పంచిందన్నారు. కానీ కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే ప్రభుత్వ వైఫల్యం వల్ల సీఎం రేవంత్ రెడ్డి చేతగాని పాలన వల్ల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. రైతుబంధు, రైతు బీమా పథకాలకు కేసీఆర్ చాంపియన్‌గా నిలిచారని కొనియాడారు. సమ్మక్క-సారలమ్మ ఎత్తిపోతల ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉన్నా చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం 45 రోజులు ఆలస్యంగా దేవాదుల మోటర్లను ప్రారంభించడంతో సకాలంలో సాగునీరు అందక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆయన మండిపడ్డారు.

కుంట్లూర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 400 గుడిసెలు బుగ్గి.. నిరాశ్రయులైన వేలాదిమంది
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



మంటల్లో కాలిపోతున్న గుడిసెలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీలో శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీని ధాటికి సుమారు 400 గుడిసెలు కాలి బూడిదయ్యాయి. కుంట్లూర్‌లోని భూదాన్ భూమిలో మూడేళ్ల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. అక్కడ వేలాది మంది నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం ఓ గుడిసెలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఆ ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు మరింత వ్యాప్తి చెంది పక్కనున్న గుడిసెలకు అంటుకున్నాయి. అలా ఒకదాని తర్వాత మరో దానికి మంటలు అంటుకుని సుమారు 400 గుడిసెలు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వేసవి కావడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందాయని వారు చెప్పారు. తమవారు చాలా మంది పనులకు వెళ్లడంతో తమకు కనీసం గుడిసెల్లో ఉన్న నిత్యావసర వస్తువులు, దుస్తులు, పిల్లల పుస్తకాలు, వంట సామగ్రితో పాటు ఇతర విలువైన వస్తువులు తీసుకునే సమయం కూడా లేకపోయిందని గుడిసెవాసులు బోరున విలపించారు. తాము సర్వం కోల్పోయి రోడ్డున పడ్డామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. కాగా, మంటలను సమీపంలోని 7 వేల గుడిసెలున్న ప్రాంతానికి వ్యాప్తి చెందకుండా సీపీఐ నాయకులు, స్థానికులు జాగ్రత్త పడడంతో మరింత పెద్ద ప్రమాదం తప్పింది. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించారు. ఈ ప్రమాదంపై తనకు అనుమానాలున్నాయని, అధికారులు విచారణ జరిపి ఇందులో కుట్ర కోణం దాగి ఉంటే వెలికి తీయాలని కోరారు. కాగా, ఎన్ని గుడిసెలు కాలిపోయాయో సర్వే నిర్వహించి, ప్రకృతి వైపరీత్యం కింద బాధితులకు సాయం అందిస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ తెలిపారు. ఘటనా స్థలిని రాచకొండ సీపీ సందర్శించారు. ప్రమాద కారణాలపై విచారణ జరిపిస్తామన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.